స్వాతంత్ర్యసేవా గ్రంథమాల ద్వితీయకుసుమము.

ఇటలీదేశ భక్తాగ్రగణ్య

గారిబాల్డీ జీవితము

1933

" Simple in act and word, his country's knight,
He gives his country all and nothing takes."

శరణు రామస్వామిచౌదరి,
గ్రంథకర్త.

వెల రు. 0-8-0

చెన్నపురి:
ఆంధ్రపత్రికా ముద్రాలయమున
ముద్రితము.
1934

TPLA107B169
2-50

అంకితము

బాల్యమాది నేటిదనుక

విద్యాబుద్ధుల కవకాశ మొసగి

కష్టసుఖములలో కాపాడి పోషించిన

జననీజనకులగు

కౌసల్యాదేవి, వేంకటరత్న చౌదరిగార్ల

పాదపద్మములకు భక్తిపూర్వకముగ

నర్పించుచున్నాను

తొలిపలుకు

ఈపుస్తకం ఇటలీదేశభక్తులగు గారిబాల్డీజీవితము. ఇటలీదేశమునకు మన భారతవర్షమునకు పరిస్థితులలో చాలా భేదం వున్నది. వారు హింసామార్గముల చేత స్వాతంత్ర్యమును పొందుటకు పాటుబడిరి. మన నవీన భారతమున కది గిట్టదు. మనము గాంధి మహాత్ముని నాయకత్వమున అహింసావ్రతమును బూని ఆత్మ బలి దాన మొసగి స్వాతంత్ర్యమునుపొంద దీక్షవహించితిమి. ఇటలీదేశీయుల దేశభక్తి మనకు మార్గదర్శి యగుగాక. వారి త్యాగమును మరువజాలము. అడగంగానే ప్రేమతో పీఠికను వ్రాసిన దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారికి నమస్కారములు. ఆంధ్ర యువకులు గ్రంథమును చదివి ప్రోత్సహించిన ఇట్టి గ్రంథములు యింకను వ్రాయవలయు నని సంకల్పము. అభినవ ఇటలీ నియంతచే పరిపాలింపబడుచున్నది. ఈ చరిత్ర మాపాఠకులకు ముందు అందజేయుదుము.

అమృతలూరు,
2-5-34

ఇట్లు: విన్నవించు
శరణు రామస్వామి చౌదరి,
గ్రంథకర్త.



శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు

పరిచయవాక్యములు

ప్రపంచేతిహాసములందు జాతులకును, సామ్రాజ్యములకును సంప్రాప్తములయ్యెడి నిమ్నోన్నతస్థితిగతులకు ఇటలీదేశచరిత్రము పరమప్రమాణము. ఒకకాలమున ప్రపంచేతిహాసములందు మహోన్నతపదవి నధిష్ఠించిన రోమక సామ్రాజ్యము క్షీణించి, ఇటలీదేశము దైన్యావస్థ ననుభవించుట ఇటలీదేశస్థులకేకాకను నితరదేశీయులకును విషాదాధ్యాయము. ఆస్ట్రియా, ఇటలీరాజ్యముల సమరములు స్వాతంత్ర్యసమరములలం దద్భుతాధ్యాయములు. వర్తమాన కాలమునందు ఆస్ట్రియారాజ్యము దైన్యావస్థ ననుభవించుటయును ఇటలీరాజ్యము ముసులోనిగారి నాయకత్వముక్రిందటను విజృంభించుటయును నిమ్నోన్నతములకు నిదర్శనము.

ఇటలీ స్వాతంత్ర్య సమరములందు మేజినీ, గారిబాల్డీగార్ల జీవితములు సువర్ణాక్షరములతో లిఖితములై ప్రపంచమునం దంతటను స్వాతంత్ర్యప్రియుల కాదర్శప్రాయములుగ నున్నవి. ప్రపంచేతిహాసములందు 19 వ శతాబ్దము మానవ స్వాతంత్ర్యవికాసయుగము. ఫ్రాన్సు పరివర్తనము యూరపు దేశములందు స్వాతంత్ర్యసంచలనమును గలుగజేసినది; ఇటలీయందు ప్రతిధ్వనిల్లినది. ఇటలీస్వాతంత్ర్యసమరమునందు గారిబాల్డీగారి త్యాగమును, కార్యదీక్షయు పరంజ్యోతివలెను ప్రకాశించుచున్నవి.

శ్రీయుత శరణు రామస్వామిచౌదరిగారు స్వాతంత్ర్య సేవాగ్రంథమండలి పక్షమునను గారిబాల్డీ జీవితము నొక గ్రంథముగను ప్రచురించిరి. మానవస్వాతంత్ర్యప్రియులు కార్య

రంగములం దనుభవించెడి కష్టపరంపరల నీగ్రంథావలోకన మవగతము చేయుచున్నది. మానవస్వాతంత్ర్యప్రియులకు గారిబాల్డీనామస్మరణము తారకనామస్మరణముగ నుండగలదు. హిందూస్థానమునందు ప్రవర్ధమానమగుచున్న స్వరాజ్య శాంతిసమరమునందు గారిబాల్డీగారి జీవిత మాదర్శప్రాయమై ఆశాజనకముగ నున్నది. సంసారయాత్రయందు జీవితాదర్శములు సఫలమగుటకు కష్టపరంపరలు సంప్రాప్తమగుట ప్రకృతిధర్మము. గారిబల్డీగారి దేశభక్తి, స్వాతంత్ర్యప్రియత్వము, కార్యపరత్వము, త్యాగశీలము మానవస్వాతంత్ర్య ప్రియుల కాదర్శప్రాయమై ఆచరణయోగ్యముగ నున్నది.

శ్రీయుత శరణు రామస్వామిచౌదరిగారు స్వాతంత్ర్య ప్రియులు, త్యాగపరాయణులు, భాషోపాసకులు, దేశభక్తులు. వారు రచియించిన గారిబల్డీ జీవితము స్వాతంత్ర్యోత్సాహపూరితమై మానవస్వాతంత్ర్యప్రియులకు పఠనయోగ్యముగ నున్నది. సరళమైన శైలి, గంభీరమైన భావములు, స్వాతంత్ర్య సేవాపరాయణత్వము, భక్తివిశ్వాసములు గ్రంథమున కమూల్యమైన ప్రయోజనమును సమకూర్చినవి. స్వాతంత్ర్యప్రియులయిన ఆంధ్రమహాజనులు గారిబాల్డీజీవితమునకు స్వాగతంబు నొసంగ శ్రీ రామస్వామిచౌదరిగారి ప్రయత్నమునకు ప్రోత్సాహాదరణముల నొసంగి స్వధర్మనిర్వహణమును జేయుదురుగాత! నాకీగ్రంథమునకు పరిచయవాక్యములను వ్రాయుట కవకాశమును గలుగజేసిన శ్రీ రామస్వామిచౌదరిగారికి కృతజ్ఞతాపూర్వక వందనములు.

భావ సం. పుష్య
శు. ౧౨, బుధవారము

కా. నాగేశ్వరరావు

గారిబాల్డి జీవితము

మొదటి అధ్యాయము

జీవితచరితము

మహాపురుషులు అవసరమైనపుడు జనించుట స్వాభావసిద్ధము. అధఃపతితమైన దేశములలో వీరపుంగవులు జన్మించి ఆయాదేశముల నుద్ధరించుట ప్రతిదేశ చరిత్రమునందును గాంచగలము. వాషింగ్టన్ జన్మించి అమెరికాదేశమును, నెల్సన్ జన్మించి ఆంగ్లదేశమును, శివాజీ జననమొంది చావనున్న హిందూస్థానమును ఉద్ధరించినటుల, జోసెఫ్ గారిబాల్డి ఉద్భవించి నిరంకుశ ప్రభువుల పాలనముచే కృంగి కృశించుచున్న ఇటలీదేశమును రక్షించెను. మన కథానాయకుడగు గారిబాల్డి 1807 సంవత్సరము జులైనెల 4-వ తేదీన నాయిస్నగరమునందు జననమొందెను. ఈనగరము దేశభక్తాగ్రగణ్యుడగు మేజినీ జన్మించిన జనోవానగరమునకు పశ్చిమమునను, వీరాగ్రగణ్యుడగు నెపోలియన్‌బోనపార్టు జనన

మొందిన కార్సికాద్వీపమునకు దక్షిణమునను విలసిల్లు చున్నది. ఇట్టి చరిత్రప్రసిద్ధమగు పరిసరములలో మన గారిబాల్డి జననమొంది తననామమును ప్రపంచేతిహాస మున చిరస్థాయిగ జేసికొని మనకు మార్గదర్శి యాయెను.

ఈయన తాతతండ్రులు ఓడలమీద కెప్టెన్ అధి కారులై తమ సాహసమును, నిపుణతను వెల్లడించి ధన మార్జించిరి. గారిబాల్డి తనపిత్రార్జిత ధనముతోబాటు వారి సహజసాహసమును, నిపుణతను, పట్టుదలనుగూడ సంపాదించెను. తన సంపదకు కారకుడైన సముద్రుని జూచి వినమ్రుడై నమస్కరించుచుండెడివాడు. ఆ సము ద్రుని దిలకించి ఉత్సాహమున నాట్య మొనర్చుచుండెడి వాడు. ఈవీరునికి కేవల ధైర్యస్థైర్యములే గాక కరుణ కూడ గలదు. బీదజనుల వీక్షించినపుడు బాష్పవద నుడై వారియెడ సానుభూతిని జూపుచుండెడివాడు. స్వార్థతకంటె పరోపకారమే పరమావధిగ నెంచుమహా నీయుడు. మహాపురుషుని కుండవలసిన సకలసద్గుణ ములు ఈయనలో మూర్తీభవించెను. ఇన్నిసద్గుణములు గలిగియుండుటకు ఈయనమాతృదేవియే కారకురాలు. ఈయమ సకలసద్గుణములకు గని.

ప్రపంచమున మహాపురుషు లగుటకు మాతృదేవతలే కారకురాండ్రు. నెపోలియన్, మేజినీ, శివాజీ వీరు లగుటకు వారివారితల్లులే కారకురాండ్రని చరిత్రలు చాటుచున్నవి. ఈవీరు లెల్లరు తమ సాహసమునకు, పట్టుదలకు, ఉదారమునకు, తేజమునకు తమ తల్లులే కారకురాండ్రని చెప్పియుండిరి. దేశము యొక్క భవిష్యత్తు నారీమణులమీదనే ఆధారపడియుండు నని యీ వీరులచరిత్రములు పఠించునపుడు తోచకమానదు. ఈ కారణముననే నెపోలియన్ వీరపుంగవుడు అధికారమునకు వచ్చినవెంటనే స్త్రీవిద్యాభివృద్ధికై పాటుబడెను. ఈప్రతిభాశాలి ఒకమారు "ఫ్రాన్సుదేశమాతలవలననే ఫ్రాన్సుదేశ ముద్ధరింపబడినద"ని నొక్కి వక్కాణించెను.

ఇటలీదేశభక్తాగ్రగణ్యుడును, మనకథానాయకుని గురుపుంగవుండు నగు మేజినీ ఎన్నికష్టములలో నున్నను తనమాతృదేవిసమాధికడ కరుదెంచి పూజించుచుండెడివాడు. యావజ్జీవము ఆదేవినామమును జపించుచుండెడివాడు. తనజీవితమున కాధారభూతురాలు తన తల్లియే యని పలుమారు పలికెను. మన కథానాయకుడగు గారిబాల్డిప్రతిభకుగూడ ఆయనతల్లియే పట్టుగొమ్మ.

గారిబాల్డిజనని వీరమాత, వీరపత్ని, ఉదార వనిత. తననాథుని వియోగమును సహింపనొల్లక పలురీతుల దుఃఖించెను. ప్రేమపాశముల జిక్కినదంప తులకు వియోగము దుస్సహముగదా! కాని ఇట్టి అంధకారమునగూడ వెలు గుండకపోదు. శోకించి, శోకించి ఈపవిత్రచరిత ముల్లోకనాయకుండగు ప్రభు వును భక్తితో, ప్రేమతో, ప్రార్థించి ఆత్మశాంతిని నొందెను. "మానవులు దుఃఖావస్థలోనే భగవానుని భక్తితో ప్రార్థించెద"రని ఈపూజ్యురాలు చెప్పెను. భోగలాలసులైన మానవులు భగవానుని మరచుట సహజము. అందువలననే ధనికులగు భక్తులు పరమ పితను జేరుటకు సర్వదా దుఃఖమునే కోరుదురు.

ఒకమారు మెడిటరేనియన్ సముద్రమునందు భయంకరమైన తుపాను వీచుచుండెను. సముద్ర మంతయు అల్లకల్లోలముగ నుండెను. సముద్రయానము జేయుబాటసారు లెల్లరు భీతావహులై తమప్రాణముల యరచేతులలో నుంచుకొనిరి. చిన్నచిన్ననావలు తలక్రిం దగుచు నీటితో సగము నిండుచుండెను. కొన్నినావలు బ్రద్దలుకాగా అందున్న మానవులు హాహాకారములు సల్పుచుండిరి. తుపానును గాంచుచున్న మానవు

లెల్లరు భయముతో విలపించుచుండిరి. అందును కోమలాంగులగు నారీమతల్లులు శోకించుట సహజము గదా! కాని మనగారిబాల్డితల్లి సముద్రప్రయాణము జేయుచున్న తనప్రాణనాథుని తలచుకొని శోకము జెందలేదు. అకుంఠితధైర్యముతో లోకరక్షకుండగు భగవానుని "హే పరమాత్మా! లోకబాంధవా! లోకపాలకుండవగు నీవు దయామయుడవు. నాప్రాణ నాథు డున్ననావను నిరపాయముగ రక్షింపుము" అని ప్రార్థించెను. ఈ వీరవనితయం దున్నసాహసము, సత్యసంధత, ఈశ్వరప్రేమ, మన గారిబాల్డిహృదయ ఫలకమున నాటుకొని జీవితపథమున కుపకరించెను.

జోసెఫ్ గారిబాల్డి మాతృభక్తిపరాయణుడు. తన తల్లి కేమాత్రము కష్టము గలిగినను చూడలేకపోయెడి వాడు. ఆమె యాజ్ఞల శిరసావహించుచుండెడివాడు. బాల్యమునుండియు నుగ్గుబాలతో దైవభక్తి, దేశభక్తి నూరిపోసెను. ఏపని చేసినను తనతల్లికి చెప్పక చేసెడి వాడు కాడు. ఆమె నొకదేవతామూర్తిగనే భావించి పూజించుచుండెడివాడు. ఆవీరమాత పరలోకమున కేగిన తరువాత గారిబాల్డి ఈవిధమున జెప్పెను. "నామాతృ దేవి నాజీవితమునకు సర్వస్వము. ఆమెయందుగల దైవ

భక్తి, దేశభక్తియే నన్ను దేశసేవకు పురికొల్పెను. ఆమె నన్ను ఏవిధమున ప్రేమించెడిదో చెప్పుటకు నా కలవిగాదు. ఆమెయందుగల దీనబాంధవప్రేమయే నన్ను బీదవారియెడల కరుణగలవానిగా జేసినది. ఆమె దీవనల బలముచేతనే దేశసేవలో నా కెన్నికష్టములు గల్గినను లెక్క జేసెడివాడను గాను. నా క్షేమముకొఱకై, నా జయముకొఱకై, ఎల్లపుడును దేవుని ప్రార్థించుచుండె డిది. దేశస్వాతంత్ర్యోద్యమమునకు చేయూత నొసం గుచు, నన్ను ద్విగుణీకృతోత్సాహునిగ జేయుచుండె డిది. నాసర్వస్వమగు మాతృదేవి, కరుణామూర్తి, ప్రేమమూర్తి నన్ను బాసిపోయెనుగదా! ఆవీరమాతకు ఆత్మశాంతి గలుఁగుగాక."

ఏదేశ భావిభాగ్యమైనను తల్లుల మీఁదనే యాధారపడి యున్నదని ప్రపంచమునఁ గల మేధావు లెల్ల రంగీకరించిరి. అందును అధఃపతితమైన దేశము లలో నారీమతల్లులసాయము లేనిది కించత్తైనను భాగ్య సముపార్జన ముండదు. భారతదేశమునగూడ శివాజీని, రాణాప్రతాపుని, కృష్ణదేవరాయలను, తిలక్‌మహా శయుని, గాంధిమహాత్ముని గన్నవీరమాతలు గలరు. భారతనారీమణు లెల్లరు ఆ వీరమాతలనే స్మరించుచు దేశకల్యాణమునకు దోడ్పడ ప్రార్థితలు.

మొదటి అధ్యాయము

గారిబాల్డి ఒకకుటీరమున జన్మించెను. ఆ కుటీరమునుండియే సాగరమును జూచుచుండెడివాడు. వచ్చుపోవు ఓడల జూచి చిందులు ద్రొక్కుచుండెడివాడు. వచ్చీరానిమాటలతో సంభాషించుచుండెడివాడు. ఆ దృశ్యములు చూచునపుడు ఆయన ఏదియో యాలోచించుచున్నటుల కన్పడెడివాడు ఆయన జనకుడు సముద్రప్రయాణమునకు వెళ్లిన దాది నిత్యము ఎపుడు వచ్చునాయని యెదురు చూచుచుండెడివాడు. వచ్చుచున్న ప్రతినావలోను తనతండ్రి వచ్చుచున్నాడేమో యని యెదురుచూచుచు, రానిచో నిస్పృహ జెందుచుండెడివాడు. తనతండ్రి వచ్చువఱకు ఆవిధముననే నిరీక్షించుచు, వచ్చిన వెంటనే ఎదురు పోయి ఆనందముగ నడిలో జేరెడివాడు. తండ్రియు తనివి తీరునటుల ముద్దాడి తాను విదేశములనుండి తెచ్చిన విచిత్ర వస్తువుల తన ముద్దుబాలుని కొసంగుచుండెడివాడు. ఆవస్తువులతో దానే తృప్తినొందక తనతో నాటలాడుకొను చెలికాండ్రకుకూడ వాని నిచ్చుచుండెడివాడు. బీదబాలుర జూచిన నత్యాదరముతో వారికి సకలవస్తువు లొసంగుచుండెడివాడు.

గారిబాల్డి కొంచెము పెద్దవాడైనతరువాత సముద్రతటమున నాడుకొనుచు క్రమముగ ఈతవేయుట

కూడ నేర్చుకొనెను. పాఠశాల లేనిదినములలో తప్పక సముద్రమున నీదుటకు పోవుచుండెను. రేవులోనున్న ఓడలమీద నెక్కి సముద్రమున దుముకుటకు మొదలిడెను. ఈతలో తనచెలికాండ్రలో ఎందరు ప్రయత్నించినను ఈయనను మించలేకపోయెడివారు. ఆటలలో గూడ చాల చురుకుగ నుండెడివాడు. దేహపరిశ్రమ కూడ చేయుచు బలము సంపాదించెను. కుస్తీ పట్టుచుండెడివాడు, స్ఫురద్రూపి.

గారిబాల్డి బాల్యమునుండియుగూడ కడు జాగ్రతగ మెలగుచుండెడివాడు. అనవసరసంభాషణ నెఱుంగడు. చిన్నతనముననే సద్గ్రంథపఠనమున కలవాటుపడెను. వృథాకాలయాపన యన్న గిట్టదు. సంభాషణలో చతురుడు. తనసహచరులను సోదరులవలె ప్రేమించును. సహచరులలో జగడములు సంభవించినపుడు తానే పరిష్కారకర్త. వారీయనను గౌరవించెడివారు. సదయహృదయుడు. ఆట లాడుకొనుచు ఒకమారు ఒకగొల్లభామను పట్టుకొని గృహమునకు తెచ్చుచుండెను. దారిలో దాని రెక్క ఒకటి విఱిగిపోయెను. దీనికై యీ కరుణార్ద్రహృదయుడు తన గదిలో జేరి గంటలకొలది తననిర్దయకు దుఃఖించెను.

మఱొకమారు నారీమణి యొకర్తు కాలు జారి తటాకమున పడ, తనప్రాణములకు లెక్కజేయక వెంటనే నీటిలో దుమికి ఆమెను కాపాడెను. ఇట్టి ఘటనలు పెక్కన్న లెక్కకు మిక్కుట మగును. ఈయన విద్యాభ్యాసమునాటికి తనతండ్రి సంపాదించిన ధనమును గోల్పోయెను. ధనాభావము గల్గినను కష్టపడి తండ్రి ధన మొసంగుచుండెను. ఈయన మేజినీయంత చుఱుకైనవాడు గాడు. ఆటలలో మేటి. వేట యన్న ప్రీతి. ఎవరైనను వేటకు బిలచిన పాఠశాల వదలికూడ పోయెడివాడు. ఒకమారు పాఠశాల వదలి ఆటలాడుకొనుటకు వెడలగ, సముద్రమున నొకచిన్ననావ దొరకెను. ముగ్గురు స్నేహితులతో దానిమీద నెక్కి జనోవా వెళ్లెను. నాయిస్ పట్టణమునకు జనోవా నగరము ౫౦ క్రోశములదూరము. వీరు వెళ్లుట గాంచినవారు గారిబాల్డి జననీజనకులకు తెలియజేసిరి. వెంటనే మరొకనావమీద వెంటాడి జనోవా చేరుచుండగనే పట్టుకొనిరి. తప్పించుకొనుటకు ఈయన సకలప్రయత్నములు గావించెను. కాని విఫలమనోరథుడయ్యెను. ఈనౌకాప్రయాణము ఆయనభవిష్యజ్జీవిత సంఘట్టనమును సూచించుచున్న దనుటలో నతిశయోక్తి యిసుమంతయును లేదు.

గారిబాల్డిని గ్రామములోని బాలు రెల్లరు మిక్కిలి ప్రేమించెడివారు. ఈయనలో గల చురుకుదనము, సాహసములే దీనికిఁ గారణము. తనసహచరుల నతి ప్రేమతో జూచుచుండెడివాఁడు. ఈబాలుని పెద్దలు సైతము మిక్కిలి గారాబమున జూచుచుండెడివారు. ఈయన శ్రావ్యముగ వేణుగాన మొనర్చగల సమర్థుడు. జాతీయగీతములు, పల్లెలలో నణగియున్న పల్లెపదాలు నతిశ్రావ్యముగ గానము చేయుచుండుటచే, గ్రామములలోని పశువులకాపరులు, పల్లెవాండ్రు, బిచ్చగాండ్రు, వారు వీరననేల ఆబాలగోపాల మాయన నతిగౌరవముతో జూచుచుండెడివారు. పువ్వు పుట్టగనే తావి వెదజల్లుట సహజముగదా! గ్రామములో బాలబాలికలు ఈయన గానము చేయునపుడు ఆనందసాగరమున నోలలాడుచు నాట్య మొనర్చుచుండెడివారు. బాల్యమిత్రు లొకరీయననుగూర్చి యీవిధమున చెప్పిరి. "నామిత్రుడగు గారిబాల్డిలో తల్లిలోగల సత్యసంధత, సరససంభాషణము, దైవభక్తి, సౌందర్యమును; తండ్రిలో గల గాంభీర్యము, సాహసమును మూర్తీభవించినవి."

మన గారిబాల్డిజనకుడు గురువులసలహాలవలన తనయనుంగుపుత్రుని న్యాయవాద, వైద్య, మతవిద్య

లలో నేదైన నొకదాని నభ్యసించవలసిన దనియును; అందును మతవిద్య నభ్యసించి పాదరీ అయిన తా నెక్కువ సంతసించెద ననియు ప్రేరేపించెను. కాని వీనిలో నేదియు గారిబాల్డికి నచ్చలేదు. న్యాయవాద వృత్తిలోగల కపటము, దాంబికము, మోసము, ఈయ నకు హృదయావేదన గల్గించెను. వైద్యవృత్తి యనిన ఏవగింపు గలిగెను. జేగురువస్త్రములు ధరించి సోమరిగ నుండు మతప్రచారము నామోదింపలేదు. వీనిలో నేవృత్తి నవలంబించినను ఇటలీదేశమునకు చెప్పరాని నష్టము వాటిల్లియుండెడిది. ఈవీరునిలో దైవభక్తి, దేశభక్తి, బీదజనులయెడ కరుణ, సర్వమానవసౌభ్రాతృ త్వము మూర్తీభవింపజేసిన భగవానుడు ఈయనను సామాన్యమానవునిగ జేసి ఇటలీదేశమునకు హాని చేయునా? జననీజనకు లెంత ప్రేరేపించినను పైవృత్తులు ఆయన నాకర్షించలేకపోయెను. సముద్రునిగాంభీర్యము, స్వాతంత్ర్యవాయువులు ఆయనమనమును చూఱగొనెను. ఓడలో నుద్యోగిగ నుండుటకు కృతనిశ్చయు డాయెను. ఈయనభావములనుజూచి తల్లి విలపించెను. తన ముద్దుల పట్టిమీద పెట్టుకొనిన ఆశయము లన్నియు భగ్నము లగుటచే పుత్రుని పలుభంగుల బ్రతిమాలెను. గారి

బాల్డి తనమనోనిశ్చయముసు మార్చుకొనక ఓడలో నుద్యోగిగ జేరెను. ఉద్యోగమున జేరిన దాది కడు సమర్థతతో తనకర్తవ్యమును నెఱవేర్చుచు, తనమీది యధికారుల ప్రేమకు పాత్రు డాయెను. అనతికాలముననే తనసహచరులలో సమర్థు డనిపించుకొని ఉన్నతపద వులలోని కభివృద్ధి జెందుచుండెను.

గారిబాల్డి పలుమారులు ఒడేసా, రోగ్, జిబ్రా ల్టర్, కేనరీజ్, కాన్‌స్టాంట్‌నోపిల్ మొదలగు నగర రాజముల సందర్శించెను. ఆయన మొదటిసారి రోమ్ నగరమును దర్శించినపుడు గలిగిన భావపరంపరల నీవిధమున తన స్వీయచరిత్రమున వర్ణించెను. "పవిత్ర స్థానమైన రోమ్ నగరరాజమును గాంచుభాగ్యము గల్గినం దుకు ఆనందభరితుడనై నృత్యము చేయగడంగితిని. పరవశుడనై స్పృహ నెఱుంగకపోయితిని. పుణ్య క్షేత్రమైన రోమ్‌మహానగరమునంగల ప్రతిరేణు వును పూజింప నారంభించితిని. స్వాతంత్ర్యప్రియుల కెల్లరకును దర్శనీయ పవిత్రక్షేత్రము. పూర్వపుణ్య వశముననే అందున్న మానవులు ఆ స్వాతంత్ర్యనగర మున జన్మించిరి. ఇది సామాన్యమానవులకు లభింపదు. నాకు స్నేహితులకంటెను, బంధువులకంటెను, భార్యా

పుత్రులకంటెను, తుదకు నాప్రాణముకంటెను ఈపవిత్ర రోమునగరమే ప్రియతమ మైనది. ప్రపంచమున అనేక సుందరపట్టణములను, నగరములను గాంచితిని. ఎపుడును ఈపుణ్యనగరమును జూచినపుడు గలిగిన ఆనందమును పొందలేకపోతిని. చంద్రకాంతశిలలతో నిర్మింపబడిన హర్మ్యములు గల నగరములు గూడ, ఈ నా మాతృదేశ నగర శిథిలశకలములముందు తృణప్రాయములుగ గన్పట్టెను. శిథిలమైన ప్రతిశిలకును వినమ్రుడనై భక్తితో ప్రణమిల్లితిని. ఇందు వీచు పిల్లతెమ్మెరలుసైతము నన్ను స్వాతంత్ర్యప్రియునిగ జేసినవి. కష్టపరంపరలలో జిక్కికొనినపుడుగూడ పవిత్రమైన రోమునగరమును మఱచియెఱుగను. ఒకమారు నావబద్దలై మృత్యుగహ్వరమునుండి తప్పించుకొని, అమెరికాదేశ కీకారణ్యముల అన్నపానీయములు లేక క్రూరజంతువుల జెండాడుచు, తెన్ను గానక ద్రిమ్మరిలుచు, నాపుణ్యభూమియగు రోమునగరమును విస్మరింపక కన్నులు మోడ్చి చేతు లొగ్గి అచటినుండియే నమస్కరించి ధన్యుడనైతిని. ఆనాపుణ్యనగరమును పూర్వపుఔన్నత్యమునకు గొనివచ్చి, ప్రపంచమున కెల్లమణిగా జేసి ధన్యుడనగుటయే నాజీవితపరమావధి.

రోము నగరమే నాకు ఇటలీదేశము. అదియే నామాతృదేవి."

అనతికాలముననే మనగారిబాల్డి తనబుద్ధికుశలత వలనను, పట్టుదలవలనను, ఓడయొక్క కెప్టెన్ పదవిని సంపాదించెను. కాని ఆయనమన మందు లీన మగుట లేదు. జన్మచే గలిగిన దేశాభిమాన మాయనను, దేశసేవానిరతునిగ ప్రేరేపించుచుండెను. దేశభక్తుడగు జనోవానగరవాసిని జూచి యీాయన అమందానందకందళితహృదయుడై "కొలంబస్ కూడ క్రొత్తదేశమును గాంచి, దేశసేవాధురంధరుడ వగు నిన్ను జూచి నేపొందిన యానందమును పొందియుండడు" అని వక్కాణించెను.

గారిబాల్డి జీవితము

రెండవ అధ్యాయము

గారిబాల్డికి నౌకాజీవనమునం దుత్సాహము తగ్గు చుండెను. "ఇది నీపని గాదు, నీవు చేయవలసిన కార్యరంగ మొండు గలదు." అని భగవానుఁడు చెప్పు చున్నటుల ఆయన అంతరంగమున దోచుచుండెను. స్వభావసిద్ధమగు దేశాభిమాన మాయనను పురికొల్పు చుండెను. తన ధర్మమునుగూర్చియు, కర్తవ్యమును గూర్చియు నాలోచించ బ్రారంభించెను. "నన్ను మఱచి తివా" యని మాతృదేవి దీనవదనమున కన్నీరుగార్చుచు ప్రత్యక్షమగుచుండ, దేశాభిమానపూరితుఁడగు గారి బాల్డి కింకర్తవ్యతామూఢుడై కూర్చుండగలడా? ఆయన స్వీయచరిత్రమునం దీవిధమున లిఖించెను:

"నాదేశమున దారిద్ర్యము తాండవమాడుచు న్నది. సోదరదేశీయులు కట్ట గుడ్డయు, తిన నన్నము లేక శల్యావశిష్టులై దుఃఖసాగరమున మునిగియున్నారు.

రాజుల నిరంకుశత్వముచే ప్రజలు పడరాని యిడుమల బడుచున్నారు. ఈదుర్భరస్థితిలో నాయుద్యోగముతో దృప్తిపొందుటయేనా నా జీవితపరమావధి? కాదు, కాదు; నాశక్తికొలది సోదరదేశీయులకు సాయపడ నిశ్చయించుకొంటిని."

1830 సంవత్సరమున ఫ్రాన్సుదేశమున అశాంతి ప్రబలుచుండెను. దీనికి కారణము ఆదేశమునం గల రాజుల అకృత్యములే. విప్లవాందోళనము ఫ్రాన్సుదేశమునసే ఆగలేదు. ఇటలీలోగూడ స్వాతంత్ర్యాగ్ని రగుల్కొని యువకులలో పరస్పరసంభాషణములు ప్రారంభింపబడెను. యువకు లెల్లరు ఒకనాడు సమావేశమై తమ కర్తవ్యమునుగూర్చి యాలోచింపసాగిరి. ఆసమయమున 24 వర్షముల ప్రాయముగల మన గారిబాల్డి "రాజ్యాధికారమన నేమి? రాజధర్మమేమి? రాజెందుకు? రాజులులేక ప్రజాపాలనము సాగదా? వారు చేయు అన్యాయ్యములు కన్పించుట లేదా"? అని హెచ్చరించెను. సమావేశమైన యువజను లెల్లరు తమ దేశదాస్యశృంఖలముల ద్రెంప నిశ్చయించుకొని 1831-వ సంవత్సరము మేనెలలో పీడ్మంటునగరమున మరల నొక గొప్పసభ గావించిరి.

దేశాభిమానులగు వేలకొలది యువకు లత్యుత్సాహముతో ఆసభ కరుదెంచి దేశసేవ జేయ బద్ధకంకణులైరి. దేశమున నూతనోత్సాహము గలిగెను. ఇట్టి సమావేశములు లోంబర్డు, బొలోనా మొదలగు నగరములలోగూడ జరిగెను. ఈయుద్యమమును జూచి రాజులు, మతగురువులు సహించలేక ఉద్యమము నణచుటకు సమస్తములగు కట్టుదిట్టములను చేయ నారంభించిరి. వీరి నిర్బంధము లెక్కువైనకొలది దేశమునం దుత్సాహ మినుమడించుచునుండెను. వారి నిరంకుశోపాయములే వారిని నాశనము చేసినవి.

ఈ సమయమున ఇటలీదేశమును ఆస్ట్రియా రాజులు పాలించుచుండిరి. ఇటలీయువకులు స్వాతంత్ర్య ప్రియులై జన్మభూమిసేవలో మునింగిరి. స్వాతంత్ర్యోద్యమాభిప్రాయములు నగరములలోను, పట్టణముల లోను, పల్లెలలోను వ్యాపింపజేయగడంగిరి. పారతంత్ర్యమువలన దేశమునకు గలిగిన నష్టములను వ్యక్తీకరించుచుండిరి. దేశమునం గల పురుషులలోను, స్త్రీలలోను, బాలబాలికలలోను, స్వాతంత్ర్యాగ్ని రగుల్కొనెను. ఈనూతనభావోదయమును గాంచి రాజు లూరకుండలేకపోయిరి. తమ పశుబలముచే దేశభక్తుల పలు

రీతుల బాధించజొచ్చిరి. దేశమున అన్నిప్రాంతముల లోను సైనికుల నింపిరి. వీరి యకృత్యములు వర్ణింప నలవిగాదు. కాని విద్యావంతులగు ఇటలీయువకులు వీరిని లెక్క-జేయక తమతమ కృషిలో లీన మగుచుండిరి. యువకు లెల్లరు దేశసేవా తత్పరులై స్వాతంత్ర్యోద్య మములో లీనమగుటచే విశ్వవిద్యాలయములను మూయ వలసివచ్చెను. వేలకొలది యువకులను కారాగారములలో నిర్బంధించిరి. కొరడాలతో చావమోదిరి. కాని వీరిలో గలయకుంఠిత దేశాభిమానము ఇసుమంతయైన తగ్గలేదు. ఇటలీదేశపు పోపులు (మతగురువులు) ఈరాజుల అకృత్యములకు దోడ్పడై వారి సేనలను రాజుల కొప్పగించి దేశీయుల మన్ననలకు దూరులైరి. దేశసేవకు లీకష్ట ములలో దేవు నీవిధమున ప్రార్థించెడివారు.

“హే! దీనదయాళూ, సర్వలోకరక్షకా. అమా యకులగు ప్రజలను నిరంకుశులగు మతగురువుల నుండియు, రాజులనుండియు కాపాడుము. నీవే దిక్కు. నీవే రక్షకుడవు. దయావిహీనులైన సైనికుల దుష్కృ త్యములు పురుషులతో పూర్తిగాలేదు. దేశమునంగల నారీమణులను, బాలురనుగూడ క్రూరముగ హింసింప నారంభించిరి. దేశమునం దేమారుమూల జూచినను

ప్రభుత్వసేనల దుష్కృత్యములగూర్చియే చెప్పుకొను చుండిరి. ఇన్నిబన్నములకు లోనైనను వారియందు గల స్వాతంత్ర్యకాంక్ష లేశమైనను తగ్గలేదు. ద్విగుణీకృతోత్సాహముతో వారు స్వాతంత్ర్యసమరరంగమున కురుకుచుండిరి. నేపుల్సు రాష్ట్రపరిసరములగూడ స్వాతంత్ర్యోద్యమము దినదినాభివృద్ధి గాంచుచుండెను. ఇటలీదేశపు పోపులు రాజుల కండనై నిలచి తమ దేశభక్తులను హింసించుటలో దోడ్పడిరి. వారిలో జెస్విట్ అను పోపు యోధానుయోధుడు. వీరీదుష్కృత్యములన్నియు లోకపూజ్యుడగు ఏసుమహాశయుని మతసంబంధములగు దుస్తుల వేషములలోనే గావించి, ఆ యవతారమూర్తినామమునకుగూడ కళంకమును గలుగ జేసిరి. గారిబాల్డిస్వీయచరిత్రమునందుగూడ మతగురువులనునామములతో దేశమున వీరు గావించిన అక్రమ, అసహ్య, దూషిత, దుర్మార్గకార్యములనుగూర్చి పలు రీతుల వర్ణించెను. వీరు కేవల మపరరాక్షసులనినను అతిశయోక్తి గాదు. ఆబాలగోపాలము వీరి దుష్కార్యములను నిరసించిరి. వీరి సాయము లేకపోయినచో, పరదేశీయులగు రాజు లిన్నిదుర్మార్గములు గావించుటకు సాహసించెడివారు గారు. తమ తల్లిదేశమును,

సోదర దేశీయులను మరచి, పరప్రభువులకు దాసులగు వారు ప్రతిదేశమునం దుందురుగాబోలు! ఇది సృష్టి చిత్రమా, భగవదుద్దేశమా!

ఇటలీదేశమా! నీరాజ్యసింహాసనమునందు అధికారప్రమత్తులగు ఆస్ట్రియన్ చక్రవర్తులు గలరు. వారికి చేదోడుగ, నీదేశజులగు పోపులు స్వాతంత్ర్యప్రియులగు నీముద్దుబిడ్డల హింసించుటకు గలరు. నీభక్తులగు పుత్రీపుత్రులు చెరసాలలలో గ్రమ్గుచుండిరి. కొందఱు కొరడాలతో కొట్టబడిరి. వేలకొలది యినుపసంకెలలలో బంధింపబడియుండిరి. కొందరు తుపాకిబారులకు గుఱియై భూమాతయంకమున జేరిరి. మరికొందరు ఉరికంబముల మీద తమశిరము లుంచి, ఆనందమున స్వర్గమున కరిగిరి. ఇంకెందరో ఆస్ట్రియన్ రాజుల హయముల గిట్టలక్రింద బడి హతులైరి. నీయనుంగుబిడ్డల కష్టపరంపరలు వర్ణింప నాదిశేషునకైన నలవియా? కాని అంధకారబంధురమైన యీసమయమున దేశారాధకుడగు మేజినీ "స్వర్గరాజ్యమును నిర్మింప ప్రభువులకు ప్రభువగు పరమేశ్వరు డరుదెంచుచున్నాడు. స్వేచ్ఛ మగు మార్గము సుమములతో నలంకరించి ఆహ్వానింప సిద్ధముగ నుండుడు" అని ప్రజలను హెచ్చరించెను.

రెండవ అధ్యాయము

ఈదైవవాణి దేశజుల కుత్సాహము గలుగజేసెను మేజినీ స్ఫురద్రూపి. వదనమున శాంత మొలుకుచుండెడిది. దేశమునం దావరించియున్న అంధకార మాయనను గ్రుంగజేసినది. సోదరదేశీయుల కష్టపరంపరలం జేసి హృదయము క్షుభింప కన్నీరుగార్చుచుండెను. విపదంబుధినుండి గట్టెక్కించుటకు వచ్చిన దేవదూత యని దేశీయులు నమ్మిరి. నిస్పృహ చెందిన యోధులకు రక్తము పొంగినది. మేజినీ మేధావి; చురుకైనవాడు; ఎల్లపుడును కార్యతత్పరుడు. వ్రాతయందును, సంభాషణమునందును ప్రతాప ముట్టిపడుచుండెడిది. వేలకొలది ప్రశ్నలకుకూడ సునాయాసముగ జబాబు లొసంగుచుండెడివాడు. ఇటలీదేశమున ప్రతిపల్లెకుకూడ వెల్లి స్వాతంత్ర్యోద్యమాశయముల వెదజల్లెను. ఈదేశభక్తుని ప్రచారమువలన నిద్రించుచున్న అమాయకప్రజలలోగూడ స్వాతంత్ర్యకాంక్ష ప్రబలెను. సందేహాస్పదులగు విద్యావంతులు సందియములు వీడి కార్యరంగమును కురికిరి. కవిత్వముతోనే కాలము గడుపు కవికుమారులు కలములు క్రిందబెట్టి కదనరంగమున ప్రవేశించిరి. సంగీతసాగరమున నోలలాడు గాయకులు, జన్మభూమిసేవాతత్పరు లైరి. గృహాంగణమునైన

గాంచని కోమలాంగులు మాతృసేవయందు లీనమైరి. మేజినీ దేశములో కల్గించిన ప్రబోధమునుజూచి ప్రభువుల గుండెలు ఝల్లుమనెను. క్రూరరాజగు చార్లెస్ ఎల్బర్టు గజగజ వడంకసాగెను. ఇటలీదేశస్వాతంత్ర్య సంరంభము ప్రపంచదృష్టి నాకర్షించినది. మేజినీ 'యువఇటలీ' యను మాసపత్రికను మార్సెల్సునగరమునుండి ప్రకటించుచు దేశమున నూతనోత్సాహము ప్రబలజేయుచుండెను.

గారిబాల్డి మొదటిసారి మార్సలీస్‌నగరమునందే తన గురుపుంగవుండగు మేజనీని సందర్శించెను. ఈనగరమునం దున్నదినములలో, గారిబాల్డి తన భావికార్య క్షేత్రమునకు కావలసిన పరికరముల సంపాదించి చరితార్థు డాయెను. ఇచ్చటనే అసంఖ్యాకులగు దేశభక్తులగు యువకులతో సంప్రదించి స్వాతంత్ర్యోద్యమమును వ్యాపింపజేసెను. అందువలననే నేటికిని ఇటలీదేశీయులు ఈనగరమును పుణ్యక్షేత్రముగ పరిగణించెదరు. మేజినీ గారిబాల్డిల కలయిక దేశమున నూతనోత్తేజము గలుగ జేసినది. ఏకాభిప్రాయులు గనుకనే ఐక్యమైరి. వీ రిరువురికి దేహములు రెండైనను ప్రాణ మొక్కటే. ఇద్దరిలోను నాయకలక్షణము లున్నవి. ఇద్దరును పతితమాన

వోద్ధరణమునకు పంపబడిన దేవదూతలు. మేజినీ దుర్బ లుడు నేత్రద్వయమునుండి జ్ఞానజ్యోతి వెలుగుచుండును. శాంతస్వభావము గలవాడు. కరుణార్ద్రి హృదయుడు. సత్యసంధుడు. గారిబాల్డి దృఢకాయుడు. విశాల వక్షస్థలము, ఆజానబాహువులు ఆయన పరాక్రమమును స్ఫురింపజేయును. సత్యప్రియుడు. మేజినీ జ్ఞానతేజము, అగాధదేశప్రేమ, గారిబాల్డిని దాసానుదాసునిగ జేసినవి. గారిబాల్డి స్వాతంత్ర్యమూర్తిని మేజినీలో జూడ గలిగెను. చాలదినములు ఇద్దరును కలసియే స్వాతంత్ర్యోద్యమమును నడపిరి. కాని చివరిదినములలో నిద్దరికి భేదాభిప్రాయములు కలిగెను. వీరి భేదభావములు దేశసేవ కాటంకమును కలుగజేయలేదు. ఎవరికి నచ్చిన మార్గమున వారు దేశసేవ జేయుచునేయుండిరి. భేదభావములు స్నేహమున కడ్డురాలేదు. ఎప్పుడైన వోటమి కలిగినను లెక్కచేయక భావికార్యరంగమున కురికెడివారు. ఆ జన్మాంతము దేశసేవయందే యుండి కీర్తికాయు లైరి. ఇట్టి మహనీయుల జీవితములే ధన్యములుగదా?

ఒకమారు గారిబాల్డి యీక్రిందిలేఖను సర్దినియా నరేశునకు వ్రాసెను.

"సత్యమైన యీ లేఖను తమకు పంపుటకు, నా మయోగ్యతయే కారణము. నేనే స్వయముగ తమ సమక్షమున కరుదెంచి మనవిచేయదలచి ప్రయత్నించి విఫలమనోరథుడ నైతిని. తాము బాల్యమునందు పలికిన ప్రతిజ్ఞను పూర్తిచేయుదు రని విశ్వసించుచున్నాను. ఇటలీదేశము రమ్యమైనది. ఫలపుష్పములతో నొప్పారు ఉద్యానవనములు గలవు. వివిధజంతుసంతతి కిరవైన సాంద్రారణ్యములుగలవు. గగనమును చుంబించు పర్వతరాజములు గలవు. ప్రాణికోటికి ప్రాణముపోయు వివిధ నదీనదములు గలవు. అనేకశతాబ్దములనుండియు సుప్రసిద్ధచరిత్రము గలిగిన మన దేశమును, ప్రపంచవాసులెల్లరు పూజించుట మీ రెరుంగుదురు. రోమునగరము ప్రపంచమునం గల నగరము లన్నిటికంటె సర్వసంపదలతో తులదూగి వాసికెక్కినది. విజ్ఞానసంపన్ను లిం దుద్భవించిరి. తత్త్వవేత్త లిచ్చట వెలసిరి. రాజకీయ దురంధరు లిచ్చటనే జన్మించిరి. వీరపురుషసింహు లిం దవతరించిరి. సకలకళ లీనగరముననే విహరించినవి. ఇట్టి పవిత్ర "ఇటలీ" దేశమునకు నీవు రాజవగుట మాభాగ్యము. స్వర్గమున లోకైకనాథుడు, భూస్థలియందు మీరును మాకు దిక్కు. చిన్ననాడు మనము కలసి

విహరించు దినములలో మనదేశమున ప్రజలు పడుచున్న బాధలు జూచి, మీమన మెంత పరితపించినదో నే నెఱుగుదును. రాజులు, పోపులు దేశమున నెన్ని విఘ్నముల, అమాయకప్రజల పీడించిరో మీ రెఱుంగుదురు. అన్నములేక అల్లాడుచున్న మానవులను, జీర్ణవసనములలో జీర్ణకాయులగు సోదరులను జూచి, మీరు బాష్పవదను లగుట మరువజాలను. దేశమునం దావరించిన, విపత్పరంపరలనుగూర్చి యెన్నిరాత్రులు నిద్రాహారములు లేక విలపించితిరో మరువకుడు. దేశభక్తులగు మీరు ఈకష్టసమయమున జాతీయోద్యమమునకు సాయపడ కూరకుండుట పాడిగాదు. మానవకల్యాణమునకై విప్లవసంఘమున జేరుట విజ్ఞుల విధి. ఇంతకంటె మిన్నయగు పవిత్రకార్యము మహీమండలమున వేరొకటి గలదా! ఈపవిత్రసమయమున మీరుకూడ మాతో స్వాతంత్ర్యసమరమున కురికి ధన్యులు గండు. స్వాతంత్ర్యయోధులు మీత్యాగమునకై, వర్షాగమనమునకు ముత్యపుచిప్పలవలె ఎదురుచూచుచున్నారు. చిననాటి చనవుచే మిమ్మాహ్వానించుచున్నాము. మీరు రాకపోయినను స్వాతంత్ర్యదేవీపాదపద్మముల కడ మాయసువుల బలియొసగ కృతనిశ్చయుల మైతిమి."

ఈలేఖను చార్లెస్ఎల్బర్టు చదివి సంతసించుటకు మారు కోపోద్రిక్తుడాయెను. బాల్యమున స్వాతంత్ర్య భావములు గలిగినను, పెద్దవాడైనపిమ్మట తన మంత్రులయు, బంధువులయుసలహాలవలన చల్లబడెను. తన బాల్యమిత్రుండగు మేజినీని వెంటనే దేశమునుండి వెడలగొట్టెను. స్వాతంత్ర్యయుద్ధము నణచుటకు సర్వ విధముల దీకొనెను.

గారిబాల్డి జీవితము

మూడవ అధ్యాయము

స్వాతంత్ర్యఘోషులు సముద్రముమీద జని ఇటలిని ముట్టడించుటకు కృతనిశ్చయులై, మార్సలీస్ నగరమునుండి, మేజినీ, గారిబాల్డిల నాయకత్వమున 1834 సంవత్సరము ఫిబ్రవరి మూడవ తేదీన పయనమై, జనోవాపట్టణమును ముట్టడించి స్వాధీన పరచుకొనిరి. సేవాయ పట్టణమునుగూడ వశపఱచుకొన ప్రయత్నించి, విశ్వాసఘాతకులగు యోధులచే మోసపోయి, విఫలమనోరథులైరి. శత్రుసేనల దాడి మిక్కుటమాయెను. ప్రయోజనము లేదని గ్రహించి స్వాతంత్ర్య సేనలు మరలినవి. కాని శత్రుసేన వీరిని వీడినదికాదు. గారిబాల్డి స్వాతంత్ర్యాభిప్రాయములుగల ఒక వర్తక వనితామణిసహాయమున మారువేషము ధరించి నాయిస్ పట్టణమునకు పయన మాయెను. రాజమార్గముల బోయిన శత్రువులు ముట్టడించెదరు. కాన మానవులు

నడువని నవ్యమార్గములు పట్టెను. పొదలతో నిండిన డొంకలు దాటెను. కంటకమయములగు కారడవుల జొచ్చెను. గుట్టలు కొండలు దాటెను. నదు లీదెను. ఎట్టకేలకు పదిదినములకు స్వస్థానమునకు జేరెను. మార్గమధ్యమున అన్నపానీయములు లేక కృశించి యుండెను. ప్రేమతో జూచు సిన్నతల్లి గుర్తించలేక బిచ్చగాడని వెళ్లిపొమ్మనెను. గారిబాల్డి నని చెప్పిన తరువాత ప్రేమతో అంకమున జేర్చికొని యోదార్చెను. మార్గమునం గల కంటకములచే, శిలలచే గాయపడిన కాళ్లనుండి కారు రక్తమును జూచి తల్లి దుఃఖించెను. ఆయాసముదీర్చి భోజనమిడి గాయముల కుపచారము గావించెను. మరుదినమే తన కర్మక్షేత్రమగు మార్సలీస్‌నగరమునకు ప్రయాణమాయెను. తల్లి యింకను రెండుదినములు విశ్రాంతితీసికొనుమని బ్రతిమాలెను. కాని కర్మవీరుడగు గారిబాల్డి మిత్రద్వయముతో బయలుదేరి మార్సలీస్‌కు వెళ్లెను. మార్గమధ్యమున నొక యగాధమగు నది యడ్డమురాగా మన కథానాయకుడు ఉత్సాహమున దుమికి సునాయాసముగ నావలిగట్టు జేరెను. నదిని జూచి మిత్రు లిద్దరు భయపడి దాటలేకపోయిరి. చేయునది లేక వారిదగ్గర

సెలవుగైకొని తనదారిని పట్టెను. తదుపరి పదినిమిషములకు ఫ్రాన్సుసేనలు ముట్టడించి, మన యోధుని వశపఱచుకొని ఒకగదియందు బంధించెను. గారిబాల్డి ఆరాత్రియే గదియొక్క గవాక్షములు విఱుగగొట్టి తప్పించుకొని పారిపోయెను. మరల కాంతారములు, నగములు దాటవలసివచ్చెను. నాడు వెన్నెలరేయి. పిల్లతెమ్మెరలు వీచుచుండెను. ఆనందముగ జాతీయ గీతములు గానముచేయుచు నడచుచుండెను. నౌకోద్యోగిగ నున్నపు డభ్యసించిన, నక్షత్రమండలగమనమును వీక్షించుచుండెను. మరుదినమున ఒకగ్రామ సత్రమునకు జేరెను. కొంచెముసేపు విశ్రమించి ప్రయాణపుబడలిక దీర్చుకొని భోజనశాలకు వెళ్లెను. ఆకలిగొని యుండుటచే ఎక్కువగ భుజింప నారంభించెను. ఈయన భోజనమును జూచి అచటివా రందరు ఆశ్చర్యపడసాగిరి. నిష్కలంకహృదయు డగు మన గారిబాల్డి "ఏమిచేయుదును. రెండుదినములనుండియు భోజన మెఱుగను. ఆకలిదప్పులచే పీడింపబడియుంటిని. ప్రథమమున స్వదేశమున మృత్యుముఖమునుండి తప్పించుకొంటిని. మరల నిన్న ఫ్రాన్సుదేశపు చెరసాలనుండి పారిపోయి వచ్చితిని. ఇపుడైన కమ్మని భోజనము చేయనోచనా"? అని పలికెను.

గారిబాల్డిసంభాషణము వినగానే అచటనున్న వారందరు వెలవెలబోయిరి. సత్రాధికారులు గజగజ వణకసాగిరి. ఒకమనుజుడు ఈయోధుని తదేకధ్యాన ముతో జూడ నారంభించెను. ఆయనను జూచి గారి బాల్డి, ఎందుల కావిధమున తేరిపారజూచుచున్నా వనెను. ఆయన సాశ్రువదనుడై, "దేశభక్తులగు మిమ్ము నాపొట్టకూటికై నిర్బంధించవలసివచ్చెనుగదా" యని అనెను. అచటనున్నవా రందరు వగచిరి. కాని ధీరు డగు గారిబాల్డివదనమున మందహాస మొలుక "నాదేశము కొఱకై ప్రాణము లర్పింప సిద్ధముగ నున్నాను. నీ వేమి చేయగలవు! మాతృదేశమును మఱచి బానిసవైతివి. దుఃఖింపకుము. నీకర్తవ్యమును నెఱవేర్చుకొనుము. నన్ను బంధింపుము. కాని ఆకలిదీర భోజనముమాత్రము జేయనిమ్ము" అనెను.

ఇటలీదేశభక్తుడగు గారిబాల్డి వచ్చెనన్నవార్త గ్రామమంతయు వ్యాపించెను. గ్రామమునం గల స్త్రీ పురుషులెల్లరు తండోపతండములుగ దేశభక్తుని జూచి, తమ జన్మసాఫల్యమును పొంద ఆయనచుట్టును మూగిరి. పిన్నలు పెద్దలు కరస్పర్శనము గావించి, వారి కాయన యందు గల భక్తిని, ప్రేమను వెల్లడించిరి. స్వాతంత్ర్య

యోధులగు మిమ్ము జూచి ధన్యుల మైతి మనిరి. యువకులు స్వాతంత్ర్యోద్యమమునుగూర్చి పలుప్రశ్నలు వేసిరి. వృద్ధులు దీవించిరి. బాలిబాలికలు జాతీయగీతములు పాడిరి. గాయకుడగు గారిబాల్డీకూడ సుప్రసిద్ధప్రెంచి కవిపుంగవుడు రచించిన జాతీయగీతమును గానముచేసి గ్రామవాసులను రంజింపజేసెను. వారిచెంత సెలవుగైకొని రాజోద్యోగివెంట వెళ్లెను. గ్రామవాసు లెల్ల రాదేశభక్తుని జూచి విలపించిరి. తన దేశస్వాతంత్ర్యముకై ఈధీరు డెన్నికష్టములు పడుచుండెనో గదా యని వగచిరి. గారిబాల్డీని మజిల బంధించిరి. ఈమారు కారాగారమునుండి తప్పించుకొనుట కష్టమైనది. కాని సాహసోపేతుడగు ఈయోధుడు ఆఱుమాసములతరువాత చెరసాలనుండి పారిపోయెను.

గారిబాల్డీని వెదకుటకు ప్రత్యేకముగ కొందఱిని ప్రభుత్వమువారు నియమించిరి. ఎన్నిప్రయత్నములు జేసినను అతడు పట్టువడలేదు. ఈయనను పట్టుకొనిన వారికి వేలకొలది రూప్యములు పారితోషికముగ నొసంగెదమని ప్రభుత్వమువారు ప్రకటించిరి. గారిబాల్డీ రాజద్రోహి, దేశద్రోహి యనియు, దేశమున నశాంతి ప్రబలచేయుచున్నాడనియు, దొరకిన తుపాకితో కాల్చి

చంపుటకు ప్రభుత్వము నిశ్చయించిన దనియు, వార్తా పత్రికలలో ప్రకటించిరి. గారిబాల్డి దేశమంతయు తిరిగి విప్లవము వ్యాపింపజేయువారిలో నగ్రేసరుడనియు, దేశమునం దున్న కూలివారిలో, కృషీవలులలో పలుకు బడి గలిగియుండుటయు జూచి ప్రభుత్వము భయపడెను. అనేకప్రకటనలు గావించి ప్రజలను భయపెట్టప్రారంభించెను. ఈప్రకటలను జూచి గారిబాల్డి నవ్వుచుండెడి వాడు. కాని సహచరులలో కొందరు భయపడిరి. మన కథానాయకుడు మారువేసములు ధరించియు, పేరు మార్చుకొనియు తిరుగుచుండెడివాడు. స్వదేశమున నున్న ప్రమాదమని విదేశముల కేగి తలదాచుకొనెను. ఇటలీదేశమునం దంతటను ఈదేశభక్తుని నామమును జపించుచు, పూజించెడివారు. పారతంత్ర్యము పారిపోవలయునన్న ఇట్టి దేశభక్తులే యవసరముగదా?

గారిబాల్డి దేశభక్తుడే గాదు; ప్రజాసేవకుడును. ఎపుడు ప్రజలకు కష్టములు కల్గినను సేవజేయుటకు వెనుకాడియెఱుగడు. ఒకమారు దేశములో మశూచివ్యాధి వ్యాపించెను. మార్సలీస్నగరమునగూడ నిత్యము అనేకులు మృత్యువువాత బడుచుండిరి. నగరమంతయు భీభత్సముగ నుండెను. పురవాసులు పారిపోయిరి.

వైద్యులుకూడ పలాయనమైరి. కాని సేవాధురంధరు డగు మన కథానాయకుడు పట్టణమంతయు తిరిగి ప్రతి రోగికి ఉపచారము చేయుచుండెడివాడు. దిక్కులేని దీనులకు దేవు డాయెను. ఈసమయమున భారతజాతీయ నాయకులును, ప్రజాసేవాతత్పరులును అగు తిలక్ మహా రాజు, లజపతిరాయి, చిత్తరంజనదాసు, సేన్‌గుప్త, రాజేంద్రబాబు మొదలగు సేవాధురంధరుల పవిత్రనామ ములను మరువజాలము.

ఏ రాజు తమ స్వాతంత్ర్యోద్యమమునకు చేయూత నొసంగునని దేశభక్తు లెదురుచూచుచుండిరో, ఆ చార్లెస్ఎల్బర్డుఆస్ట్రియాదేశీయులచేతులలోకీలుబొమ్మయై స్వలాభపరాయణుడై దేశభక్తుల హింసింప నారం భించెను. స్వాతంత్ర్యోద్యమమునకు ఏకొంచెది సాను భూతి జూపినవారినిగూడ పీడింప నారంభించెను. స్వచ్ఛందసేవకుల నిర్బంధించెను. వారి కుటుంబముల వారినిగూడ దండింపమొదలిడెను. వార్తాపత్రికలు చదివినవారికి సామాన్యశిక్షలుగాక మరణదండనకూడ విధిం చెను. స్వాతంత్ర్యయోధుల లాఠీలతో చావమోదెను. తుపాకీగుండ్ల కెరజేసెను. రాజవీధుల రక్తము ప్రవ హించెను. ప్రధాననాయకులను పురవీధులలో నిలబెట్టి

వివిధరీతుల చిత్రవధ గావించెను. 'వోకియరి' యను దేశభక్తుని సతీసుతులు, సోదరసోదరీమణులు జూచు చుండగ ముక్కలుముక్కలుగ నరికించెను. ప్రజల హింసించిన భటులకు బహుమానములు, ఉన్నతపద వులు ఒసంగుచుండెను. ప్రపంచ మేమనుకొనునో యను సందేహమునుగూడ వీడి ప్రజలను పలురీతుల బాధింప గడంగెను. ఈనీచుని యమానుషక్రియ లింతవఱకు ప్రపంచము మరువలేకపోయెను.

ఈక్రూరకృత్యములకు దేశీయులు భయపడిరి. ఎచటజూచినను నిరుత్సాహము, నిరాశ, నిస్తేజము నిండియుండెను. భర్తలను గోల్పోయినభామామణులయు, పుత్రులను గోల్పోయిన పురంధ్రీమతల్లులయు, సోదరులను గోల్పోయిన సోదరీమణులయు ఆర్తనాదములచే దేశము నిండిపోయెను. యోధాగ్రేసరులగు గారిబాల్డి, కేవర్, ఈదృశ్యములను జూచి సహింపలేక తాత్కాలికముగ సమర మాప నిశ్చయించిరి. కాని మేజినీమహాశయు డందుల కంగీకరించలేదు. స్వాతంత్ర్యము ఈశ్వరేచ్ఛ. దానిని సంపాదింప నెట్టిత్యాగమునైనను జేయవల యును. రణరంగమున దుమికి, రక్తప్రవాహములను

దాటి జయభేరిని మ్రోగించుట వీరుని ధర్మమని మేజినీ యుద్దేశము. తమ యభిప్రాయమును నేనును అంగీకరింతును. కాని రాజుల హింసలచే దేశము భయపడి విశ్రాంతిగోరుచున్న దని గారిబాల్డీవాదము. గారిబాల్డీ ౧౮౩౬-వ సంవత్సరమున యుద్ధ మాపి దక్షిణఅమెరికా వెళ్లి ౧౨ సంవత్సరము లచ్చటనే కాలము గడపెను.

గారిబాల్డిజీవితము

నాల్గవ అధ్యాయము

గారిబాల్డీ అమెరికాదేశమునకు వెళ్లిన తొమ్మిదిమాసములకు బ్రెజిల్‌రాష్ట్రమున రియోగ్రాండోసల్ ప్రాంతమున స్వాతంత్ర్యప్రియులు స్వాతంత్ర్యమును ప్రకటించిరి. ఈప్రాంతములం దున్న ఇటలీదేశీయులు గూడ ఈయుద్ధమునందు పాల్గొనిరి. వారి నందఱిని ఇనుప సంకెలలో బంధించి బ్రెజిల్‌నగరమునకు తీసికొనివచ్చిరి. గారిబాల్డీ సోదర దేశీయులను జూచి యుప్పొంగెను. వారి నందఱిని అభినందించెను. ఈయోధు డీస్వాతంత్ర్యసమరములో పాల్గొనక యూరకుండలేకపోయెను. వెంటనే స్వాతంత్ర్యోద్యమనాయకులచెంత కరిగి తన మనోనిశ్చయమును వెల్లడించెను. వారును సంతసమున నీపిగు నాహ్వానించిరి. ఒక నౌకాధికారిగా నుండి ఆనావకు మేజినీనామ మిడెను. యద్ధమున అనేకయోధులను యమపురి కంపెను. ఎన్నియో నావలను ముంచెను. ఎంద

తిని తుపాకులతో గాల్చెను. కొన్నిమారులు అపజయ ములనుగూడ పొందెను. జయాపజయములను సంతస ముతో స్వీకరించు ధీరుడు. ఈయన చాకచక్యమునకు శత్రువులు గజగజలాడిరి. కాని కడకు శత్రువులచేతు లలో బందిగా చిక్కెను. కొలదిదినములలోనే మాయో పాయములచే బంధవిముక్తు డాయెను.

గారిబాల్డి మరొకమారు తన మేజినీనావతో శత్రుదళముల ముట్టడించెను. ఆయనకడ సాహసోపేతు లగు యోధపుంగవులు గలరు. ఒకరిపై నొకరు అగ్ని వర్షమును కురియించిరి. గారిబాల్డిదెబ్బకు శత్రుసేనా ధ్యక్షుడు మడసెను. శత్రువులు భయకంపితు లైరి. కాని యింతలో నొకడు గారిబాల్డిని తుపాకితో గాల్చెను. ఆదెబ్బ తగులగనే మన కథానాయకుడు మూర్ఛిలెను. తదుపరి ఒకగంటవఱకు ఉభయసేనలు యుద్ధముచేసెను. గారిబాల్డిదళము శత్రుసేనను చెండాడి జయపతాక మెత్తెను. మన కథానాయకుని శరీరమంతయు గాయ ములతో నిండి రక్తము స్రవింప నారంభించెను. అను చరులు జాగ్రతతీసికొని ఉపచారము చేసిరి. గాయముల నుండి పెక్కు తుపాకిగుండ్లను వైద్యులు లాగివేసిరి. ఇరువదిదినములు గడచినపిమ్మటగాని యారోగ్యమును

పొందలేకపోయెను. గారిబాల్డీ జబ్బుగానున్నదినములలో నొక యనుచరుడు రాత్రింబవళ్లు ఎంతయోయోపికతో, నేర్పుతో, ప్రేమతో నుపచారము గావించెను. ఈ యనుచరుని సేవానిరతి, భక్తిప్రేమములనుగూర్చి మన కథానాయకుడు అనేకపర్యాయములు కొని యాడెను.

గారిబాల్డీ ఆరోగ్యవంతుడై తన కార్యరంగమున కురుకుటకు సర్వసన్నాహములు చేయు చుండెను. ఇంతలో మాంటివీడియో ప్రధానాధికారి ఆజ్ఞానుసారము రాజభటులు అకస్మాత్తుగ నాతని బంధించిరి. ఆరోగ్యము చెడిపోవుటచే పెరోలుమీద విముక్తు డాయెను. శత్రువులనుండి పారిపోవ సంకల్పము గలదు. కాని కాలిలో సత్తువలేమి కదలుటకే కష్టముగ నుండెను. ధైర్యవంతుడగు యోధుడు ఊరకుండునా? మరల తప్పించుకొనిఅరణ్యములలో ప్రవేశించెను. ఆహారములేక యారోగ్యము చెడి కృశించిపోయెను. రాజకీయభటులు బక్క చిక్కిన యీవీరుని మూడుదినములలో పట్టుకొని కాలు సేతులు ఇనుపసంకెలలో బంధించి చెరసాలకు జేర్చిరి. మరుదినము గవర్నరుచెంతకు తీసికొనిపోయిరి. అపు డాగవర్నరు ఎవరిసాయమున పారిపోతి వని ప్రశ్నిం

చెను. స్వశక్తిచేతనే వెళ్లితినిగాని అన్యుల సాయమపే క్షించలేదని జబాబుచెప్పెను. దానికి గవర్నరు క్రుద్ధుడై కొరడాతో చావమోదెను. మరల ప్రశ్నించెను. పూర్వమువలెనే ప్రత్యుత్తర మొసగెను. కాలుసేతులు బంధించి చీకటిగదియం దుంచి మరల కొట్టించెను. ఇంతటితో దృప్తిజెందక త్రాళ్లతో వ్రేలాడగట్టించి, బెత్తములతో చావమోదించెను. ఇపుడైనను సరిగ చెప్పునను నాశతో గవర్నరు వచ్చి మరల ప్రశ్నించెను. మన గారిబాల్డీ కోపోద్దీపితుడై గవర్నరుముఖమున నుమ్మివేసెను. చేయునదిలేక గవర్నరు సిగ్గుపడి వచ్చిన దారి పట్టెను. కొంతసేపటికి శరీరమంతయు మెలితిరిగి పోయెను. రెండుగంటలకు త్రాడుతెగి మన యోధుడు నేలగూలెను. అపుడైనను సంకెలలు సడలించక హత్యగావించిన యొకనికైదీచెంత బంధించిరి. వీనిద్వారా జాడలు లాగ ప్రయత్నించిరి. కాని ప్రయోజనము లేక పోయెను. ఈసమయమున మన కథానాయకుని పెట్టిన హింసలు వర్ణనాతీతములు.

కష్టపరంపరలలో జిక్కికొని విచారసాగరమున మునిగిన యీతరుణమున గారిబాల్డీకి చెరసాలలో ధార్మికమూర్తియగు నొక లలనామణి తోడాయెను. ఆమె

భగవంతునిగూర్చియు, మానవధర్మములను గూర్చియు తేనియలొలుకు సంభాషణములు సలిపి హృదయశమనము గలుగజేసెను. ఈమె తనపాలిటి దేవమాతయని గారిబాల్డి భావించెను. విచారమును విడచి భగవత్సంకీర్తనమును గావించుచుండెను. తన్మయుడై ఆనందసాగరమున నోలలాడజొచ్చెను. ఈచెరసాలలోనే “వియోనార్డిమిలాన్” అను దుర్మార్గుడుకూడ కలసెను. వానిని జూచి జాలిపొంది మన యోధుడు ధార్మికోపదేశము గావించెను. ఈపూజ్యుని ప్రభావమువలన వానికి జ్ఞానముకలిగి జీవితశేష మంతయు గారిబాల్డిభక్తుడుగ గడపెను.

గారిబాల్డి అనేకయాతన లనుభవించుచున్న చెరసాలనుండి ఒకమిత్రుని సాయమున మఱల తప్పించుకొనెను. కొన్నిదినములు స్వేచ్ఛగ విహరించుచు ఆనందముగ కాలము గడపెను. ఈవిధముగ జీవయాత్ర గడుప మనయొప్పదు స్వాతంత్ర్యసమరము జరుగు ‘రామోగ్రాండీ’ నగరప్రాంతములకు వెళ్లి స్వాతంత్ర్యయోధులతో జేరెను. వీరందఱును కలసి పెక్కుకోటలు ముట్టడించి స్వాధీనపఱచుకొనిరి. కొన్నిమారులు అపజయములు పొందినను వీరాగ్రేసరులగు వీరు విసుగు

జెందక నూతనోత్సాహముతో ననేకప్రాంతములు స్వాధీనపఱచుకొనిరి. యోధులలో నిరుత్సాహముగలిగి నపుడు మన కథానాయకుడు వీరపుంగవుల కథలు జెప్పియు, స్వాతంత్ర్యగీతములను గానముచేసియు నుత్సాహ మినుమడింపజేసెడివాడు. గారిబాల్డిని అందఱు పూజించుచుండెడివారు. దీనికి కారణము ఆప్రాజ్ఞుని నిరంతరోత్సాహపరాక్రమములే. వీరు యుద్ధముచేసి జయించిన కోటలలోను, నగరములలోను సేనానాయకుల యాజ్ఞానువర్తనులై, సైనికులు ప్రజలను పలుకీతుల బాధించుచుండిరి. స్త్రీలను హింసించుచుండిరి. పసిపాపల బంధించుచుండిరి. పురుషులను క్రూరశిక్షలపాలు జేయుచుండిరి. నగరములు, గ్రామములు, రాజభవనములు దోచుచుండిరి. అగ్నిప్రయోగములచే రాజభవనములు భస్మీపటలము గావించుచుండిరి. ఈదారుణకృత్యములు జూచి మన కథానాయకుని మనము నీరగుచుండెడిది. తనచేతనైనంతవఱ కధికారులకు చెప్పి దుండగముల బాప ప్రయత్నించియు విఫలుడగుచుండెను. ఓడిపోయిన ప్రజలను హింసించుట పాడిగాదని హెచ్చరించెను. కాని ఆలకించువా రెవరు? "భగవానుడా! అక్రమముగ, అన్యాయముగ నిరపరాధులగు స్త్రీప్రజల

హింస జూచి నామనస్సు మండిపోవుచున్నది. నీవైనను ఇట్టిసమయమున అమాయకులగు నీప్రజల రక్షించవా” అని ప్రార్థించుచుండెడివాడు.

ఒకమారు సముద్రయాత్ర జేయుచుండ తుపాను వీచి గారిబాల్డియు, ఆయనమిత్రులును ఉన్ననావ బ్రద్ద లాయెను. సాహసోపేతులగు గారిబాల్డియు, కొందఱు మిత్రులును అష్టకష్టములు పడి సముద్రతటమునకు జేరిరి. కొందఱు సముద్రునిలో లీనమై కీర్తికాయు లైరి. వారినిగూర్చి మన కథానాయకుడు వాపోయెను. సముద్ర తటము భీకరారణ్యమయము. మానవమాత్రుని దర్శ నము లభింపదయ్యె. ఆకలిదీర్చుకొనుట కేమియు లభింప దయ్యె. త్రాగుటకు నీరైనను దొరకలేదు. ఈసంకట సమయమున మన కథానాయకునికి తనప్రాణప్రియ యగు ఎనిటా స్మృతికివచ్చి హృదయశమనము గలుగ జేసెను. ఎనిటా సౌందర్యవతి; సుగుణవతి; యౌవనవతి; విద్యావతి; వీరవనిత; దేశసేవానిరత. ఇట్టి యనుకూల దాంపత్యము సంభవించుట అరుదుగనే కాంచు చుందుము. ఈవీరవనితకూడ తన ప్రాణనాథునివలె దేశ సేవానిమగ్నురాలై కీర్తిగడించెను. ఇట్టి సుగుణపుంజ యగు పత్ని లభించుట భర్తయదృష్టమేగదా? దంపతు

లిరువురును భావమున, సద్గుణమున, ఆచరణమున, ఇవి యవి యననేల, అన్నిసుగుణములలో నొక్కటియే. ఇట్టి దాంపత్యమును జూచి భగవాను డానందించు చుండునుగాబోలు.

ఒకమారు గారిబాల్డితో వీరపత్నియగు ఎనిటా యును రణరంగమున జొచ్చెను. ఉభయసేనలు కొన్ని గంటలు పోరాడెను. ఎనిటా తన యనన్య ప్రజ్ఞాధురీణత నాటి కదనరంగమున ప్రదర్శించి శత్రుసేనల జెండాడెను. ఆవీరనారీమణి యుద్ధకౌశలము జూచి శత్రువులు గూడ యచ్చెరువందిరి. ఆవీరవనితామణి కత్తికి వందల కొలది యోధులు ఎరమై వీరస్వర్గ మలంకరించిరి. కాని నాటి యుద్ధమున శత్రువులకే జయముగలిగెను.వీరపత్నిని శత్రు వులు ముట్టడించి బంధించిరి. యుద్ధము ముగిసిన పిమ్మట శత్రువులు 'నీభర్తను యుద్ధమున చంపితి' మని చెప్పిరి. ఈదారుణవార్త వినినవెంటనే వీర లలనామణి కదన భూమికి పరుగిడి అచ్చటనున్న శవములనెల్ల వెదకెను. కాని తన ప్రాణనాథుని గాంచదాయె. కట్టకడపటికి తన ప్రియుని గౌనును మాత్రము గాంచగల్గెను. దానిని ప్రేమతో దీసికొని ముద్దాడి శత్రుశిబిరమున జేరెను. వారును ఎన్నోవిధముల నీమెను కావలి గాయుచుండిరి.

నిపుణయగు నీమె శత్రుశిబిరమునుండి తన ప్రాణనాథుని గాను గైకొని తప్పించుకొని పారిపోయెను. మానవుడు జొరని సాంద్రారణ్యములు, నదులు, గుట్టలు, నగములు ఈవీరవనిత దాటవలసివచ్చెను. అనేకారణ్య మృగముల జెండాడవలసి వచ్చెను. పులులతో, సింహములతో పోరాడవలసి వచ్చెను. ఈవిధమున నాలుగు దినములు అన్నపానీయములు లేక కాలినడకనే ప్రయాణము జేసెను. అయిదవనాడు అలసి తన ప్రియునిగాను శిరము క్రింద నుంచుకొని పచ్చికబయలునందు విశ్రమించెను. అప్పు డొక ఉదారహృదయుడు ఈమెను జూచి ఒక గుఱ్ఱమును, ఆహారపదార్థములను ఇచ్చెను. ముందుగనే యింటికి పోయిన గారిబాల్డీ తన ప్రియపత్ని రణరంగమున మృతినొందిన దని తలచి దుఃఖించుచుండెను. ఇంతలో తొమ్మిదవ దినమున పలుకష్టములపాలై కృశించిన మన ఎనిటా గృహమునకు జని తన ప్రాణనాథునికి మిత్రులకు అపారానందమును గలుగజేసెను.

మరొకమారు మన గారిబాల్డీ "లాస్ ఎన్టాస్" (Las Antas) యుద్ధభూమికి పయనమై పోవుచు తన ప్రాణప్రియదగ్గఱ అనుమతి వేడెను. అప్పటికి నాలుగు మాసముల క్రిందనే యీమె పుత్రుని కనియుండెను.

తానుగూడ తనభర్తతో రణరంగమున జొచ్చెద నని ఎనిటా భర్తను వేడెను. ఇంకను ఆరోగ్యము బాగుండలే దనియు, పసిపాపను విడివచ్చుట పాడిగా దనియు గారి బాల్డీ చెప్పెను. కాని కదనరంగమును విడి సోమరివలె కూర్చుండుటకు మన మంగీకరించుటలేదనియు, తనధర్మ మును దప్పుట పాడిగాదనియు నచ్చజెప్పి, భర్తను అంగీ కరింపజేసి పాలు విడని పసికూనను వీపున కట్టుకొని భర్తతో భండనభూమి కరిగెను. యుద్ధరంగమున రెండు సేనలు తాఱసిల్లెను. భయంకరయుద్ధము జరిగెను. ఉభ యుల సేనలు మడిసెను. పసిపాపను మూపున ధరించిన వీరవనితామణి ఎనిటా శత్రుసేనల చెండాడెను. కాని దైవ కృప అన్యథా యుండుటచే మన గారిబాల్డీ ఓటమిని పొందెను. యుద్ధములో చావగా మిగిలిన సేనను, భార్యను, పసిబిడ్డను తీసికొని ఒక కీకారణ్యమున ప్రవే శించెను. మూడుమాసముల వఱకు అరణ్యములలోనే తల దాచుకొనవలసి వచ్చెను. ఆహారము లభింపమి ఫల ములను, కందమూలములను తిని జీవయాత్ర గడుప వలసివచ్చెను. బాలింత యగు ఎనిటా ఎన్నికష్టపరంప రలు వెన్నాడినను, తన ధైర్యమును గోల్పోవలేదు. తనకు సరియైన యాహారములేక, పసిపాపకు చాలినన్ని

పాలు లభింపక ఏడ్చునపుడు తాను దైవమును ప్రార్థించె డిది. తన భార్యా శిశు సేనల కష్టములు జూచి గారి బాల్డీ వగచుచున్నపుడు భర్తకు ధైర్యమును చెప్పు చుండెడిది. అట్టి సాధ్వీమణి గనుకనే భర్త కెల్లపుడు చేదోడువాదోడుగ నుండెను. చివరకు వీరు, 'సాన్ జి బ్రాయిల్' నగరమునకు జేరిరి. అచట కొన్ని దినములు మాత్ర ముండి 'మాంట్ వీడియో' నగరమునకు జనిరి. ఈ సమయమున కేవలము కూలిచేసికొని జీవింప నారంభిం చిరి. ఈపూజ్యునికి గలిగిన కష్టముల గాంచి సహింప నోల్లక కొందఱార్థిక సహాయము చేయరాగా, ఇతరులధ నము మీద నాధారపడి తుచ్ఛజీవనము జేయుటకంటె మృతినొందుటయే మేలని తలచి వారి సాయమున కంగీక రించలేదు. సహజవీరుడగు నీపురుషపుంగవుండు ఈవిధ మున జీవితముగడుప నిష్టపడక మరల తన కర్మక్షేత్ర మున కురుక సంసిద్ధు డాయెను.

బ్యూనస్ అయరిస్ విప్లవకారులు 'రోజస్'ను ముట్టడింప నిశ్చయించుకొని మన గారిబాల్డీసహాయము నపేక్షించిరి. వారి కోరికప్రకారము ఒకనావ కధ్యక్షుడై యుద్ధరంగమున పోరాడెను. ఈయన సహచరులు, వీర్య వంతులు, ఉత్సాహవంతులు గాకపోవుటచే మన

కథానాయకుని కుత్సాహము లేక వీరినుండి వేత్రై, స్వాయముగ నా ఇటాలియను లందఱిని జేర్చి ప్రత్యేక దళము నేర్పాటు చేసికొని దానికి నాయకు డయ్యెను. తన దేశీయు లన్న మిక్కిలి ప్రేమించును. "ప్రపంచమునం గల సువర్ణరాసుల నెల్ల నిచ్చినను, నా దేశీయ సేనాధిపత్యమును వీడ" నని స్వీయచరిత్రయందు లిఖించెను. వీరి సేనకు పతాకము నల్లనివస్త్రము. దాని మధ్య అగ్నిపర్వతచిహ్నము. దీని భావ మేమన ఇటలీదేశ మంధకారబంధుర మైయున్నదనియు, అయినను దానినుండి అగ్నిపర్వతము బ్రద్దలగుచున్నదనియు భావము. ఇటలీదేశ భక్తాగ్రగణ్యు డగు మేజినీమహాశయుడు తన మాతృదేశము స్వాతంత్ర్యము పొందువఱకు నల్లని వస్త్రములనే ధరించి తన దేశ దౌర్భాగ్యమును వెల్లడించెను. వీరి యనుచరు లగు యోధులెల్లరు ఎఱ్ఱనిచొక్కాలను ధరించెడివారు. మన గారిబాల్డీ యధీనమందున్న సేనలో భోగలాలసులైన ధనవంతులు, మేధావంతు లగు విద్యావంతులు, కాయకష్టముచేయు కృషీవలులు, నిపుణు లగు వ్యాపారులు, ముష్టినెత్తికొని యుదరపోషణము చేసికొను బిచ్చగాండ్రు, బజారులవెంట దిరుగు సోమరిపోతులు, మద్య

పానాది దుర్వ్యసనములకు లోనైన వ్యర్థులు దేశాభిమాన పూరితులై జేరిరి. ఇన్నిరకములవారితో కలసిన యీసేన మన కథానాయకుని నాయకత్వమున రణరంగమున శత్రుసేనల చీల్చి చెండాడెను. వీరితో డీకొనుట యనిన రిపుదళములు గజగజలాడుచుండెను. సర్వస్వమును దేశస్వాతంత్ర్యమునకు ధారవోసి యీ సేన తన కీర్తి నాచంద్రతారార్కముగ విలసిల్లజేసెను. ఇట్టి యోధులతో కదుపుకూటికై కక్కుర్తిపడు ప్రభుత్వసేనలు పోరాడగలవా?

విశ్రామ సమయములందు తన యనుచరులకు మన కథానాయకుడు సద్బోధలు చేయుచుండెడివాడు. మానవుడు విద్యాబుద్ధులు గలిగి తన దేశమును, ప్రజలను, ప్రభువగు దేవుని సేవింపవలయు నని బోధించుచుండెడివాడు. శత్రువులు బందీలుగ జిక్కినపుడు జాలితో వారి నాదరించెడివాడు. వారి కెల్ల సదుపాయములు గలుగజేసి సురక్షితముగ గాపాడెడివాడు. తన యనుచరులు వీరస్వర్గమున కరిగినపుడు స్వయముగ వారి బంధువులదగ్గఱకు జని యాదరించి తగు సహాయము జేయుచుండెడివాడు. గాయములు తగిలి బాధ నొందుచున్నపుడు తగిన యౌషధసదుపాయములు గలుగజేసి

తానుగూడ ప్రతిదినము వారికి చికిత్సజేయుచు, కన్న తండ్రివలె కాపాడెడివాడు. కాని అనేకవిధ స్వభావములు గల తన యనుచర బృందముతో మెలగుట అపుడపుడు విసుగెత్త వారిని మందలించుచుండెడివాడు. ఇది వారిలో కొందఱికి అసంతృప్తిని గూడ కలుగజేసెడిది. స్వభావముగ శాంతి నపేక్షించు నీపూజ్యుడు అందఱిని తృప్తిపఱచలేకపోయెను. కాని ఈయన అనన్య దేశభక్తిని ఏరును శంకించెడివారు కారు.

మన కథానాయకు డిట్టి దేశాభిమాని యైనను దారిద్ర్యముతోనే జీవయాత్ర గడుపుచుండెను. ఆదరించి ధనికు లొసగు ధనమును తృణప్రాయముగ త్రోసివేసెడివాడు. గౌరవపదవులను కాలితో తన్నెడివాడు. ఈపూజ్యునికి "రికిమోామినోటో" యనుపుత్రు డుదయించినపుడు వైద్యసహాయము చేయబోయిన వైద్యుడు గృహమున కొలది మొక్కజొన్నలు తప్ప నేమియు లేవని చెప్పి కన్నీరు కార్చెను. ఆవార్త తెలియగనే పలువురు వచ్చి గృహమున కావలసిన వసతులన్నియు చేసిరి. దేశభక్తులగు నీదంపతు లెన్ని దినములు అన్నపానీయములు లేక గడపిరో భగవానునికే ఎఱుక. జీవి

తమున నెన్నడును చేయి జాచ లేదు. వీరులవలెనే జీవ యాత్ర గడపిరి.

గారిబాల్డికి ఒకమారు యుద్ధమంత్రి ఆయన దేశ సేవానిరతి నభినందించుచు, ఒక బిరుదును, ధనమును పంపెను. ఆ దేశాభిమాని మంత్రిసత్తమున కీవిధమున జబా బొసంగెను.

" మంత్రిమహాశయా, మొన్న జరిగిన యుద్ధములో సేనాధిపత్యము వహించి నే జేసిన సేవకు సంతృప్తులై తాము నా కొక మహోన్నతపదవి నొసంగుచు పంపిన బిరుదమును, ధనమును జూచితిని. కాని ఇంతమాత్రము చేత నేను ఆయున్నత పదవిని, గౌరవమును పొంద నర్హుడ గానని సవినయముగ మనవి జేయుచున్నాను. మీరు పంపిన ధనమును మాత్రము స్వీకరించి, ఏసైని కుల వీరత్వముచే నేను జయభేరిని మ్రోగించితినో ఆ నా మిత్రులకు పంచిపెట్టితిని. అందు కొందఱు హతు లైరి. కొందఱు క్షతగాత్రు లైరి. ఆ కుటుంబములవారి కెక్కువ నిచ్చితిని. నా సైనికులు పెక్కురు తమ రుధిర మును ప్రవహింపజేసి యీ కీర్తిని గడించిరి. నా దేశ మాతృఋణము దీర్చుట నాకనిష్టధర్మము. దేశారాధన మొదలిడిననాడే ఒక్కకాసైనను, గౌరవపదవి నైనను

స్వీకరించ నని శపథ మూనితిని. ఇపుడు పాల్పడిన ఆత్మవంచకుడ నగుదును. కాన అన్యథా తలచక యీబిరుదమును తిరిగి స్వీకరింపుడు."

మరొకమారు ఈదేశభక్తుని అనన్య యుద్ధకౌశలమును జూచి స్వాతంత్ర్య ప్రభుత్వమువారు పారితోషికములను పంపిరి. అపుడును మరల తన ధర్మమును నెఱవేర్చితి ననియు, పారితోషికము లవసరము లేదనియు, ప్రత్యుత్తర మొసగుచు వానిని తిరిగి పంపివేసెను.

గారిబాల్డినిగూర్చి "సిగ్నోరామారియా" మొదలగు గ్రంథకర్త లీవిధమున వ్రాసిరి.

"ఈవీరుడు స్వలాభాపేక్షారహితుడై జీవితమంతయు పరోపకారపారీణుడుగనే గడుపుట యాశ్చర్యము. ఈప్రజ్ఞ దృఢసంకల్పులకే యలవిగాని, అన్యుల కలవిగాదు. తన జన్మ పరోపకారమునకే యని ఆ త్యాగమూర్తి దృఢవిశ్వాసము. ఎన్నడును భార్యాసుతుల నేమమునుగాని, తన సుఖమునుగాని అభిలషించి యెఱుగడు. తనకు సంబంధములేని యమెరికా స్వాతంత్ర్య సమరమున పాల్గొనుట మరింత యాశ్చర్యము. బహుశః ఇది అమెరికాలో నున్న తన ఇటలీదేశీయుల యుద్ధకౌశ

లముకొఱకు కాశించి యుండవచ్చును. ఈయోధులను తీసి కొనిపోయి తన మాతృదేశ దాస్యశృంఖలముల ద్రెంప నుద్దేశించియుండును." ఇట్టి స్వార్థత్యాగ ముద్భవించుట చేతనే ఇటలీ నాడు స్వాతంత్ర్యమును పొందగలిగినది.

గారిబాల్డి బుద్ధికుశలత, చులుకుదనము, పట్టుదల, వీరత్వము, ధార్మికగుణము మొదలగునవి అన్ని దేశములలోను వ్యాపించెను. ఈత్యాగమూర్తి మాంటి వీడియోలో నున్నదినములలో ఫ్రెంచి సైన్యాధ్యక్షుడు దర్శనమును జేసి ధన్యత గాంచవలయు నని యరుదెంచెను. ఈదేశభక్తుని కీర్తిచంద్రికలజూచి తన బోటి సామాన్యమానవుడు పోయిన దర్శనము లభించునా యని తలంచుచుండెను. ఆ మహాసీయుని రూప మెట్లుండునో యని యాలోచించుచుండెను. సుందర సౌధములలోనికి ద్వారరక్షకులు రానిచ్చెదరా యని శంకించుచుండెను. వీరగారిబాల్డిసౌధ మెచ్చట యని ప్రశ్నించ ఒక కుటీరమును జూపించిరి. అది చూచి యాశ్చర్యపడెను. ఆసేనాధ్యక్షుని గృహముచెంత ద్వారపాలకులు లేకపోవుట మరింత యాశ్చర్యము గలుగజేసెను. తానే స్వయముగ గృహద్వారము చెంత కరిగి తలుపును

తట్టెను. అది సాయం సమయము. కనుచీకటి పడెను.
గారిబాల్డీ స్వయముగ తలుపు తీసెను.

గారిబాల్డీ—ప్రియురాలా! ఎవరో అతిథు లరు
దెంచిరి. దీపము తెమ్ము.

ఎనిటా— గృహమున చమురులేదు. క్రొవ్వు
వత్తియునులేదు. ఏదైన తేవలయునన్న చేత కాసైనలేదు.

గారిబాల్డీ—నిశ్చయమే ప్రియా! నీ వేమిచేయు
దువు, అని ద్వారముదగ్గఱకు వెళ్లి, మహాశయా లోపలికి
దయచేయుడు. తమ నామధేయ మేమో చెప్పెదరా?

ఫ్రెంచి సేనాధ్యక్షుడు వీరి సంభాషణము నంతయు
వినుచు లోపలకు పోయెను. చీకటియగుటచే నేమియు
కనుపడదాయె. ఏమియు తోచక నిలబడి యుండెను.
అపుడు గారిబాల్డీ—"నన్ను చూచుట యావశ్యకము
కాదు గదా! సంభాషించుటకే యరుదెంచితిరి గదా!
తాము వచ్చిన కార్యమేమో తెలియజేసెదరా!" అనెను.

ఈ ఫ్రెంచి సైన్యాధ్యక్షుడు కొంతసేపు సంభా
షించి యుద్ధమంత్రికడ కరిగి గారిబాల్డీ దారిద్ర్యావస్థ
నంతయు. తెలియజేసెను. మంత్రియు తన సహచరుని
యవస్థ నంతయు విని విచారగ్రస్తుడై వెంటనే 300

రూప్యములు సేవకునిద్వారా పంపెను. ఆపైకమును తీసి కొని సూర్యోదయము కాగనే వికలాంగులకు, దరిద్రులకు పంచిపెట్టి తమకు ఆదినము భోజనమునకుమాత్రము రెండురూప్యము లట్టిపెట్టుకొనెను. ఆపైకము నుండియే అరశేరు క్రొవ్వువత్తులు దెచ్చెను. మరుదినమున గూడ ఫ్రెంచిసేనాధ్యక్షుడు ఈవీరునిజూచుటకు వచ్చెను. నాడు అతిథికి విందొనర్చిరి. ఆవిందులో అతిథికి దృప్తిగ బెట్టి వారు సామాన్య భోజనముతోనే క్షుధ నార్చుకొనిరి. క్రిందటిరేయి పంపిన ధనమును ఖర్చుపెట్టిరని తెలిసికొని, అతిథి యాదంపతుల స్వార్థత్యాగమున కచ్చెరువందెను.

గారిబాల్డి జీవితము

ఐదవ అధ్యాయము

వీరగారిబాల్డీని గూర్చి కవిపుంగవుం డగు విలియమ్‌వాట్సన్ ఈవిధమున నుడివెను.

"ఈప్రాజ్ఞుడు పవిత్ర హృదయుడు. నవనీత కోమల సద్గుణుడు. దృఢసంకల్పుడు. పట్టుదలతో పనిని సాధించు ధీరుడు. ధనికులను, వారి ధనమును జూచి గౌరవింపలేడు. యోగ్యులను మాత్రము సత్కరించెడి వాడు. అనాథలన్న అమితప్రేమ. తన దేహసౌఖ్యముల నభిలషించి యెఱుగడు. భోగముల బోద్రోలెను. గౌరవముల కాశించలేదు. ఈ పవిత్రమూర్తి వంటి నీతిమంతుడు, జ్ఞానవంతుడు, సాహసవంతుడు, ప్రతిభాశాలి లభించుట యరుదు. ఇట్టి సేవాపరాయణుల త్యాగము వలననే నాడు ఇటలీదేశము సంపూర్ణస్వాతంత్ర్యమును పొందగలిగినది."

ఈదేశభక్తుడు అనేక వత్సరములు మాతృదేశ మును వదలియున్నను ప్రేమమూర్తి యగు నా జననిని

కనురెప్పపాటైనను మరచియెఱుగడు. "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" యను నార్యోక్తి రిత్తపోవునా ? ఒక కవిశేఖరుడు నుడివినటుల "సత్యమగు ప్రేమ దూరమగుకొలదిని మరింత యధికమగును." మన గారిబాల్డి సత్యమైన దేశభక్తు డగుటచేతనే యెడబాటు సహింపనోల్లక విరహాముచే జన్మభూమిని స్మరించుచు దుఃఖించుచుండెడివాడు. ఈదేశాభిమానికి హిమముచే కప్పబడిన ఇటలీదేశపర్వతమాలలు ప్రత్యక్షమగుచుండెడివి. నీలవర్ణముగల భూమధ్యసాగరము నేత్రద్వయమున నాట్యమాడుచుండెడిది. ఇటలీదేశ నగరములు, పట్టణములు, పల్లెలు, రాత్రింబవల్లు స్వప్నములలోగూడ గాంచుచుండెడివాడు.

తన సహచరులగు దేశభక్తులు మాతృదేశమున ప్రభుత్వకోపాగ్నికి గుఱియై పడుచున్న బన్నములు తలచుకొని మరింత దుఃఖించుచుండెడివాడు. ఒకమారు ఈక్రిందిలేఖను తనదేశపు దేశభక్తులకు వ్రాసెను.

"నే నిచ్చట సుఖముగ కాలమును గడుపుట లేదు. మన మాతృదేశమున మీరు పడుచున్న కష్టపరంపరల జూచి నా హృదయము దుఃఖానలముచే జ్వలించుచున్నది. కాని నేనేమియు చేయజాలక పోతిని

గదా? ఎన్నిదినములు పరదేశములపాలై పవిత్ర మాతృ దేవిని మఱతును? ప్రియసోదరులారా! మన దేశము నకు భావిభాగ్యదశయున్న దని నమ్ముడు. మనలో గలిగిన సంచలనము దైవప్రేరితము. మనము సత్యసిద్ధాంత మునే నమ్మియున్నాము. మన ఆశయము లన్నియు నొకటే. మన శక్తులన్నియు కేంద్రీకరించ వలయును. మన ప్రాణము లున్నంతవఱకు సత్యసంకల్పమును విడ నాడ జనదు. ఇటలీ దేశీయుడు తన జన్మభూమిని వదలి పరదేశమునం దుండజాలడు. విదేశము సర్వసంపదలతో తులతూగుచున్నను తన జన్మభూమి ముందు తృణ ప్రాయముగ నెంచును. ఇటలీదేశజు డెచ్చట నున్నను స్వర్గతుల్యమగు మాతృదేశమును మఱువడు."

మన కథానాయకుడు అమెరికా దేశమునందున్న దినములలో "పరదేశవాస మింకెన్నిదినములు! ఎపుడు పోయి నామాతృదేశమునందు, నా ప్రియజన్మభూమి యగు "నాయిస్" నగరమున దారపుత్రాదులను వీడి, సంతసమున మాతృదేశసేవాపరాయణుడ నగుదునా" యని యువ్విళ్లూరుచుండెడివాడు. తన గృహమును వీడి పోయినతరువాత 1845 వ సంవత్సరమున జ్యేష్ఠపుత్రిక యగు "రోజిటా" పరలోకగతురా లయ్యెను. ఈదుఃఖ

మును సతీపతులు సహించలేకపోయిరి. పలురీతుల పలవరించిరి. ఈ సందర్భమున గారిబాల్డి యీ విధమున వ్రాసెను.

"రోజిటా సుందరమైన బాలిక. తన మృదు మధుర సంభాషణములచే మాకష్టములు మఱపునకు దెచ్చెడిది. బుద్ధికుశలత గలది. శాంత స్వభావ. తల్లి యొడిలో కూర్చుండి చిలుకపలుకులు పలుకుచు మా కానందము గలుగజేసెడిది. తాను జబ్బుగా నున్నపుడు తల్లి విలపించుచుండ "తల్లీ, ఎందుకు దుఃఖించెదవు? మన మందరము మరల కలసికొనెదము. వియోగము తాత్కాలికమే." అని అనుచుండెడిది. బాల్యముననే యిట్టి కుశాగ్రబుద్ధిగల బాలిక మరల మాకు లభించుట దుర్లభము. మాజన్మమునం దీమెను మఱచుట కష్టము.

ధైర్యశాలి యగు మన కథానాయకుడు తన పుత్రికను కోల్పోయినపుడు స్త్రీవలె విలపించెను. కొన్ని దినములవఱకు సంతాపమును మఱువలేక పోయెను. హృదయశాంతిని బొందినపిమ్మట, ఇంకను విలపించుచున్న ప్రియపత్నిని జూచి, "ఎనిటా, దుఃఖింపవలదు. చిన్నతనముననే మరణించుచు, "మన మందరము మరల కలసికొనెదము" అను మన ప్రియబాలిక మృదు

మధురవాక్కులు మఱువవలదు. దేహములు అస్థిరములు. జీవాత్మ స్థిరమైనది. ఆ మన ముద్దులబిడ్డ పలికిన పటుకుల వెనుకముందుగ మన మందఱము ఆ పరమాత్మ చెంతకు జేరవలసినదే. శాంతింపుము.” అనిఓదార్చెను.

1847-వ సంవత్సరమున యూరప్ ఖండమంతయు నల్లకల్లోలముగ నుండెను. ఎచట జూచినను బీభత్స దృశ్యములే. ఎచట గాంచినను రుధిర ప్రవాహములే. ఫ్రాన్సుదేశమున ప్రజాతంత్రవాదులు జయభేరిని మ్రోగించిరి. ప్రభుత్వసేనలు పారిపోయినవి. ఆస్ట్రియా దేశము నందుగూడ ఆందోళన మెండయ్యెను. విప్లవకారులు విజయమును బడసిరి. ఇటలీయందున్న రాజప్రతినిధిని స్వాతంత్ర్యయోధులు తఱిమివేసిరి. రాజప్రతినిధి యగు చార్లెస్ ఎల్బర్టు తన పతాకమును చంకపెట్టుకొని “టిసినో” నది దాటి పలాయనమాయెను. రాజునకు సాయముజేసిన పోపును పదభ్రష్టుని గావించి, నూతనముగ ‘తొమ్మిదవపయస’ అను పోపును మతపీఠము నధిష్ఠింపజేసిరి. ఈయన ప్రజాపక్షమునకు దోడ్పడిన దేశభక్తుడు. ఈదేశభక్తుని యాధిపత్యమున దేశమున నూతనశక మారంభమగునని ప్రజలు సంతసించిరి. దేశభక్తు లెల్లరు పరస్పరాలింగనములచే నృత్యము

చేయగడంగిరి. దేశమునం దెచ్చట జూచినను విజయోత్సవము లే.

గారిబాల్డీకి గురూత్తముం డగు మేజినీమహాశయుడు, దేశమున జరుగుచున్న పోరాటపు సందర్భము లెప్పటికప్పుడు తెలియజేయుచుండెను. తన మాతృదేశమున ప్రదర్శింపబడుచున్న సోదరదేశీయుల శక్తిని తెలిసికొనుచు గారిబాల్డి ఆనందమును పొందుచుండెను. ప్రవాసియై తాను దేశసేవ చేయనందులకు విచారగ్రస్తుడగుచుండెను. దేశీయులు దేశమాతపాదపద్మములకడ తమ ప్రాణముల బలియొసంగు కథలు విని తన్మయుడగుచుండెను. తనకర్తవ్యమునుగూర్చి రాత్రింబవలులు ఆలోచనలు సల్పు చుండెను. మాంటెవీడియోయందుండగనే, ఇటలీదేశీయపోపులకు, ఆస్ట్రియాచక్రవర్తులకు యుద్ధము పొసగెను. ఈయదను గైకొని తన మాతృదేశమతగురువులకు ఈక్రిందిలేఖను వ్రాసెను.

“మతగురువులారా! మీరు మమ్ములను, మా సంతతివారిని ఎన్నితరములనుండియో కాపాడుచున్నారు. జరుగబోవు పోరాటమున నేనును, నామిత్రులును ప్రాణము లర్పింప సంసిద్ధముగ నున్నాము. మీయాజ్ఞ వచ్చినవెంటనే సహర్షముగ సమరభూమిని దుమికెదము.

ఈశుభతరుణమున తమ పాదపంకజములకడ మార్గ
మును ప్రసవింపజేయ నవకాశ మొసగి, మాజీవితముల
ధన్యమొనరింప సవినయముగ వేడుచున్నాము."

మతగురువులచెంతనుండి ప్రత్యుత్తరము రాగనే కొంతధనమునుగూడ సేకరించెను. తన మిత్రద్వయ మగు 'అన్‌జోనీ' 'సాక్‌చీ'ల యాధిపత్యమున స్పెర్జ్జా యను నావమీాద విశ్వసనీయులగు 90 మంది యోధులతో బయలుదేరెను. తన ప్రియపత్నిని, పుత్రీ పుత్రులను ముందు నావమీాదనే పంపెను. సముద్రుడు శాంతముగ నుండెను. చల్లనివాయువులు వీచుచు యోధుల నానందపరవశుల జేయుచుండెను. వీరు కొంతకాలము పుస్తకపఠనముచేతను, ఉదయసాయం కాలములు శరీరవ్యాయామములచేతను ఆనందముగ గడుపుచుండిరి. అపుడపుడు జాతీయగీతములు గానము జేయుచు పరవశత్వము జెందుచుండిరి.

ఇట సాగరమధ్యమున గారిబాల్డీ తన యోధు లతో కలసి దేశభక్తిపూరితజాతీయగీతములు, దైవభక్తి యుతభగవన్నామకీర్తనములు గానముజేయుచు తన పూజనీయమాతృదేశసందర్శనముకై, యువ్విళ్లూరుచు ఆనందసముద్రమున దేలియాడుచుండెను. అట అమె

రికాదేశీయులు ఈదేశభక్తుని వియోగము సహించలేక విలపించుచుండిరి. ఈత్యాగమూర్తి తమ దేశమునకు జేసిన యపారసేవను కొనియాడుచుండిరి. మాంటివీడి యోనుండి కర్నల్ టేగస్ గారిబాల్డికి ఈక్రిందిలేఖను వ్రాసి ఆపూజ్యునియెడ తమకు గల భక్తిని వెల్లడించెను.

"మహాశయా; తామును, తమయోధులును మాస్వాతంత్ర్యసమరమునకు తోడ్పడుట మాభాగ్యము. మీ నిష్కళంక మానవసౌభ్రాత్రము ప్రపంచచరితము నందు సువర్ణాక్షరములతో లిఖించుట యాశ్చర్యము గాదు. మానవకల్యాణమే తమ యాశయము. పూజ్యులగు తమబోటివారి సాహచర్యమువలన మే మెన్ని విషయములో నేర్చుకొనవలసి యున్నది. మా దేశమున్నంతవఱకు మీయపారసేవను మఱువజాలము. మీ రిచ్చట నున్నదినములలో తమకు తగిన వసతులు గూడ జేసియెరుగము. మాతప్పులు మన్నింపవేడెదము. మేమును, మాసంతతియు తమకు కృతజ్ఞులము. తమ యోధుల రుధిరప్రవాహము మాకు నూతనశక్తిని గలుగ జేసినది."

గారిబాల్డి దక్షిణయమెరికాప్రజలనుండి సెలవు గైకొని జిబ్రాల్టర్ప్రాంతములం దున్న సెంట్ పోల్

(Santapole) నగరమునకు జేరెను. పోపు స్థిరచిత్తుడు గాకపోవుటచేతను, పిరికిపంద యగుటచేతను, ఆస్ట్రియా రాజుల బెదరింపులకు జంకి యుద్ధమును విరమించెను. ఇది విని మన యోధుడు వాపోయెను. తన కర్తవ్యమునుగూర్చి యాలోచింపగడంగెను. కాని దేశమునందుగల యువకుల యుద్రేకము, విప్లవసంరంభము మెండయ్యెను. ఆబాలగోపాలము స్వాతంత్ర్య మెట్లు సంపాదించెదమా యని తీవ్రాలోచనలు చేయగడంగిరి. గారిబాల్డిరాక దేశమున నూతనోత్తేజము గలిగించినది. ఈ పరిస్థితులు గమనించి చార్లెస్ఎల్బర్టు భయకంపితుడై, ప్రజలకు పలుహక్కుల నొసగు సంస్కరణములను ప్రకటించెను. ఈ ప్రకటనము దేశమునందుత్సాహము గలుగజేసినది. ప్రజాసమూహములు మూగి జాతీయ గీతములు గానముజేయుచు పురవీథులలో నుత్సవములు జేయగడంగిరి. జయభేరులు మ్రోగించుచు స్వాతంత్ర్య ప్రకటనమును గావించిరి. ఎచట జూచినను సంతోషమే. ఎచట గాంచినను నృత్యములే. ఎచట వీక్షించినను నాట్యములే. ఎచట తిలకించినను విందులే. ఎచట విన్నను జయజయధ్వానములే. దేశమంతయు త్రివర్ణాత్మకజాతీయపతాకములతో నలంకరింపబడెను.

తెలుపు, ఎరుపు, ఆకుపచ్చరంగులుగల తమ జాతీయపతాకమును గాంచినపుడు ఇటలీదేశస్థు లెల్లరు తన్మయు లైరి. కొందఱు నాట్యముజేయ ప్రారంభించిరి. కొందఱుజాతీయగీతములు గానముజేయసాగిరి. కొందఱు పరమాత్మను కీర్తింపజొచ్చిరి. దేశీయులెల్లరు స్వాతంత్ర్య ప్రమత్తు లైరనుటలో నాశ్చర్యము లేదు. గారిబాల్డి తన ఓడను వివిధవర్ణముల యలంకారములతోను, జాతీయ పతాకములతోను కడురమ్యముగ నలంకరించి జన్మ భూమియగు నాయిస్‌నగరమునకు జేరెను. ఈనగర రాజమునకు కొంతదూరమునం దుండగనే, పురవాసులు జాతీయపతాకములతో నలంకరింపబడిన యీయోడను జూచి, ఎవరో దేశభక్తు లరుదెంచుచుండిరని ఎదురు చూచుచుండిరి. ఇంతలో నావ సాగరతటమును జేరెను. వేలకొలది నగరవాసు లట జేరిరి. వారిలో ప్రముఖులు ఓడలోనికి వెళ్లి చూచుసరికి, తమ నగరవాసియగు గారిబాల్డి యందుండుట గాంచి చకితులైరి. ఈదేశభక్తు డరుదెంచె ననువార్త కొన్నినిముసములలోనే నగర మంతయు వ్యాపించెను. నగరవాసు లెల్లరు తమదేశా రాధకుని జూడ కుతూహలులై సముద్రతటమునకు వచ్చిరి. పౌరు లెల్లరు తమ నాయకునిమీద పుష్ప

వృష్టిని గురియించిరి. జయభేరులు ఆకాశము బ్రద్దలగు నటుల మ్రోగించిరి. బాలబాలికలు జాతీయగీతముల బాడిరి. పౌరులు పవిత్రమూర్తియగు గారిబాల్డీని భక్తి శ్రద్ధలతో బూజించిరి.

మన దేశభక్తుని జూడ పౌరులతోబాటు వృద్ధ జననీజనకులును సముద్రతీరమున కరిగిరి. ఏ దేశమునం దున్నను, ఎట్టికష్టములలో నున్నను, మరువక పూజింప బడుచున్న జననీజనకుల గాంచగనే ఆనందపరవశు డయ్యెను. తన ఎడబాటు సహింపక దుఃఖసముద్రమున మునిగి కృంగి కృశించి, అస్థిపంజరములవలె నున్న మాతాపితల కౌగిలించుకొని బాలునివలె శోకించెను. కొన్నిదినములు వృద్ధులగు తల్లిదండ్రులను సేవించి ఆత్మ శాంతి బొంద నిశ్చయించుకొనెను. తనకంటె ముందు వచ్చిన భార్యబిడ్డలుగూడ నిచ్చటనే యుండిరి. వారంద ఱితో కలసి కొన్నిదినములు సంతసమున కాలము గడ పెను. పెద్దకుమారునికి విద్యాభ్యాసము చేయ వయః పరిమితి వచ్చెను. తనకుటుంబమునకు కొన్నివసతులు జేయ నిశ్చయించుకొనెను. దేశీయు లెల్లరు ఈయన శాంతిగ కాలము గడుపవచ్చు ననుకొనుచుండిరి. కాని దుర్మార్గులగు రాజులతోను, పోపులతోను, పోరాటము

రాకుండునా? మరల కొన్నిదినములకు వీరిదాడి ప్రారంభముకాగా ప్రజలు డీకొనవలసివచ్చెను.

మరల గారిబాల్డీ యుద్ధసన్నద్ధుడు గావలసివచ్చెను. వయోవృద్ధులగు తలిదండ్రులను సేవింప నవకాశము లభింపలేదుగదా యని విచారగ్రస్తు డాయెను. విద్య నభ్యసింప నీడువచ్చిన పుత్రునివిద్యాభ్యాసమునకు విఘ్నము గలిగెనుగదా యని పరితాపబడెను. కాని కార్యదక్షుడగు వీరుడు కదనరంగమున కురుకకుండ నుండగలడా? మరల దేశసేవాభిలాషులగు యువకులను సమకూర్చెను. వారిలో విద్యావంతులు, నిరక్షరకుక్షులు, తిరుగుబోతులు, త్రాగుబోతులుగూడ గలరు. మాతృదేశసేవయే వీరి నందరిని ఏకము జేసినది. దేశమున నన్నిప్రాంతముల స్వాతంత్ర్యపుపోరాట మారంభమాయెను. గారిబాల్డీనాయకత్వమున నున్నసైన్యము శత్రుదళముల చీల్చి చెండాడెను. ఈసేన మోజానగర ప్రాంతమున పోవుచుండ, మిలాన్‌నగరము సంధిద్వారా శత్రువులపర మయ్యె ననియు, లోంబర్డీ ఖాళీ చేయవలసివచ్చె ననియు తెలిసి గారిబాల్డీ దుఃఖించెను. సార్డీనియాప్రాంతవాసులు విశ్వాసఘాతకులై శత్రుపక్షమున జేరిరి. ఈసమాచారము విని మనకథానాయకుడు

మరింత విచారపడెను. దేశీయు లెల్లరు ఈ అపజయములవిని నిస్పృహ జెందిరి. కాని వీరాధివీరుడగు గారిబాల్డీ స్థైర్యముతో సంరంభము సాగింప నిశ్చయించుకొనెను. నిస్పృహ జెందిన యోధుల యుత్సాహవంతుల జేసి కదనరంగమున దుమికెను.

మేజినీ అభిప్రాయభేదములచే గారిబాల్డీనుండి విడబడి, తనయనుచరులతో ప్రత్యేకముగ స్వాతంత్ర్యసమరము సల్పుచుండెను. మిలాన్ ప్రాంతముల విశ్వాసఘాతకులచే మోసపోయి మరల గారిబాల్డీదగ్గఱకు వచ్చెను. ఎన్నివత్సరముల క్రిందటనో ఎడబాటుగలిగినగురూత్తముని జూచి గారిబాల్డీ భక్తితో ప్రణమిల్లెను. తానుకూడ తనశిష్యుని సేనలో సామాన్యభటుడుగ నుండెద నని మేజినీ తనమనోనిశ్చయమును తెలియజేసెను. గారిబాల్డీ అంగీకరించకపోయినను వినక సామాన్యభటుడుగనే యుండెను. మేజినీనేత్రద్వయమునుండి జ్ఞానజ్యోతి ప్రకాశించుచుండును. ఫాలము విశాలము. బద్దవలె సన్నని శరీరముగలవాడు. పుస్తకక్రిమి యన నాశ్చర్యము గాదు. సామాన్యపుదుస్తులు ధరించి, తుపాకిని భుజమున నూని, సామాన్యసైనికునివలె సేనతో నడువసాగెను. చలి

పోగొట్టుకొనుటకు ఉన్నిదుస్తులైనను ధరించడు. బల హీనుడైనను శరీరపాటవము గలవాడు. జ్ఞానమూర్తి యగు ఈమహనీయుడు, నడచుటలో గాని, పోరు సల్పు టలో గాని, కష్టముల నెదుర్కొనుటలో గాని, ఎరికిని తీసిపోయియెఱుగడు. ఇటలీవిధాత యగు నీపూజ్యుని రాక సైన్యమున కుత్సాహము గలుగజేసెను.

ఆస్ట్రియన్ చక్రవర్తులపక్షమున 10,000 వేలమంది దృఢకాయులగు యోధులు రణరంగమునకు వచ్చిరి. గారిబాల్డీనాయకత్వమున 1000 మందిమాత్రమే స్వాతంత్ర్యయోధులు గలరు. వీ రెల్లరు దేశాభిమానపూరితులు. ధనమానప్రాణముల మాతృదేవిపాదపంకజముల బలియొసగ సన్నద్ధులైన దేశాభిమానులు. స్వాతంత్ర్యము వీరే యనుభవించవలయు నని యుత్సాహపడు వారు కారు. తమరుధిరస్రవంతి ప్రవహింపజేసినైనను, తమ భావిసంతానమునకు స్వాతంత్ర్యమును సంపాదింప బద్ధకంకణులైన ధీరులు. వారిభార్యాసుతులతో, తలిదండ్రులతో, సోదరసోదరీమణులతో, వారికి పనిలేదు. వారిని ఎన్నడును స్మరించరు. అన్నపానీయముల కాశపడరు. ఏగంజియో త్రాగి తమప్రాణముల నిల్పుకొని పోరుసల్పు యోధులు. మన రాజపుత్రయోధులప్రతా

షము వీరి కాదర్శప్రాయమేమో. చక్రవర్తిసైనికు లన్ననో కేవలము ధనముకొఱకు తనువు లమ్ముకొనిన బానిసలు.

ఇంతలో గారిబాల్డి శరీరస్వస్థత లేక నాయిస్ నగరమునకు వెళ్లి కొన్నిదినములు విశ్రాంతి గైకొనెను. అచ్చటను ఆరోగ్యాభివృద్ధి గలుగకపోవుటచే వైద్యము కొఱకు జనోవానగరమునకు వెళ్లి పేర్వడసిన వైద్యుల చెంత చికిత్స నొందుచుండెను. ఇంతలో రణరంగమునకు రమ్మని వర్తమానము వచ్చెను. సంపూర్ణారోగ్యము పొందకపోయినను కర్మక్షేత్రమగు రణరంగమునకు తరలెను. అచట ఒకవైపు టస్కాన్‌సర్కారుసేనల నెదుర్కొనవలసి వచ్చినది. మరొకదెస పోపుసైన్య నివహములతో పోరాడవలసివచ్చెను. అది చలికాలము. గారిబాల్డిసైనికులకు ఉన్నిదుస్తులైనను లేవు. కొందఱికి మామూలుగ నున్ననూలువసనములు సైతము చినిగి వ్రేలాడుచుండె. గారిబాల్డిసైనికులు ఇన్నికష్టములకు లోనైనను నిరుత్సాహము చెందక సమరభూమిని పోరుచునేయుండిరి. సంఖ్యయందు బలముగల శత్రుసేనల డీకొని హతమొనర్చుచు, రొమెగ్నానగరముద్వారా, రావెన్నానగరమును ముట్టడించిరి. ఇచట రెండుదినములు ఘోరయుద్ధము జరిగెను. ఉభయులసేనలలో సైని

కులు పడసిరి. కొందఱు క్షతగాత్రు లైరి. కడకు పోపు ప్రధానమంత్రి యైన 'రోసీ' యొక్క శిరఃఖండము చర్చి (క్రైస్తవ దేవాలయము) యొక్క సోపానములమీద దొర్లవలసివచ్చెను. గారిబాల్డీకి జయము చేకూరెను.

గారిబాల్డి జీవితము

౧౬వ అధ్యాయము

పోపు ప్రధానమంత్రి పరలోకమున కేగగనే ఆయన సైనికులలో నిరుత్సాహము ప్రబలి పిరికిపందలై ఎవరికి వీలైనటుల వారు పలాయనులైరి. మిగిలిన యధికారులు వారికి ధైర్యము చెప్పి పోకుండజేయుటకు విశ్వప్రయత్నములు గావించిరి. కాని విఫలులైరి. రోమునగరమునం దంతటను, నిరుత్సాహము, నిస్తేజము ప్రబలి ప్రజలు భయకంపితులైరి. వీరయోధుడగు గారిబాల్డీ రోమునగరమును ముట్టడించు ననువార్తలు వ్యాపించి పౌరులలో నుత్సాహము ప్రబలెను.

ఈసమయమున ప్రజాపక్షావలంబి యని పేర్వడసిన "తొమ్మిదవపయస్" అను పోపు రోమునగరమును పాలించుచుండెను. ఈయనకూడ ప్రజాభిప్రాయమునకు వ్యతిరేకముగ రహస్యముగ కుట్రలుపన్నుచుండెను. ఈ రహస్యములు గారిబాల్డీ మొదలగు దేశభక్తులకు, ప్రజ

లను కూడ తెలియవచ్చెను. అందుచేతనే గారిబాల్డీ రోమునగరమును ముట్టడింపవలసి వచ్చెను. ఇంతదనుక ఎప్పాయిన్ పర్వతపంక్తులలో నివసించుచున్న మన కథానాయకుడు రోమునగరమునకు ప్రయాణ మాయెను. ఇటలీదేశము సుప్రసిద్ధనగపంక్తులకు పేరెన్నికగన్న దని పాఠకులెఱింగియే యుండిరి. మార్గమధ్యమంతయు, గగన చుంబితనగరాజములచే విలసిల్లుచు మన యోధుల కుత్సాహము కలుగజేసెను. ఎచట గాంచినను పెక్కు రకముల ఫలవృక్షరాజములే. ఎచట తిలకించినను కురంగముల చెల్లాటలే. ఎచట వీక్షించినను మయూరముల నృత్యములే. ఎచట విన్నను కోకిలగానములే. ఎచట దర్శించినను నిర్మలోదకములచే విలసిల్లు సెలయేళ్లే. ఇట్టిదృశ్యములచే శోభిలుమార్గము యోధులకానందమును, ఉత్సాహమును గలుగజేయుచుండెను. కాని గారిబాల్డీ శరీర మస్వస్థతగ నుండి బాధపొందుచునే యుండెను. స్వాతంత్ర్యయోధులు సమీపమునకు వచ్చుచున్నవార్తలు తెలియుటచే పోపు తనకుటుంబముతోను, బంధువులతోను, ఆశ్రితులతోను రహస్య మార్గమున రోమునగరమును వీడి పలాయనుడయ్యెను. మరుదినమే గారిబాల్డీ యానగరమును ప్రవేశించెను.

స్వాతంత్ర్యప్రియులగు ప్రజలు దేశభక్తుల నెదుర్కొని స్వాగత మొసంగిరి. జయజయధ్వానములు మిన్ను ముట్టెను. గారిబాల్డి తనయనుచరులతో పోపు వీడిన ప్రాసాదమున ప్రవేశించెను.

కొన్నిదినములు గడచిన తదుపరి రోమునగరమున ప్రజాశాసనసభకు ఎన్నికలు జరిగెను. ప్రజలుత్సాహముగ నెన్నికలలో బాల్గొనిరి. మేజినీ, గారిబాల్డి, ఆర్మెలినీ మొదలగు దేశభక్తుల నెన్నుకొని ప్రజలు కృతకృత్యులైరి. 1849 సం. ఫిబ్రవరి 9 వ తేదీన రోమునగరమున స్వాతంత్ర్య ప్రకటనమును గావించిరి. ప్రజలలో నుత్సాహము ప్రబలెను. దేశమునందంతటను, విజయోత్సవముల సల్పిరి. పైన పేర్కొనిన ముగ్గురును, మఱియిద్దరు దేశభక్తులును ప్రధాన మంత్రులుగ నేర్పడి రాజ్యవ్యవహారములను నడుపుచుండిరి.

మేజినీమహాత్ముడు 1849 సం.న ఫ్రాన్సు ప్రధాన మంత్రి కీవిధమున వ్రాసెను :

"రోమునగరమున రాజు లేడు. స్వాతంత్ర్య యోధులకు జంకి పోపు పలాయనుడయ్యెను. పోపు

పారిపోవుచు ప్రభుత్వమును నడుప ఒకకమిషనును నియమించెను. వారును ప్రభుత్వమును పాలించనంగీకరించక ప్రజాపక్షమున చేరిరి. అందుచే నగరమున ఎన్నికలు జరిగెను. ప్రజాపక్షమునకు జయము గలిగెను. ఫిబ్రవరి 9 వ తేదిరాత్రి 1 గంటకు స్వాతంత్ర్య ప్రకటనమును గావించితిమి. ప్రజ లెల్ల రాయుత్సవమున సంతసమున బాల్గొనిరి. ఆనాడు జాతీయపర్వదినముగ పరిగణించి, గొప్పస్వాతంత్ర్యోత్సవమును జరిపితిమి. శాసనసభకు 144 గురు ప్రతినిధు లెన్నుకొనబడిరి. అందు 11 గురు మాత్రము ప్రజాపక్షమునకు వ్యతిరేకులు. వారిలో 5 గురు మాత్రము బహిరంగముగ పోపును సమర్థించిరి. గారిబాల్డి సేనాధిపతిగ నెన్నుకొనబడెను. నేనును, గారిబాల్డియు, మరిముగ్గురును కలసి మంత్రివర్గముగ నెన్నుకొనబడి ప్రజాపాలనమును సాగించుచుంటిమి."

మేజినీమహాత్ముని, గారిబాల్డియోధుని, స్వార్థపరు లని నిందించిన, స్వార్థపరులుసైతము వారిత్యాగమును, సేవను, దృఢనిశ్చయమును కొనియాడ నారంభించిరి. స్వార్థపరులగు కొందఱు గారిబాల్డి మొదలగువారు రోమునగరవాసులు కా రనియు, పరదేశీయు లనియు, వార్తలు ప్రజలలో వ్యాపింపజేయ గడంగిరి.

ఈస్వార్థపరులను ఆస్ట్రియనురాజులు లోబరచుకొని ఇట్టి యపవాదముల వ్యాపింపజేయ దొడంగిరి. ఈ యక్రమప్రచారమునకు మేజినీమహామహునికి కోపము వచ్చి, "ఓ రోమునగరవాసులారా! లోంబర్డు, టస్కాన్ నాయిస్, నగరవాసులగు మన ఇటాలియను సోదరులు మనకు విదేశీయులా? స్వార్థపరులగు ఫ్రాన్సు, ఆస్ట్రియా దేశీయులచేతులలో కీలుబొమ్మలై ఇట్టి అసంబద్ధప్రచారమును గావించుట పాడి గాదు. పైయుభయదేశముల వారు పోపులసాయమున మనజాతిని పీల్చి పిప్పి జేయ సమకట్టిరి. కాన వారియసత్యప్రచారమునకు లోబడవద్దని" మందలించెను.

ఎన్ని అసత్యప్రచారములు గావించినను వారి యఖండసేవవలన ప్రజలు సంతసించుచుండిరి. అందుచే స్వార్థపరుల, దేశద్రోహులమాట సాగలేదు. స్వాతంత్ర్య ప్రభుత్వము శాంతిగ జరుగుచు ప్రజలమన్ననలకు పాత్ర మాయెను సామాన్య పౌరుడుసైతము అవసరమైనపుడు స్వయముగ ప్రభుత్వమువారిదగ్గరకు వెళ్లి కష్టసుఖముల చెప్పుకొనుచుండెను. పోపుల నిరంకుశపాలనము నుండి బయటపడిన ప్రజల కిది క్రొత్తగ నుండెను. దేశమంతయు సుభిక్షముగ నుండెను. బాలబాలికలకు

జాతీయవిద్య చెప్ప నారంభించిరి. వాణిజ్యమునకు, వ్యవసాయమునకు వలయు నేర్పాటులను గావించిరి. ప్రతి పౌరునికి సైనికశిక్షను గరుప మొదలిడిరి. మంత్రికూటము యొక్క సౌభ్రాతృత్వము, సత్యసంధత, కార్యదక్షత, మొదలగువానివలన దేశము సకలవిధముల నభివృద్ధి జెందసాగెను.

కాని దేశద్రోహులగు పోపులు, అమాయకులు నిరక్షరకుక్షులగు మూర్ఖులలో, స్వాతంత్ర్యప్రభుత్వము నెడ రహస్యముగ ద్వేషభావములు గలుగజేయుచు నే యుండిరి. ఇట్టి దేశద్రోహులను శిక్షించవలసినయవసరముగూడ కలుగజేయసాగిరి. వీ రనేకదినములు అసత్యప్రచారము గావించినను, దేశభక్తులగు మేజినీ, గారిబాల్డీల కార్యకుశలతవలన, ప్రజలు సత్యమును గ్రహించి ప్రజాపాలనమునే బలపఱచుచుండిరి. ప్రజా ప్రతినిధులు తమతమ బాధ్యతలు గుర్తెఱింగి ప్రజాసేవ గావించుచుండిరి. ప్రజాపాలనమును జూచి యానందమును పొందిన గారిబాల్డీ యీవిధమున నుడివెను.

"పలుసంవత్సరములనుండి నిరంకుశులగు విదేశ రాజులవలనను, దుర్మార్గు లగు దేశీయపోపుల వలనను, బాధింపబడి బానిసత్వము ననుభవించిన రోముప్రజలు,

తిరిగి స్వేచ్ఛాస్వాతంత్ర్యమును బడసిరి. నిరస్త్రులై, నిస్తే జులై, నిరక్షరకుక్షులై, పారతంత్ర్య మనుభవించిన ఇటలీ వాసులు స్వతంత్రులైరి. ప్రజలలో నూతనవికాసము కలిగెను. దాసానుదాసులుగ నున్న ప్రజలు, వారి హక్కులను హస్తగత మొనరించుకొనిరి. వారి ప్రతినిధులను వారే యెన్నుకొని శాసనసభకు పంపుచుండిరి. ప్రజారక్షణకు వ్యతిరేకముగ మెలగిన ప్రతినిధులను, ప్రజలు మందలించుచుండిరి. ప్రజ లెల్లరు దేశకల్యాణమునకై పాటుబడసాగిరి. బానిసత్వవిద్యను బాపి జాతీయవిద్యను బోధింప మొదలిడిరి. ప్రభుత్వోద్యోగులు లంచములు గైకొనక ప్రజారక్షణకై పాటుబడసాగిరి. నిర్దోషు లగు ప్రజలను బాధింప పోలీసుద్యోగులు భయపడ జొచ్చిరి. పోలీసులుగూడ ప్రజారక్షకులుగనే మెలంగుచుండిరి. అక్రమమగు పన్ను లంత మొందినవి. వ్యాపారములలో మోసము లంతరించినవి. జూదరులు, తిరుగుబోతులు, కనపడరు. ధనవంతుల యత్యాచారములవలన నుండి సామాన్యప్రజలు బయటపడిరి. వీరు వా రననేల! ఇటలీ దేశీయులెల్లరు పవిత్ర హృదయులై దేశకల్యాణమునకై కృషిచేయు స్వాతంత్ర్యప్రభుత్వమునకు దోడ్పడిరి." వీరి

నైక్యతవలననే ప్రపంచమున నేటికిని రోమకసామ్రాజ్య పాలన యాదర్శప్రాయముగ నున్నది.

కొన్నిమాసములు గడచినపిమ్మట మరల దేశమున నశాంతి ప్రబలెను. ఆస్ట్రియన్ రాజులు రహస్యముగ యుద్ధసన్నద్ధులై, అకస్మాత్తుగ నోవారా, లోంబర్డా నగరములను ముట్టడించి స్వాధీనపఱుచుకొనిరి. అంతటితో దృప్తిజెందక మేజినీ జన్మభూమియు, దేశభక్తుల కాకరమును, ఇటలీదేశీయులకు పవిత్రతీర్థస్థానము నగు జనోవానగరమును ముట్టడించి, రాక్షససైనికులు భీభత్సమును గావించిరి. అనేక హర్మ్యముల భస్మీపటలము చేసిరి. కనపడిన పురుషులను, స్త్రీలను, పసిబిడ్డలను చిత్రవధ గావించిరి. నగర మంతయు హాహాకారములతో ప్రతిధ్వనించెను. "పో" యనునదిని దాటి సకలసౌభాగ్యముల కాటపట్టయిన రోమునగరమును గూడ ముట్టడించి ధ్వంసము గావించిరి.

స్పెయినుదేశీయులు కేథలిక్ మతస్థులు. వీరు మతగురువులను సింహాసనాసీనులను జేసి మతోద్ధరణకు పాటుబడ బద్ధకంకణు లైరి. అందుచే వారు పోపులపక్షమున జేరి యుద్ధము సల్పి వెనిస్, రోము నగరములవారి స్వాధీనము జేయ సంకల్పించిరి. స్వాతం

త్ర్య ప్రియులును, ప్రజాతంత్రవాదులు నగు ఫ్రాన్సు దేశీయులుగూడ పోపులపక్షమున జేరుట యెంతగ దోషక మానదు. చంద్రునికి కలంకమువలె వీరి కెన్నటికీమచ్చ పోదు. ఫ్రాన్సుదేశీయుల అక్రమప్రవర్తనకు గారిబాల్డి కోపోద్రేకు డయ్యెను. ఫ్రాన్సు దేశీయులు పోపులకు మద్దతుగ నుండి వారి పాలనము పునస్థాపితము జేయు సంకల్పముతో రాయబారమునకువచ్చిరి. రాయబారము విఫల మాయెను. సమరము ప్రారంభ మాయెను. ఒక వైపు ఈశ్వరప్రదత్తస్వత్వములకు ప్రాణము లొడ్డి పోరు సల్పు రోమనుప్రజావళియు, మరొకదెస రక్తపిపాసాపరులును, రాక్షసులును అగు రాజులు, పోపులును. పవిత్ర హృదయులును, దేశభక్తులును అగు రోమక కొదమ సింగములు గారిబాల్డినాయకత్వమున అహోరాత్రములు ఆకలిదప్పులను మరచి రణరంగమున వేలకొలది శత్రు సేనల హత మొనర్చిరి. స్వాతంత్ర్యయోధులలో గూడ మడయుచుండిరి. ఉభయసేనలు తారసిల్లి మూడుమాస ములు ఘోరయుద్ధమును సల్పిరి. వైపరీత్య మగు స్వాతంత్ర్యపక్షమునకే జయముగలిగెను. ఫ్రాన్సుసేనలు గూడ పారిపోవలసివచ్చెను. స్వాతంత్ర్యయోధులు విజ యోత్సవములు గావించిరి. ఈపోరాటమున దేశభక్తి

ప్రపూరితహృదయు లగు 4000 వేల రోమనులు తమ రుధిరమును, మాతృదేవీపదకమలముల ప్రవహింపజేసి వీరస్వర్గమును చూరగొనిరి. అనేకులు క్షతగాత్రు లైరి. కొందఱు వికలాంగు లైనను పోరు సల్పుచునే మరణించిరి. ఈసమరయజ్ఞమునకు గారిబాల్డీ, ఎవెజ్జనా, రోజలీ, (Avezzana and Rosselli) ఆధారభూతులు. ఈయోధులవీరత్వమును ప్రపంచము నేటికిని స్మరించుచున్నది. ఈదేశభక్తులు సమయానుకూలముగ సైనికుల కుత్సాహమును, ధైర్యమును, కలుగజేయుటచేతనే విజయమును వడసిరి. రోమనుప్రజ లీయుద్ధమున తమపరాక్రమమును ప్రదర్శించి శాశ్వతకీర్తిని గడించిరి. దేశసేవానిరతులై ప్రాణముల తృణప్రాయముగ బలియొసగిన వీరులు ధన్యులు. స్వలాభాపరాయణులై ధనమున కాశించి మాతృదేశము నమ్ము దేశద్రోహులజీవితములు తుచ్ఛములుగదా?

గతయుద్ధమున నోడినతరువాత ఫ్రాన్సుదేశీయులు కొన్నిదినము లూరకుండిరి. ఈసమయముననే వారిని ఎన్నటికిని తల నెత్తకుండ సకలవిధముల నణగద్రొక్కవలయు నని గారిబాల్డీయుద్దేశము. ఈయభిప్రాయమును ప్రధాననాయకు లంగీకరించలేదు. ఓడి పిఱికిపందలై

పారిపోయినవారిని హింసించుట న్యాయము గాదని మేజినీ మందలించెను. ఈయదనును విడిచిన శత్రువులు బలమును సంపాదించి మనమీదకు దండెత్తి వచ్చెదరు. అపుడు పోరుట కష్టతరము. కాన ఇపుడే వీరిని నేలమట్టము చేయవలయునని గారిబాల్డీ వాదించెను. కాని ఈ యభిప్రాయము లెవరు బలపఱుపకపోవుటచే గారిబాల్డీయేమియు చేయలేక తన గురూత్తము డగు మేజినీని పలువిధముల తూలనాడి పోట్లాడెను. ఎన్ని చేసినను ప్రయోజనము లేకపోయెను.

ఇట్లుండగనే ఫ్రెంచివారు అలసట దీర్చుకొని తిరిగి బలమును చేకూర్చుకొనసాగిరి. మరల రోమును ముట్టడించు గుసగుసలు బయలుదేరెను. సమరమునకు సకలప్రయత్నములు జేయదొడంగిరి. ఫ్రెంచివారికి తమ మిత్రులుగూడ తోడ్పడెదమని బాస నొసంగిరి. ఫ్రాన్సు దేశమున నూతనోత్సాహము ప్రబలెను. వీరియాలోచనలు ఇటలీదేశీయులకు తెలిసెను. తమకర్తవ్య మేమాయని యాలోచింపదొడంగిరి. గారిబాల్డీ తన గురు వగు మేజినీకి ఈక్రిందిలేఖను వ్రాసెను :

"గురుదేవులగు మేజినీమహాశయా!

ఈక్లిష్టసమయమున నాకర్తవ్య మేమియో చెప్పకుండ నుండజాలను. సేనాధిపత్యమును నాకొసంగుటకు కొంద రంగీకరించుట లేదుగదా! ఇదివఱకు మీరందఱు నామాట విన్న మనదేశమున కీముప్పు వాటిల్లి యుండెడిది కాదుగదా! మీరు పూజ్యులు, మేధావంతులు. నేనీసమయమున సామాన్యసైనికునిగ నుండి స్వాతంత్ర్య రోమునగరమున కేమియు చేయజాల నని సవినయముగ మనవి జేయుచున్నాను. సైన్యాధ్యక్షునిగ నియమించి సకలస్వాతంత్ర్యముల నొసగుడు. నే చేసిన యీవిన్నపమును అన్యథా తలచక క్షమింపుడు.

మీ యనుంగుశిష్యుడు,
గారిబాల్డి.

ఈలేఖను గాంచి నాయకబృంద మచ్చెరువందిరి. కొందఱు గారిబాల్డికి కోరినహక్కుల నీయవలయుననిరి. మరికొంద ఱంగీకరించకపోయిరి. గారిబాల్డిని సమర్థించువారు ఆయనకు గొప్పప్రతిభ గలదనియు, ఉత్సాహముతో పట్టుదలతో కార్యమును నెగ్గించు దక్షు డనియు, లోబడుస్వభావ మావంతయు లే దనియు, సిసిలీయుద్ధమున సైన్యాధ్యక్షత వహించి జయించి తన ప్రజ్ఞను

చాటిన ధీరు డనియు, ఈతరుణమున ఆధీరునికి సైన్యాధిపత్య మీయకుండుట మన దేశ దురదృష్ట మనియు, ఈ యశకీర్తిని పొంది తదుపరి వగచిన లాభము లే దనియు వాదించిరి. ఏకాభిప్రాయులు కాలేక మిన్నకుండిరి. ఈవివాదములను విని గారిబాల్డీ చింతించెను.

కొలదిదినములకే ఫ్రాన్సువారు యుద్ధమును ప్రకటించిరి. ఫ్రాన్సుదేశయువకులు, బాలురు, వృద్ధులుకూడ ఉత్సాహమున యుద్ధమునందు పాల్గొనిరి. అకస్మాత్తుగ రోమునగరమును ముట్టడించిరి. దురదృష్టవంతులగు ఇటలీదేశీయులు ఇంకను ఆలోచనలలోనే కాలముగడుపుచుండిరి. తత్సమయమున సైన్యాధిపత్యమును వహించుట కేరును అంగీకరించకపోయిరి. ఆధిపత్యము వహించ నుత్సహించిన నూతనపురుషులు శత్రువులదాడిని జూచి భయపడి వెనుకంజవేసిరి. మరల అందఱును కలసి గారిబాల్డీనే ప్రార్థించిరి. శత్రుసైన్యములు ముట్టడించిన తరి ఎంతప్రతిభాశాలి యైనను ఏమి చేయగలడు? ఈ సమయమున సైన్యాధిపత్యము వహించి యశఖ్యాతిని పొంద గారిబాల్డీ యంగీకరించలేదు. సామాన్యసైనికుడుగనే యుండి తనధర్మమును నెఱవేర్చెద ననెను.

స్వాతంత్ర్యప్రియులగు ఇటలీదేశీయులకు, తమకు. సంబంధములేని అక్రమయుద్ధము సల్పు ఫ్రాన్సుదేశీయులకు సమర మారంభ మాయెను. ఉభయ సేనలలోని యోధులు క్షతగాత్రు లైరి. కొందఱు వికలాంగు లైరి. రక్తస్రవంతి రోమునగర రాజవీధులలో పారుచుండెను. ఫ్రెంచిసైనికులు రోమునగరమున గృహములలో చొచ్చి, పసిపాపలను, నారీమణులను, హింసించిరి. రోమునగర మంతయు ఆర్తనాదములతో ప్రతిధ్వనించుచుండెను. దేశభక్తిపూరితులగు ఇటలీదేశీయులు వేలకొలది తమధర్మమును నెఱవేర్చి వీరస్వర్గమలంకరించిరి. ఫ్రెంచిసైనికులుకూడ పలువురు మడసిరి. ఈదృశ్యమును జూచి ప్రాణములతో నున్న ఇటలీయోధులు వివర్ణు లైరి. ప్రధాననాయకులు కింకర్తవ్యతామూఢు లైరి. నాయకు లొకచోట జేరి తమభావికర్తవ్యమునుగూర్చి యాలోచించిరి. ఎన్నియాలోచనలు చేసినను ప్రయోజనము లేదను నిశ్చితాభిప్రాయమునకు వచ్చి యుద్ధమును విరమింప ప్రకటించిరి. చెల్లాచెదరైన సైనికులు ఎవరికి వీలైనటుల వారు తమప్రాణములను కాపాడుకొనజొచ్చిరి. ఈసమయమున మేజినీ, గారిబాల్డీలు పొందిన మనస్తాపము వర్ణనాతీతము.

౩ ఱ వ అ ధ్యా య ము

అమెరికారాయబారి మేజినీని రక్షింపవలయునని ప్రయత్నించెను. మేజినీమహాశయుడు, నేను రాజద్రోహిగనే యుండెదను గాని ఒకరిసాయ మపేక్షించి ప్రాణమును దక్కించుకొనననెను. ఇంతలో మేజినీ గారిబాల్డీ మొదలగు దేశభక్తులను రాజద్రోహులని ప్రకటించి, బంధింప ప్రయత్నమును సలిపిరి. ఈసమయమున పట్టువడుట రాజనీతి గాదని అందఱును నిశ్చయించుటచే, తప్పించుకొనుటకు మేజినీ కూడ నంగీకరించెను. రాజద్రోహిగ ప్రకటించిన మన మేజినీని, తనఓడమీద తీసికొనిపోవుటకు ఒకకెప్టెను సాహసించెను. ఈపూజ్యుని తీసికొని మార్సలీస్ వైపునకు పయన మాయెను. లెగ్ హారన్ ప్రాంతముల ఆస్ట్రియనులు ఈనావను పట్టుకొని మూలమూలలను పరీక్షించిరి. దేశభక్తులను పట్టి బంధించుటకే వీరు శ్రమపడుచుండిరి. వీ రెంత వెదకినను మేజినీని గుర్తించలేకపోయిరి. ఆసమయమున మనదేశభక్తుడు సేవకునిదుస్తులు ధరించి పాత్ర సామానులను శుభ్రముచేయుచుండెను. అందువలన వా రణుమాత్రమైనను సందేహించ లేకపోయిరి.

మేజినీమహాశయుడు శత్రువులనేత్రములలోధూళి జల్లి స్విట్జర్లాండు దేశమునకు చేరెను. అష్టకష్టము

లకు లోనై తనప్రాణమును కాపాడిన నావికాధ్యక్షు నకు కృతజ్ఞతను దెలిపెను. సర్వమును త్యజించి మానవ కల్యాణమునకు పాటుబడు తమబోటి దేశభక్తుల సేవ లభించుట మాభాగ్యమని యా నావికాధ్యక్షుడు ప్రణ మిల్లెను. దేశభక్తునిదగ్గర సెలవుగైకొని యాయన వెళ్లి పోయెను. ఆరోగ్యప్రద మగు స్విట్జర్‌ల్యాండు నందు విశ్రాంతి తీసికొనవలయు నని మేజినీ యభిప్రాయము. ఆందోళనములచే వికలమైన మన దేశభక్తుని మనస్సు కొన్నాళ్లకు శాంతిని పొందెను. తన మాతృదేశము యొక్క భావిభాగ్యమును గూర్చి యాలోచించుచునే యుండెను. తన జన్మభూమియొక్క భావికల్యాణమును స్వప్నములలో గాంచుచుండెను. ఈమహనీయుని చెంత పలువురు దేశభక్తులు చేరిరి. వీ రందఱు తమ భావికర్త వ్యమునుగూర్చి పలుభంగులచర్చించి కార్యవిధానమును నిర్ణయించిరి. ఈనిర్ణయఫలితములవలననే 1860-వ సంవ త్సరమున ఇటలీదేశమునకు కల్యాణము చేకూరెను.

ఈ తరుణమున గారిబాల్డి రోమునగరమునం దుండుట సమంజసము గాదనియు, ఉన్నచో శత్రువుల చేతులలో చిక్కక తప్పదనియు భావించి, దేశభక్తు లగు కొందఱు మిత్రులతో, మారుమూలల నున్నగ్రామము

లకు వెళ్లిపోయెను. తమ భావికర్తవ్యమును నిర్ణయించు కొనుటకు పలువురు దేశభక్తులీయనచుట్టును జేరిరి. ఆ సమయమున గారిబాల్డీ సోదరదేశభక్తుల నీ విధమున హెచ్చరించెను.

" సోదరులారా !

మన పరాజయమును గాంచి దుఃఖింపజనదు. ఇది యంతయు భగవంతునిమాయ. లోకైకనాథుడు మనల పరీక్షించుచుండెను. ఈయగ్నిపరీక్షలో మనశక్తిసామర్థ్యములను ప్రదర్శించి జయభేరిని ప్రమోగింప బద్ధకంకణులు గండు. మన నైకమత్యమే మనబలము. దేశభక్తిప్రపూరితులగు మీకు తగుసౌకర్యములను గూడ జేయలేనిస్థితిలో నున్నాను. మీకు నే నొసంగునది ధరించుటకు చినిగినవస్త్రములు, అనుభవించుటకు ఆకటిబాధ, విశ్రమించుటకు మంచుతోనిండిన భూమి. ఇవియే మీ కొసంగు పారితోషికములు. వీని ననుభవింప సిద్ధముగ నున్న దేశభక్తులే నాతో రండు. మిగిలినవా రిపుడే వెనుకకు మరలుడు."

ఈసందేశమును వినగనే అచటచేరిన వేలకొలది యువకులలో నుత్సాహము కలిగెను. కష్టములనుభవింప

సిద్ధముగ లేనివారు వెనుకకు తరలిరి. తమ దేశబంధ విముక్తికై ప్రాణములసైతము తృణప్రాయముగ నెంచిన 5000 వేలమంది యోధులు తివోలీనుండి మన గారిబాల్డీనాయకత్వమున రోమునగరమును ముట్టడింప ప్రయాణమైరి. గారిబాల్డీ వీరపత్నియగు ఎనిటాగూడ గుఱ్ఱము నెక్కి వీరితో రణరంగమునకు జనియెను. మత గురువగు "యుగోబాస్సీ" కూడ వీరితో కలసెను. ఈయన దేశాభిమాని యగు పురోహితుడు. తన దేశ ప్రజలకష్టములను గాంచి వారితోగూడ స్వాతంత్ర్యసమరమున పాల్గొనుచున్న మహానుభావుడు. తనకుగలసంపదనంతను ప్రజాసేవకై వినియోగించిన వితరణశాలి. ఈ దేశభక్తుని యుద్రేకపూరితోపన్యాసములు విని పలువురు స్వతంత్రపక్షమున జేరిరి. ధనికులు పెక్కురు ఈయనపలుకుబడివలన ఉద్యమమునందు పాల్గొనిరి. మతగురువుల దుష్కృత్యములు నిర్భయముగ జాటిన ధీరుడు. దేశభక్తికారణమున మతగురువులు ఈయనను బహిష్కరించిరి. ఇంతేకాదు. దేశభక్తి నేరముగ మోపి పలువత్సరములు ఎప్పాయిన్‌కేకారణ్యముకు ప్రవాసిగ బంపిరి. ఇన్నిబన్నములకు లోనైనను తనప్రజాసేవను మఱువలేదు. ఈ దేశభక్తుని నిరాడంబరము, సత్యసంధత

దేశీయులకు మార్గదర్శక మాయెను. ఈయాత్రలో గ్రామములలో ప్రబోధము చేయగడంగిరి. తమనాయకుడగు గారిబాల్డీని మార్గమధ్యమున నున్న ప్రజాసమూహములు పూజింప నారంభించిరి. ఈవీరుని దేశాభిమాన వాగ్జాలమును విని దేశమున నూతనోత్సాహము కల్గుచుండెను. తమ వీరమాతయగు ఎనిటాకూడ యుద్ధపు దుస్తులను ధరించి వారువము నెక్కి, రణరంగమున కురుకుట గాంచి దేశమున నలజడి గలిగెను. ఆవీరురాలి దేశాభిమానమును వేనోళ్ల పొగడుచుండిరి. కోమలగాత్రి యగు లలనామణిసైతము కదనభూమి కరుగుట గాంచి పురుషసింహులలో నుత్తేజము కలిగెను. తమ నాయకుని యనుజ్ఞను వేడి క్రొత్తవారు సైతము సైన్యములో జేరిరి. ఇటలీస్వాతంత్ర్యోద్యమమునం దభిమానముగల టర్నీ, కర్నల్ ఫోర్బెస్ అనునిరువురాంగ్లేయులు కూడ వీరిలో కలసిరి.

గారిబాల్డీయు, అనుచరులును పలుబన్నము లెదుర్కొనవలసి వచ్చెను. బయలుదేరగనే వెదకుటకు ఫ్రాన్సుదేశీయులు, ఆస్ట్రియన్ సేనలువెన్నాడెను.వీరితో పలువురు మతగురువు లుండిరి. వీరిచర్యలు విపరీతముగ నుండెను. ఒకచేత బైబిలును, మరియొకచేత కత్తియును

ధరించెదరు. ధర్మమార్గమునకు దేవదూతల మన్నప్రగ ల్భములు పల్కు వీరిచెయ్దము లేహ్యములు. ఎపుడు వీలైన నపుడు ఏమార్గముచేతనైనను సరియే క్రైస్తవు డగు గారిబాల్డిని చిత్రవధ గావించుటయే వీరిసంకల్పము. వీరిజాడలు తెలియుటతోడనే గారిబాల్డి కడు జాగరూక తతో నుండెను. వెంటనే యుద్ధము చేయ నిచ్చలేదు. ఇంకను కొన్నాళ్లు ప్రచారముచేసి తదుపరి సంరంభ మారంభింపవలయు నని యాయన యూహ. కాని రక్త పిపాసాపరాయణములగు శత్రుదళములు వీరిని వెన్నంటు చునే యుండిరి. ప్రస్తుతము పోరాటము సాగించుటకు నిష్టపడక తన యనుచరులతో శత్రువుల బారినుండి తప్పించుకొనుచు, గారిబాల్డి పోవుచునేయుండెను. గారి బాల్డిసేనకు కొన్నిదినము లాహారపానీయములు గూడ లభింపవయ్యెను. దుస్తులైనను సరిగ లేకపోవుటచే కొం దఱు యోధులు చలిబాధచే ప్రాణములు గోల్పోవ వలసివచ్చెను. మరికొంద ఱాకలిచే పీడింపబడిమృత్యువా వాత బడిరి. మార్గమధ్యమున నగములు, సాంద్రారణ్య ములు, నదులు దాటవలసివచ్చెను. వీనిని దాటలేక పలు వురు ప్రాణములను గోల్పోయిరి. అలసి రాత్రులం దెపు డైనను విశ్రమించిన, రాక్షసాధములగు శత్రువులు అక

స్వాత్తుగా పైబడి వధింప మొదలిడిరి. వీరికష్టపరంపరలు లెక్కకు మిక్కుటము. వీనిని వర్ణింప నాదిశేషునికైన నలవిగాదు. ఆహా! త్రిలోకరక్షకా! నీవు గూడ పక్షపాతివా?

ఎట్టకేలకు అష్టకష్టములు పడి గారిబాల్డీ పోయిన వారు పోగా మిగిలిన పండ్రెండువందల (1200) మంది యోధులతో ప్రజాపాలితమగు సాన్మారినో (Republic of Sonmarsns) యను రాష్ట్రమునకు జేరెను. స్వాతంత్ర్యోద్యమమున నభిమానము గల, ఈ రాష్ట్రవాసులు వీరిని నుచితరీతిని సత్కరించిరి. వీరి నాయకోత్తముడగు గారిబాల్డీని సుమమాలలతో నింపి తమకు గల భక్తిని వెల్లడిగావించిరి. అలసియున్న మన యోధులు వీరి యాతిథ్యమున విశ్రాంతి గైకొనిరి.

కాని యింతటితో వీరికష్టములు గట్టెక్క లేదు. వీరి యలసట తీరెనో లేదో, ఇంతలో ఆస్ట్రియా సేనాధిపతి యగు గోరజోస్కి (Gorzhowski) స్వతంత్రులగు సాన్మారినోరాష్ట్రమువారు అసమర్థు లనియు, నింకొకరిని రక్షించుటకు చాలినంత బలము వీరికి లేదనియు తలచి వారికి "మీరు గారిబాల్డీకి, వాని యనుచరులకు రక్షణ నొసంగిరని తెలియుచున్నది. అది అక్రమము.

వారు మాశత్రువులు. వెంటనే వారిని మీ రాష్ట్రము నుండి వెడలగొట్టనిచో, మా సేనలతో మీ రాష్ట్రమును ముట్టడించి స్వాధీనము చేసికొనెద” మని బెదరించెను. ఇంకొకకమ్మ గారిబాల్డికిగూడ వ్రాసెను.

“గారిబాల్డి! నీవు మాయధికారము నంగీకరించిన నీ యనుచరులను క్షమించి విడిచెదము. నిన్ను క్షమించి అమెరికాదేశము పోవుట కనుజ్ఞ యొసగెదము” అని వ్రాసెను. ఈలేఖగాంచి గారిబాల్డి మండిపడి దానిని ముక్కలుముక్కలుగా చించి పారవేసి కాలితో మట్టి వేసెను. తన యనుచరులతో నీక్రిందివిధమున జెప్పెను.

“నా ప్రాణముల రక్షణార్థము, నా సౌకర్యముల కొఱకు జన్మభూమికి ద్రోహము చేయనొల్లను. సోదరులారా! మనము ప్రచండదావాగ్ని నెదుర్కొనవలసి యున్నది. మన కష్టపరంపరలు మిక్కుటమగుచున్నవి. మనప్రాణములు పోవుటయో, మాతృదేశమును రక్షించుటయో తేలవలసియున్నది. శత్రుసేనల నెదుర్కొను శక్తిలేనివారు వెనుకకు మరలుడు. సాహసోపేతు లగు యోధులే నన్ను వెంబడింపుడు.”

ఈవాక్యములు వినగనే సైనికులలో పెక్కురు భయవిహ్వలు లైరి. బాధ లెదుర్కొనజాలమని నాయ

కునితో మనవిచేసికొని సెలవును వేడిరి. వీరిని సాదరముగ దీవించి సంతసమున సెలవు నొసగెను. వీరు 900 మంది. మిగిలిన 300 మంది నిశ్చల దేశభక్తులు తమ నాయకుడగు గారిబాల్డీవెంట వెడలుటకు కృతనిశ్చయులైరి. వీరిని పలుభంగుల పరీక్షించి తనను వెంటాడుట కనుజ్ఞ యొసగెను. ఆహా! ఏమి వీరి దృఢసంకల్పము! త్యాగము! బానిససంతతికి మార్గము జూపిరిగదా ?

గారిబాల్డీనుండి సెలవుగైకొని గృహోన్ముఖులైన 900 మందిని ఆస్ట్రియన్ ప్రభుత్వమువారు దేశద్రోహులుగా పరిగణించి కారాగారముల బంధించిరి. ఇందు పెక్కురను మాంటువా (Mantva) చెరసాల కంపిరి. వీరిని పలుభంగుల హింసించిరి. గారిబాల్డీని, ఆయనఅనుచరులను పట్టితెచ్చువారికి బహువిధ పారితోషికముల నొసంగెద మని ప్రకటించిరి. గారిబాల్డీని, సజీవునిగనైనను నిర్జీవునిగనైనను పట్టితెచ్చువారికి వారేదికోరిన నది యొసంగ సిద్ధముగ నున్నామనికూడ ప్రకటించిరి. రాజద్రోహులలో నెవరినైన పట్టితెచ్చినవారిని నిర్దోషులుగ భావించి తగినవిధమున సత్కరించెద మని వెల్లడించిరి. కాని యాదేశద్రోహమున కేరును ఒడిగట్టుకొనలేకపోయిరి.

గారిబాల్డి తనసేనతో పల్లెలు, పట్టణములుదాటి పోవుచుండెను. లభించిన భోజనముచేసెడివారు. లేనిచో మడతకుడుములు భుజించెడివారు. కాని దేశభక్తులగు వీరిని పలువురు సకలవిధముల సత్కరించుచు, తమకు గల స్వాతంత్ర్యోద్యమాభిమానమును వెల్లడించిరి. కొన్నిదినములకు సముద్రతటమునకు జేరిరి. ఆ దినములలో వీరమాత ఎనిటా కస్వస్థత గలిగి అశ్వారూఢయై వెళ్లలేకపోయెను. ఆమెయశక్తత గాంచి డోలీయందుంచి మోయజొచ్చిరి. వీరియభిప్రాయమున కాసాధ్వీమణి మొదట నంగీకరింపలేదు. కాని యెక్కువ కృశించుటచే వారియభిమతముప్రకారము అంగీకరింపక తప్పినది కాదు. రెండుమూడుదినములు గడచినతరువాత వీరికి పదుమూడు ఓడలు లభించెను. వాని నధిరోహించి సముద్రయాన మొనర్పసాగిరి.

అది నిశీథము. కారుమేఘములు గ్రమ్మ గాఢాంధకారము దిక్తటముల నావరించెను. సాన్ మెరినో ప్రజాస్వామికమువారికి, వారొనర్చినవసతులకు, ఆదరణమునకు హృదయపూర్వక నమోవాకము లొసగి వారికడ సెలవు గైకొనిరి. సాగరమధ్యమున నిర్భయముగ కాలము గడపుచుండిరి. తమకు గలిగినకష్టము లొకరొకరు చెప్పుకొనుచు

హృదయతాప మణచుకొనుచుండిరి. సంతసమున జాతీయ గీతములగానము సేయుచు తన్మయు లగు చుండిరి. వెన్నెల రాత్రులుకూడ. సంభవించెను. ఆ వినిర్మలజ్యోత్స్నా పూరమునందు పలుభంగుల ఆనందాంబుధి నోలలాడుచు కాలము గడపు చుండిరి. అప్పుడపుడు వీరపుంగవుడగు గారిబాల్డీ వీరోచితగాథలు చెప్పుచు సైనికుల కుత్సాహము గలుగజేయుచుండెను. వెనిస్‌నగరరాజము చేర వలయు నని యోధులసంకల్పము.

ఆంగ్లమిత్రుడగు ఫోర్‌విస్‌కూడ ఆనందముగ కాలము గడుపుచుండెను. మరుదినమే వెనిస్‌నగరము చేరెద మని తలచుచుండిరి. కాని భగవానుడు అన్యథా తలచెను. ఆస్ట్రియన్ ఓడలు వీరిని ముట్టడించినవి. తల వనితలంపుగ సంభవించిన యీ యాకస్మికవిపత్తునకు వగచిరి. చేయునది లేక శత్రుదళముల నెదుర్కొనిరి. ఉభయసేనలకు ఘోరసంగ్రామము జరిగెను. ఇద్దరికిని నష్టము వాటిల్లెను. కాని ఇటాలియనులకు నెక్కువ నష్టము గలిగెను. వీరి తొమ్మిదినావలను, ఆస్ట్రియనులు సముద్రమున ముంచివేసిరి. వానియం దున్న సామగ్రియు మనుజులుగూడ నీటమునిగిరి. గారిబాల్డీ మిగిలిన నాలుగు యోడలందున్న వారితోనే యుద్ధము సాగించెను. వీరి

పౌరుషప్రదర్శన మత్యద్భుతము. బలోపేతులగు శత్రువులతో పోరాడి స్వీయకీర్తిచంద్రికల ప్రపంచమున ప్రసరింపజేసి ధన్యులైరి. ఎంతపోరినను లాభము లేకపోయెను. గారిబాల్డీ వీరయోధుడు చేయునది లేక కాలానుసారముగ మిగిలిన తనయచరులతో రెవెనా (Ravana) నగరమునకు జేరెను. ఇదియు శత్రునగరమే. ఇచ్చటను మతగురువుల ప్రాబల్యము మెండు. ఎచ్చటకు వెళ్లినను శత్రువులు ముట్టడించుచునే యుండిరి. గ్రామములు, పట్టములు వదలి కఠిన పర్వతాగ్రములందు కాననములందు తల దాచుకొన ప్రయత్నించి విఫలులైరి. ఎన్నికష్టములనుభవించినను వెనీస్‌నగరము చేరవలయునను కాంక్ష వదలలేదు. ఇసుకయెడారులలో నడువవలసి వచ్చెను. ప్రచండభానుడు గగనరంగమున స్వీయ ప్రతాపమును ప్రదర్శించుచుండెను. ఈ మండువేసవిలో రోగముచే కృశించిన మనవీరవనితానూత నడువలేక మూర్ఛిల్లెను. కొందఱు, ఈమె నెత్తుకొని నడువజొచ్చిరి. యోధులలో కొందఱు ఈయెడారిలో త్రాగుటకు నీరు లేక దాహాగ్నిచే పరమపితయంకతలము నధివసించిరి. మరికొందఱు క్షుత్పిపాసలు భరింపనోల్లక నాకలోకాతిథ్యమును స్వీకరించిరి. ఈకష్టపరంపరలదాడి కాగలేక యోధులలో

కొందఱు గృహోన్ముఖులైరి. ఇట్టితరుణమునగూడ మన గారిబాల్డీ తన యకుంఠిత ధైర్యమును వీడక గమ్యస్థానమును జేర ప్రయత్నించుచునేయుండెను.

గారిబాల్డీచెంత సెలవు గైకొనిన సైనికులు నిజ గ్రామములకు జని తమయాలుబిడ్డల, జననీజనకుల, బంధుగులను గాంచ నువ్విళ్లూరుచుండిరి. కాని శత్రుదళమగు ఆస్ట్రియనులు వీరిని వెంటాడి ముట్టడించి చెప్పనలవికాని చిత్రవధలపాలు గావించిరి. కొందఱిని చెఱసాలలో బంధించిరి. మరికొందఱిని నురికంబములకు బలియొసంగిరి. ఈసందర్భమున గారిబాల్డీ తనచరిత్రమునం దీవిధముగ లిఖించెను.

“నాదగ్గఱ సెలవుగైకొని గృహాభిముఖులైవెళ్లిన దేశభక్తులకు గలిగిన విపత్పరంపరలు తలచుకొనిన హృదయము బ్రద్దలగుచున్నది. వీరిలో నొక జనకుడు, ఆయన యిరువురుపుత్రులు గలరు. అందు చిన్నవానికి పదుమూడు వత్సరములుమాత్రమే. ఇంకొకరు జినీవా మతగురువు. మరియొకరు ధర్మజిజ్ఞాసు వగు “యుగోవాసి” నగరవాసి. వీరితోబాటు ఇంకను నలుగురు దేశభక్తులు గలరు. ఈతొమ్మిదిమందిని యొక ఆస్ట్రియను రాజకుమారునిదగ్గఱకు తీసికొనిపోయిరి. ఆయన వారికి

మరిశిక్ష యొసఁగెను. అంతకుముందే వీరిని పలుభంగుల కొర్రడాలతో మోదిరి. లాఠీలతో చావగొట్టిరి. చిత్రవధ గావించి రనుటలో నతిశయోక్తి లేదు. అందును మతగురువును చెప్పరాని విధముల పలుహింసలపాలు గావించిరి. ఈతొమ్మిదిమందిని గుంటలు తీయించి పూడ్చించిరి. మతగురువును మరియొక మతగురువుచేతనే గాల్పించిరి. మిగిలినవారిని గూడ ఇటాలియనులచేతనే గాల్పించిరి. మాసోదర దేశీయులచేతనే మమ్ము హింసించుట జూడ మా కవమానము గలుగుచున్నది. ఎవరైనను దేశభక్తులగువారు ఈ హింసల కియ్యకొననిచో వారినిగూడ బాధింపఁగడగిరి. బాధలు సహింపగలవారు క్రూరకార్యములలో పాల్గొనక మిగిలినవారికి మార్గదర్శకు లగుచుండిరి. ”

వీరికి సామీప్యముననే గారిబాల్డి, ఆయన ధర్మదారయగు ఎనిటా, లెప్టినంటు లెగీరో (Leggiero) కూడ గలరు. వీరు తలదాచుకొనుటకు ప్రయత్నించుచు లామన్‌డ్రియోలా (Lamandriola) యను గ్రామమునకు పోయిరి. అందొక సచ్చారిత్రుడగు పేదకర్షకుడు గారిబాల్డిని గుర్తించి తనపర్ణకుటీరమున కాహ్వానించెను. ఆయనసాదరాహ్వానమున కియ్యకొని మువ్వు

రును కుటీరమునకు వెళ్లి తలదాచుకొనిరి. ఆ పేదరైతు తనశక్తికొలది వారికి సపర్య లొనర్చుచుండెను. ప్రయాణమువలన, బాధలవలన అలసియున్న మన దేశభక్తులు సేదదీర్చుకొనుచుండిరి. ఈ యుదారహృదయుడు రక్షణ నొసగనిచో మనయోధులు శత్రువులచేతిలో చిక్కవలసియేయుండెడిది. ఆస్ట్రియన్ సైనికులు ఈ దేశభక్తుల కొఱకు వెదకుచునేయుండిరి. ఎన్ని గ్రామము లన్వేషించినను వీరియునికి గుర్తించ లేకపోయిరి. ఇదివఱకే రోగగ్రస్తయైన ఎనిటామాత కీసమయమున ఆరోగ్యము మిక్కిలి చెడిపోయెను. వ్యాధి యెక్కువయై యా సాధ్వీమణి మంచముపట్టెను. ఈ గ్రామవాసు లెల్లరీయమ విషయమై కడు జాగరూకత గైకొనిరి. వైద్యుల పెక్కుర తీసికొనివచ్చి చికిత్స చేయించిరి. కాని వ్యాధి నిమ్మళింపలేదు. ఆనాటికానాడు వృద్ధి యగుచునేయుండెను. ఈసమయమున ఏరాధివీరుడగు గారిబాల్డి హృదయమునకు శాంతి లేదు. ఒకనిముసమైన తన ప్రియకాంత నెడబాయుట లేదు. ఎపుడును నాడిని పరీక్షించుచునే యుండెను. కాని విధివశము తప్పింప నేరితరము? ఉచ్ఛ్వాసనిశ్వాసములు మెండయ్యెను. నాడీగమనము తగ్గుచుండెను. ఈస్థితిగాంచి గారిబాల్డి హృదయము

కంపింపసాగెను. తనప్రియురాలిహస్తమును ఎడదయందు హత్తుకొనుచుండెను. ఎనిటాసాధ్వీమణికూడ తనప్రియు నెడబాటు సహింపనోల్లక కన్నీరు గార్చుచుండెను. ప్రియుని నొకనిముసమైన బాయ సహింపకుండెను. గారిబాల్డీ దీనవదనుడై తనప్రియపత్నికపోలములు, ఓష్ఠములు చుంబించుచు కంటికి కడవగా బాష్పములు రాల్పజొచ్చెను. ఈ హృదయభేద్యమగు దృశ్యమును గాంచి యచట నున్నవా రందరు బాష్పవదను లైరి. అంతయు నిశ్శబ్దముగ నుండెను. వీర యెనిటా తన హృదయేశ్వరునియొడిలోనే యీలోకమును వీడి పురందరనగరమునకు పయన మయ్యెను. ఆకుటీర మంతయు ఆర్తనాదములతో మిన్నుముట్టెను.

పురుషసింహుడగు గారిబాల్డీ తన ప్రియకాంత యెడబాటు సహింపనోల్లక కోమలలలనామణి వలె దుఃఖింపసాగెను. ఎందరు మిత్రులు బ్రతిమాలినను శోకము నాపుకొనలేకపోయెను. లామర్కాండ్రియోలా గ్రామవాసు లెల్లరు మూగి మనవీరుని నోదార్పసాగిరి. గారిబాల్డీ చిననాటిమిత్రుడు కర్నల్ బోనెట్ ఈవార్తవినియోదార్ప వచ్చెను. పలురీతుల శాంతింపజేసెను. సిబోటివీడుని కిది తగదని బోధించెను. ఈయన యాప్తవాక్యములచేత

కొంతవఱకు శాంతిపొందెను. మనవీరమాతకు నంత్యక్రియలు జరిపిరి. ఈమె బాల్యమాది బీదజనుల నాదరించెడిది. పసిపాప యేడ్చుచున్నను చెంతకు దీసి బుజ్జగించెడిది. ఆకలిచే బాధ నొందువారికి నన్న మిడెడిది. వస్త్రహీనులకు వస్త్రదానము గావించెడిది. మనవీరగారిబాల్డీని వివాహమాడి యామరణము దేశసేవచేసి పలు యుద్ధములలో పాల్గొని కీర్తిగాంచినది. తుదకు తన జన్మభూమి యగు, ఇటలీకొఱకే పోరుచు జీవితేశ్వరుని యొడిలోనె ప్రాణములు విడచి, రేవేనా సాంద్రారణ్యముల సమాధి నొంది, ప్రపంచమునంగల యంగనామణులకు మార్గదర్శినియై ధన్యతగాంచినది. ఈవీరాంగన చరితమే పాశ్చాత్యనారీమణులు పఠించి తదుపరిజరిగిన స్వాతంత్ర్య సంగ్రామములలో పాల్గొని చిరతరకీర్తిని గాంచిరి. ఈ విపత్సమయమున గారిబాల్డీకి పలుదేశములనుండి బంధుగులును, మిత్రులును సానుభూతిలేఖల నంపిరి. యోధపుంగవుడగు గారిబాల్డీ విచారమును బాసి తనమామూలు కార్యమున నిమగ్నుడాయెను. ఇటలీ కవికుమారులు పెక్కురుత్తేజకరములగు పద్యముల వ్రాసి పంపిరి. నిరుత్సాహము ప్రబలియున్న యీ దినములలో వీరి పద్య

మాలలు దేశమున నూతనోత్సాహము గలుగజేసెను. గారిబాల్డిని సంబోధించి యీవిధముగ వ్రాసిరి :

"ప్రియగారిబాల్డీ!

ప్రియపత్నిని గోల్పోయి దుఃఖాంబుధిని మునిగి యున్న యీతరుణమున నిన్నోదార్చుటమహాధర్మము. వీర వనితామాత ధర్మసంగ్రామమున నీకు సహకారిణియై ఇటలీ నారీమణులలో మేల్బంతి యైనది. ఆ స్వాతంత్ర్య దేవిని దేశము మఱువజాలదు. నీవు పురుషసింహుడవు. ఇటలీదేశీయుల భాగ్యదేవుడవు. ప్రియపత్ని వియోగమును మరువుము. నీకర్మక్షేత్రమున కుఱుకుము. పరాత్పరుడు నీయండ నుండగలడు. సందేహమున్న వీడుము. నీప్రతాపముననే మనదేశ భావిభాగ్యోదయము కాగలదు. భావిసంతతి నిన్ను పూజించును. దేశమాతకు స్వాతంత్ర్యభిక్ష నొసగుము."

గారిబాల్డి జీవితము

ఏడవ అధ్యాయము

ఇపుడు గారిబాల్డితో కలసి యొకయోధుడు మాత్ర ముండెను. మిగిలినవా రెల్లరు కష్టములు సహింప లేక యెవరిదారిని వారు పోయిరి. ఏరుభయు లేమిచేయ గలరు! మారువేసములు ధరించిరి. వేని నెప్పటికప్పుడు మార్చుచునేయుండిరి. బిచ్చ మెత్తి జీవింప నారంభించిరి. అన్నము లేకుండ గడిపినదినములు గలవు. రాత్రులందు ప్రయాణము సల్పుచుండిరి. కొన్ని రాత్రులందు విషసర్ప ములతోను, వన్యమృగములతోను పోరాడుచుండిరి. స్వాతంత్ర్యప్రియులగు గ్రామవాసులు గారిబాల్డిని గుర్తించి ఆదరించుచుండెడివారు. ఆదరించినవారిజాడలు తెలిసి ఆస్ట్రియను చక్రవర్తులు వారిని హింసింపసాగిరి. ఈనేరమునకు కొందఱిని యమసదనమునకుగూడ పంపిరి. కొన్ని దినములు మానవుడైనను చొరని కీకారణ్య ములలో తలదాచుకొనిరి. మరికొన్ని దినములు పర్వత

గుహలలో వసించిరి. ఈ దినములలో దొరికిన ఫలములు లేనిచో కందమూలములు భుజించి జీవముల నిల్పుకొనిరి. కొన్ని దినములు ఇటలీభూమాతయు, సర్వేశ్వరుడే వారిరక్షకులు. ఒకవైపున స్వార్థపరులగు మతగురువులు ధర్మముపేర నోసగు దీర్ఘోపన్యాసములచే నమాయకులగు ప్రజలను మోసపుచ్చుచుండిరి. వారే దేవదూత లనియు, వారియధికారమే న్యాయసమ్మతమైన దనియు ప్రచారము చేయుచుండిరి. మరియొకదెస నరపిశాచములగు నాస్ట్రియనులు దేశభక్తులరుధిరమును పీల్చుచుండిరి. దేశభక్తులజాడలు గనిపెట్ట గూఢచారులను నియమించి వేలకొలది ధన మొసగుచుండిరి. ఇట్టితరుణమున గారిబాల్డి యెన్నిదినములు తల దాచుకొనగలడు ? ఎట్టకేలకు విశ్వప్రయత్నమువిూద నాలుగునెలలకు మనయోధుడు చియావేరీ (Chiavari) యను గ్రామమున శత్రుహస్తముల చిక్కెను. కాలు సేతులు, ఇనుపసంకెలలతో బంధించి జనోవానగరమునకు దీసికొనివచ్చి రాజప్రాసాదమున బంధించిరి. ఈ వార్త దేశమంతయు కార్చిచ్చువలె వ్యాపించెను. వేలకొలది ప్రజలు, ఈసౌధముచుట్టును మూగి మానాయ

కుని వదలెదరా! లేదా! యని యాకసము బ్రద్దలగు నటుల అల్లరి చేయనారంభించిరి.

పీడ్ మొంటుయొక్క పార్లమెంటులో గారిబాల్డీని శిక్షించుటకు నాలోచన జేసిరి. యుద్ధమంత్రి యగు "పేనిలీ" గారిబాల్డీ దేశమున నశాంతి ప్రబలచేయు చుండె ననియు, దేశద్రోహి యనియు, శిక్షార్హు డనియు వాదించెను. ఈసమయమున సభలో సిగ్గు, సిగ్గు, అను కేకలు బయలుదేరెను. కొందఱు, మంత్రిమండలి ఆస్ట్రి యన్ రాజులచేతిలో కీలుబొమ్మ లనియు, దేశక్షేమ మునే మఱచి రనియు, గారిబాల్డికోరు స్వాతంత్ర్యము న్యాయమైన దనియు, ఇది యాయనయభిప్రాయమే కా దనియు, దేశమున చాలమంది యభిప్రాయ మనియు, ఆయన తమనాయకు డనియు, శిక్షింపబడుటకు నర్హుడు గా డనియు వాదించిరి. అందుచే చేయునది లేక, యీాయ నను బంధవిముక్తిని గావించుచు, దేశమును వీడిపో వలయు నని యాజ్ఞాపించిరి.

గారిబాల్డీని చెఱసాలనుండి విడిపించిరి. వేల కొలది ప్రజలు స్వాగత మొసంగిరి. కొన్నినిముసములు ఆయనమీాద సుమవృష్టికురిసెను. జయధ్వనులు మిన్ను

ముట్టెను. వారిచెంత సెలవుగైకొని నాయస్నగరమం దున్న తన వృద్ధజననిని, పుత్రద్వయమును సందర్శింప కుతూహలుడై వెళ్లెను. ఎన్నిరోజులక్రిందటనో జూచిన తల్లియు, పసితనమున జూచిన బాలురును గుర్తింపలేక పోయిరి. ఆయన చెప్పిన తరువాత వృద్ధజనని కోడలి యకాలమరణమునకై ప్రియపుత్రుని కౌగిలించుకొని దుఃఖించెను. మాయమ్మ యేది యని బాలురు ప్రశ్నించిరి. వారిప్రశ్నకు జవాబీయలేక వారి నెత్తికొని యశ్రుబిందువుల రాల్చజొచ్చెను. ఏవియో మాటలు చెప్పి వారిని మఱపించెను. ముసలితనముచే మంచము పట్టిన పినతండ్రి యన్యులసాయమున లేచి గారిబాల్డిని ముద్దుపెట్టుకొనెను. బంధువులు మిత్రులు సమావేశమై ఏవిధమున జీవితము గడపినది తెలిసికొనుచుండిరి. ఈ యోధుని చరిత్ర వినుచున్నపుడు గుండెలు దడదడ కొట్టుకొనుచుండెను. కొన్ని గంటలుమాత్ర ముండి జనని దగ్గఱ, పినతండ్రిదగ్గఱ సెలవువేడెను. కొన్నిదినములైన నుండుమని బ్రతిమాలిరి. తనధర్మమును వారికి నచ్చజెప్పి విశ్రాంతి కవకాశము లే దనెను. మనదేశము స్వాతంత్ర్యము పొందినపిదపనే విశ్రాంతి యనెను. అందఱును కన్నీరు గార్చిరి. బాలురు చంకనుండి దిగరు. బుజ్జగించి

వారిని తనతల్లికి అప్పజెప్పెను. అందఱి దగ్గఱ సెలవు
గైకొని సముద్రతీరమునకు వెళ్లి యోడ నెక్కెను.
నావ యెక్కిన తరువాత తల్లికి క్రిందిలేఖ వ్రాసెను.

“ప్రియజననీ!

నేను ట్రిపోలీ యను నావమీద ప్రయాణము
చేయుచున్నాను. రేపుదయము ట్యూనిస్ నగరమునకు
జేరెదను. వృద్ధాప్యమున నిన్ను వదలిపోవుటకు మన
మొప్పకున్నది. నీకు సేవ జేయుట నాధర్మ మని
యెఱుఁగుదును. కాని మాతృదేశ సేవాప్రేరితుడనై
అందు లీనమైతిని. క్షమింపవేడెదను. మాతృవిహీనులగు
బాలుర నేవిధమున పోషించెదవో! వారికి నీవే దిక్కు.
నాకొఱకు వేదనపడవలదు. నీవు మంచముపట్టిన పసి
పాపల హృదయముల పిడుగు పడును. వారిని జూచి
యైనను శాంతి నొందుము. నే నొసంగినధనముతో
కాలక్షేపము చేయుడు. అవసరమగునపుడు తెలిపిన
ధనమును పంపుచుందును. మీక్షేమము తఱచు తెలుపఁ
ప్రార్థించుచున్నాను.

ఇట్లు, ప్రియపుత్రుడు,

గారిబాల్డి.”

1849 సం. సెప్టెంబరు 16 వ తేదీన ట్యూనిస్ నగరమునకు జేరెను. ఫ్రాన్సుదేశాధికారుల యాజ్ఞ చొప్పున నీనగరవాసులును రక్షణ నొసంగ సమ్మతింప రైరి. ఆనగరాధికారులు వెంటనే కొలంబోనామక యుద్ధనావయందు గారిబాల్డీ నెక్కించి జిబ్రాల్టర్ పత్త నమునకు పంపిరి. ఇచ్చటగూడ ఆంగ్లేయాధికారులు ఉండుటకు వీలు లేదని యాజ్ఞాపత్ర మొసంగిరి. ఉదార హృదయు లని పేరువడసిన యాంగ్లేయుల నిరాదరణను జూచి యాశ్చర్యచకితు డాయెను. ఎన్నివిధముల ప్రయ త్నించినను తల దాచుకొనుట కవకాశము చిక్కలేదు. అతికష్టముమీద కొన్నిమాసములు రహస్యముగ ఇచ్చ టనే కాలక్షేపము జేసెను. ఈదినములలో నాంగ్ల మిత్రులు మనయోధునికి కావలసిన సదుపాయము లన్నియు జేసి కృతకృత్యు లైరి.

జిబ్రాల్టర్ నగరమునుండి 1850 వ సంవత్సర మున గారిబాల్డీ అమెరికాదేశమునంగల న్యూయార్కు నగరమునకు జేరెను. రాచకీయకార్యము లన్నియు గట్టిపెట్టి క్రొవ్వువత్తుల కర్మాగారమున కూలివాడుగా ప్రవేశించెను. తాను సంపాదించిన కూలిడబ్బులతోనే జీవనోపాధి జేయుచు కాలము గడపుచుండెను. ప్రాణము

నిలుపుకొనుటకు మాత్రము సామాన్య బీదభోజనము చేయుచు కొంతధనమును మిగిల్చి వృద్ధజననికిని, పసి పాపలకును పంపుచుండెను. జీర్ణవసనములే ధరించుచుండెను. పిచ్చివానివలె కాలము గడపుచుండెను. తనకు సంభవించిన విపత్పరంపరలు తలచుకొని తహతహలాడుచుండెను. అపుడపుడు దిక్కులేనివారివలె కాలము గడపుచున్న మాతయు, బిడ్డలు తలపునకు వచ్చి అశ్రుబిందువులు రాల్చుచుండెను. వివాహమాది తన కన్నిరంగములయందును సహకారిణి యగుచు నకస్మాత్తుగ తన్నేకాకిని జేసి పరలోకమున కరిగిన ప్రియకాంతను దలచుకొని తల్లడిల్లుచుండెను. ఇటలీదేశ స్వాతంత్ర్యోద్యమ నాయకుడై, మతగురువుల ఆస్ట్రియనురాజుల సంగరరంగమున గడగడలాడించినవీరుని కీగతిపట్టినదిగదాయనిఅమెరికావాసులు ఖిన్నులైరి. ఇట్టిబాధలు పడుచున్న యీ దినములలోకూడ తన దేశభావిభాగ్యమును తలచుకొని సంతసించిన దినములు గలవు. ఈభావికళ్యాణాలోచనా పరంపరలే వీరుని ప్రాణములు నిల్పినవి.

గారిబాల్డి 1851-వ సం. న్యూయార్కునగరమును వీడి "నికారాగువా" యను పట్టణమునకు పోయెను. ఈపురమున ఇటలీ దేశవాసులు పెక్కురు

గులరు. వీరందఱును తమ దేశనాయకుని గౌరవించు చుండిరి. తన సోదర దేశీయులమధ్య మాతృదేశమునందు వలెనే ఆనందముగ కాలము గడపుచుండెను. ఇంతలో మన యోధుడు జ్వరపీడితు డాయెను. చాల ప్రమాదము సంభవించి ప్రాణము పోవునను భయముకూడ కలిగెను. భిషగ్వరులు, ఈ దేశభక్తుని అతిజాగరూకతతో చికిత్స జేసిరి. ఇటలీదేశీయులు తమ నాయకుని కేలోపము కలుగకుండ సేవ జేసిరి. కొన్ని దినములకు నారోగ్య వంతుడాయెను. కాని యింకను నీరసస్థితియందే యుం డెను. ఆరోగ్యముకొఱకై లైమా నగరప్రాంతములకు బయలుదేరెను. సముద్రయానమున సంపూర్ణారోగ్య మును బడసి కలకలలాడుచుండెను. లైమా నగరము నందు కొన్నిమాసములు విశ్రాంతి గైకొని కార్మెన్ అను వర్తకనావలో నుద్యోగమును సంపాదించి చైనా, తూర్పుద్వీపములు, ఆస్ట్రేలియా మొదలగు దేశములు చూచుకొని చివరకు బోస్టన్ నగరమునకు జేరెను.

బోస్టన్ నగరమున ఒకసంవత్సరము కాలముగడపి గారిబాల్డియోధుడు కామన్ వెల్తు అనం బరగునావ కధి కారియై 1854 సం. ఫిబ్రవరిమాసమున లండన్ నగర మునకు వచ్చెను. వ్యాపారసంబంధమున నీమాసమంత

యును ఇక్కడనే గడపెను. మార్చిమాసమున టైయిన్ నదిమీద బయలుదేరెను. ఈ దినములలో మన కథానాయకుడు ఇటలీ స్వాతంత్ర్యోద్యమమునకు నాయకుడై ఏవిధమున పోరాడినదియు, ఎట్టికష్టము లనుభవించినదియు తెలియజేయుచు న్యూకాజిల్ (New castle) అను పత్రికలో ప్రకటించిరి. ఆవ్యాసరాజము యీటాయిన్ నదీతీరవాసులు పఠించి స్వాతంత్ర్యోద్యమ కథామృతమును గ్రోలియుండిరి. అందుచే వేలకొలదిజనులు ఈనదీతీరముల సమావేశమై యీ యోధుని సత్కరించిరి. ఈసత్కార్యాలు గాంచి నమ్రతతో వారికి నమస్కరించెను. కూలివార్లెల్లరు కలసి యొకఖడ్గమును బహూకరించిరి. దానిమీద "పాశ్చాత్య దేశ స్వాతంత్ర్య యోధుడగు గారిబాల్డీకి టైయిన్‌నదీతీరవాసు లర్పించిన బహూకరణ" మని లిఖించిరి. ఏప్రియల్ 10 వ తేదీన షీల్డ్సు అను పట్టణమున సీకత్తిని బహూకరించిరి. ఈసభ కధ్యక్షుడు జోసఫ్ కవెన్. ఈయన బానిస దేశములు అధికారమదాంధులచే నెట్లు హింసింపబడుచున్నదియు, హృదయవిదారితముగ వర్ణించి సమావేశమైన వేలకొలదిజనుల ముగ్ధులజేసెను. గారిబాల్డి వారికిగూడ ఎణమున కీవిధమున ప్రత్యుత్తర మొసంగెను.

"ఆంగ్లేయమిత్రులారా !

మీమాతృభాష నాకు బాగుగరాదు. అన్య భాషలో మాట్లాడిన మీ రందఱు వినజాలరు. వచ్చీరాని ఆంగ్లేయభాషలోనే నాశక్తికొలది మాట్లాడెదను. తప్పు లున్న క్షమింపుడు. నేను సామాన్యమానవుడను. నాదేశము పరదేశీయుల హస్తగతమై పలుభంగుల పీడింపబడుచున్నది. మేము మాపూర్వులపరాక్రమమును వైభవమును మఱచితిమి. ఆస్ట్రియనులే మాకు మార్గదర్శులైరి. మా జాతీయభాషను మఱచితిమి. దాస్యశృంఖలముల చిక్కి పడరాని యిడుమల పడుచుంటిమి. ప్రజల కన్నవస్త్రములు లేవు. పదదళిత మాతృదేశమును జూచి హృదయము చెక్కలగుచున్నది. ఈ విపదంబుధినుండి తప్పించుటకు మేము పడరానిపాట్లు పడుచుంటిమి. నాదేశీయులలో నాకన్న పెద్దలు పూజ్యులు గలరు. వారి యాజ్ఞను శిరసావహించి మాతృదేశ పాదపద్మములకడ నుడుతాభక్తిని సేవ చేయుచుంటిని. ఇది ప్రతిమానవుని మొదటిధర్మము. మా స్వాతంత్ర్యోద్యమమునెడ మీకుగల యనురాగమునకు వందన సహస్రములు. మీదీవనల నెన్నడును మఱువను. ఇటలీ జాతి స్వాతంత్ర్యము నొందకతప్పదు. మా స్వాతంత్ర్య సమర

సంరంభము భావిచరిత్రకారులు లిఖింపవలసి యున్నది. ఆచరితమే భావి ఐరోపాసంతతికి మార్గదర్శక మగునను నమ్మకముగూడ నాకు గలదు. స్వదేశప్రభుత్వము బహిష్కరించిన మముబోంట్లకు తా మొసగు సత్కారాదరణములు ఎన్నటికిని మఱువజాలము. నా ధర్మమును ప్రేరేపించుచు నా కొసగినకరవాలము ఒరనుండి తీయు శుభసమయ మెపుడు వచ్చునా యని నిరీక్షించుచున్నాను. మీరు నాకొసంగిన ధర్మోపదేశముల స్మరణకు వెచ్చుకొని కదనరంగమున నాట్యము సలుప నువ్విళ్లూరుచున్నాను. మీరు ప్రేమపూర్వకముగ నొసగిన యీఖడ్గముచేతనే స్వాతంత్ర్య రణరంగమున నుఱికి స్వాతంత్ర్యలక్ష్మిని చేపట్టగల నని తమ్ము మోల మరొకమారు సవినయముగ మనవిచేయుచు సెలవు గైకొనుచున్నాను.”

వేలకొలదిజనులు సమావేశమైన యీసభనుండి సెలవు గైకొని మన యోధుడు ప్రయాణ మాయెను. ఆసమయమున నీపూజ్యునికి జరిగిన సత్కారములు వర్ణనాతీతములు. ఆయన వెడలునపుడు ‘ఇటలీస్వాతంత్ర్య సమరమునకు జయము కలుగుగాక! వీరగారిబాల్డీ చిరంజీవి యగుగాక’ యను జయధ్వనులు మిన్నుముట్టెను.

టాయిక్‌నదీతీర మంతయు ప్రయాణము సలిపి కొన్ని మాసములకు మరల లండన్‌పట్టణమునకు పోయెను. ఆసమయమున జోసెఫ్ కవెన్‌కు ఆయనమిత్రులకు వారు తన కొసగిన సదుపాయ సత్కారముల నుగ్గడించుచు ఒకకమ్మ వ్రాసెను.

లండనుపట్టణమున కొన్నిదినము లుండి తన నావలో బొగ్గు నెక్కించుకొని జనోవానగరమునకు వ్యాపారనిమిత్త మరిగెను. అచట కొన్నాళ్లు గడపి ఉద్యోగమునకు తిలాంజలి నొసంగెను. అచటనుండి 1855 సం. ప్రారంభముననే, నాయిస్ నగరమునకు వచ్చెను. తాను వచ్చునప్పటికి 1852 సం. మున నే త న్నత్యంత ప్రేమపూర్వకముగ పెంచి పెద్దవానిని జేసిన వృద్ధజనని స్వర్గస్థురా లాయె నని విని విషాదగ్రస్తు డాయెను. మూడుసంవత్సరములనుండి దిక్కులేక అలమటించుచున్న బాలు రిరువురు జనకుని జూడగనే పెన్నిధి దొరకిన పేదలవలె పరుగెత్తుకొని వచ్చి చంక నెక్కిరి. సరియైన పోషణలేక కృశించియున్న ముద్దుబిడ్డల కౌగిలించుకొని బాష్పముల జలజల రాల్చజొచ్చెను. అచట జేరినవా రెల్లరును ఈకరుణామయదృశ్యమును గాంచి కన్నీరు గార్చిరి. దేశభక్తుల కిట్టికష్టములు తప్పవుగదా!

ఏడవ అధ్యాయము

గారిబాల్డీ కిదివఱకున్న యాస్తి నంతయు ప్రభుత్వము స్వాధీనమును చేసికొనెను. తల దాచుకొనుటకు గృహమైనను మిగుల్చలేదు. పరులపంచలబడి యుండ వలసివచ్చెను. ఈజీవిత మసహ్యాముగ దోచి కేప్రరా (Caprara) యను ద్వీపమున కొంతభూమిని సంపాదించెను. అచటనే ఒకకుటీరము నిర్మించుకొని బాలుర పోషించుకొనుచు కాలము గడపుచుండెను. వ్యవసాయము చేసికొనుచు జీవనాధారముకొఱ కితరులమీద నాధారపడక స్వతంత్రముగ ప్రొద్దు పుచ్చుచుండెను. బిడ్డలకు స్వయముగ స్నానపానములు చేయించెడివాడు. వీరికి లేశమాత్రమైన కష్టము కలుగజేయక మాతవలెనే పోషించెను. తానె స్వయముగ వంటచేసెడివాడు. స్వయముగనే వ్యవసాయముకూడ జేసెడివాడు. ఉదయము మొదలు సాయంకాలమువఱ కేదో యొకకృషి చేయుచునే యుండెను. బిడ్డలకు విద్యాభ్యాసముకూడ నారంభించెను. చెంతనుండి చక్కని యక్కరములు వ్రాయ నేర్పెను. ప్రతిచిన్నపనియందును శ్రద్ధ వహించుచుండెడివాడు. ప్రజ లందఱు ఈవీరుడు శాశ్వతముగ శాంతజీవనమును గడపు నని యూహించిరి. అపుడపుడు

బిడ్డలతో గలసి సముద్రయాన మొనరింపుచు వారికి కావలసిన ప్రపంచజ్ఞానము కలుగజేయుచుండెను.

ఈప్రాంతములలో సార్డినియా సర్కారువారు రాజద్రోహులను పట్టి బంధించి పలురీతుల బాధింప సాగిరి. కాని మనవీరునిజోలికి రాలేదు. 1855 సం. అంతమున సెటింబ్రిని (Settembrin) కి స్వాతంత్ర్య మొసగు సందర్భమునను బార్బర్ హింసించుచున్న రాజద్రోహులవిముక్తిసందర్భమునను సర్ జేమ్సుహడ్సన్‌తోమాట్లాడెను.కాని నిష్ఫలుడాయెను.1856 సం. మునఒక నావను కొనునెపమున ఇంగ్లండునకు వెళ్లెను. అపుడు పోర్ట్సమాత్ నం దుండెను. ఈయనను జూచుటకు ప్రతిదినము వందలకొలది వచ్చెడివారు. కూలివాడు మొదలు కోటీశ్వరునివఱకును సమానభక్తితో గౌరవించెడివారు. ఈయనకు కావలసిన కార్యములలో రాజకీయధురంధరులగు గ్లేడ్‌స్టను, హాలెండు, దంపతులుకూడ సాయపడిరి. పైని పేర్కొన్న రాజకీయ శిక్షితులు 1859 సం. మున మనయోధుని విశ్వప్రయత్నముమీఁద విముక్తిని పొందిరి. 1855 సం. మొదలు 59 సం. వరకు ఎక్కువ కాలము కేప్రరాద్వీపముననే శాంతజీవనమును గడపెను.

గారిబాల్డి జీవితము

ఎనిమిదవ అధ్యాయము

ఇటలీ స్వాతంత్ర్యసమరమున కేవర్ అను మేధావి గూడ గలడు. ఈయన మనమేజినీ, గారిబాల్డీల ప్రియమిత్రుఁడు. స్వాతంత్ర్య సమరాంతమువఱకు పాల్గొనిన యఖండదేశభక్తుఁడు. ఈ దేశభక్తత్రయమే ఇటలీ బానిసత్వమును పారద్రోలి స్వాతంత్ర్యమును సంపాదించె. వీరికలయికే దేశమునకు మేల్చేసినది. వీరు ముగ్గురను నేటికిగూడ ఇటలీ దేశీయులు పూజించుచున్నారు. వీరేగాదు ప్రపంచమునంగల స్వాతంత్ర్య ప్రియు లెల్లరు వీరి నారాధించుచున్నారు. ఈదేశభక్త త్రిమూర్తులనుగూర్చి ప్రపంచచారిత్రమును వ్రాసిన లేఖకు డీక్రిందివిధమున వ్రాసెను.

"మేజనీ ధర్మావతారమూర్తి. గారిబాల్డీలకంటె కేవరే విజ్ఞాని యనియు, మేధావి యనియు విజ్ఞానశాలి యనియు వ్రాసెను. కాని యందఱును దీనిని విశ్వసింపరు.

ఈయన జీవనచరితము వ్రాసిన యొకలేఖకు డీ విధమున వ్రాసెను. దీనినే పెక్కు రంగీకరించెదరు.

“కేవర్ రాజనీతిచతురుడు, దూరదర్శి. వెనుక ముందు లాలోచించి కార్యరంగమున ప్రవేశించును. తన యభిప్రాయములే మంచివని వాదించి యితరులను లోబఱుచుకొనుటకు ప్రయత్నించును. ఇతరులమీద నధికారము చలాయించును. అవసరమైన నెట్టివారితో నైన సంభాషించి కార్యమును చక్కబెట్టుకొనును. ఈయన దూరాలోచనలు, కార్యదక్షత, స్వాతంత్ర్య సమరమునకు సాయము చేసినవి. ఇటలీ స్వాతంత్ర్య మును నడపినదక్షులలో నొక రని యొప్పుకొనక తప్పదు. ఈ దినములలో ట్యూరిన్‌నగర రాచకార్యము లీ మేధా వియే నడపుచుండెను.”

మఱికొందఱు పాశ్చాత్య చరిత్రకారులు మేజినీ, గారిబాల్డీలు సచ్చరిత్రు లనియు, స్వార్థత్యాగు లనియు, నిష్కలంక దేశభక్తు లనియు, కేవర్ వీరివలె స్వార్థ త్యాగి కా డనియు, సచ్చరిత్రుడు గా డనియు, స్వార్థ పరు డనియు వక్కాణించెదరు.

ఈతరుణమున ప్రష్యియా, ఇంగ్లండుదేశీయులు, ఇటలీస్వాతంత్ర్యసమరము ఐరోపాసంగ్రామముగ మారు

నేమో యని భీతిలుచుండిరి. యుద్ధము వీరి కేమాత్ర మిష్టము లేదు. ఎప్పుడు ఏవిపత్తు సంభవించునో యని 1859 సంవత్సరమున మరల గారిబాల్డీ యోధులను సమకూర్చెను. సమరసన్నాహము లన్నియు జాగ్రత్తతో జేయ నారంభించెను. కాని యీదినములలో ఫ్రాన్సు చక్రవర్తియగు లూయీనెపోలియన్ ఇటలీరాజకీయ వ్యవహారములలో జోక్యమును గలుగజేసికొన నని ప్రకటించెను. అందువలన మన యోధు డజాగ్రత్తగ నుండెను. ఇంతలో నకస్మాత్తుగ ఫ్రాన్సునరేశుడు యుద్ధమును ప్రకటించెను. ఆస్ట్రియన్ రాజులు వీరితో సిద్ధమైరి. ఆస్ట్రియన్ రాజులదగ్గఱ 2 లక్షలుసైన్య ముండెను. మనగారిబాల్డీదగ్గఱ 5000 మాత్ర ముండెను. బలము తక్కువగ నున్నను పోరాడ నిశ్చయించుకొనెను. ఆస్ట్రియనులు 75000 సైనికుల దీసికొని పీడ్మెంటును ముట్టడించుటకు నిశ్చయించుకొనిరి. 1859 సం॥ ఏప్రియల్ 29 వ తేదీన టిసినోనదిని దాటి పీడ్మంటుకు పయనమైరి. గారిబాల్డీ తనదగ్గఱనున్న కొలదిసైనికులతోనే వీరిని డీకొనుటకు నిశ్చయించుకొని కదనరంగమున కురికెను. ఆస్ట్రియనులతో పోరాడుట కష్టమేమో యని కొందఱు దేశభక్తులు తలచిరి. ఇట్టి నిరుత్సా

హాఫుమాట లసరా దనియు, మనలోనున్న స్వాతంత్ర్య కాంక్ష వారి 75000 సైనికులను హతమార్పగల దనియు, గారిబాల్డి ధైర్యము చెప్పెను. ఈమాటలు వారిలో నుత్సాహమును పురికొల్పినవి. మాప్రాణములు పోయినను వారితో డీకొనుటకు సిద్ధముగ నున్నా మని శపథము చేసిరి. 'ఇటలీ స్వాతంత్ర్యోద్యమమునకు జయము గలుగుగాక' యని కేక లిడుచు, ఈయోధులు పీడ్మొంటుకదనభూమికి కొదమసింగములవలె నుఱికిరి. ఉభయసేనలు తీవ్రముగ పోరాడ నారంభించెను. ఉభయపక్షములువారు హతు లగుచుండిరి. రక్తప్రవాహములు పీడ్మొంటునగరరాజవీధుల ప్రవహింపజొచ్చెను. స్వాతంత్ర్యయోధులు శత్రుదళముల చీల్చి చెండాడిరి. సంఖ్యయందు బాహుళ్యముగ నున్న ఆస్ట్రియన్ సేనలు వీరిధాటి కాగలేక పిఱికిపందలవలె పలాయనమంత్రమును పఠించిరి. గారిబాల్డి జయపతాక నెత్తెను. విజయోత్సవమును జేసి తృప్తి నొందిరి.

మఱల కొన్నిదినములకు ఆస్ట్రియనులు, ఫ్రాన్సువారు కలసి మెజంటా (Megenta) నగరమును ముట్టడించిరి. ఉభయసేనలు గలసి లక్షవఱ కుండెను. గారిబాల్డిదగ్గఱ 6000 సైనికులుమాత్ర ముండిరి. ఈ యుద్ధ

ములోగూడ ఇటలీవారినే విజయరమ వరించెను. స్వాతంత్ర్యయోధులకును, ఫ్రాన్సువారికిని సొల్ఫిరినో (Solferino) దగ్గఱ యుద్ధము జరిగెను ఈ యుద్ధములో ఫ్రాన్సువారే విజయమును బడసిరి. చివర రెండు యుద్ధములలో విక్టర్ ఎమానుయల్ అను యోధుడు తన యుద్ధకౌశలమును ప్రదర్శించి కీర్తినార్జించెను. ఇంతలో ఫ్రాన్సుచక్రవర్తి ఇటలీకి స్వాతంత్ర్య మొసగెద నని ప్రకటన చేసెను. ఈప్రకటనకు మొదట ఆస్ట్రియను లంగీకరింపరైరి. ఫ్రాన్సుచక్రవర్తియును లూయినెపోలి యను బలవంతముచేత చివఱ కంగీకరించిరి. సంధి చేసికొనుటకు సిద్ధముగ నున్నా మని స్వాతంత్ర్య యోధులకు లేఖ వ్రాసిరి. తమ సైనికులను రణరంగము నుండి వెనుకకు పిలిచిరి. వారివారి రాజధానులకు యుద్ధము విరమించితిమని వర్తమానముల నంపిరి. మే. 29 వ తేదీని విల్లా ఫ్రేన్కా (Villa franca) యను పట్టణమున సంధి సమావేశము జరుగుననియు నద్దానికి గారిబాల్డీని, కేవరును, విక్టర్ ఎమానుయల్‌ను ఆహ్వానించిరి. గారిబాల్డీ సంధికి తల యూప డాయె. మిగిలినవా రిద్ద అంగీకరించి సంధిసమావేశమునకు వెళ్లిరి. ఇందు కేవర్ మోసమున్న దని కొందఱి యభిప్రాయము. గారిబాల్డీయు, ఆయన

యనుచరులును గత సంగ్రామములో నత్యద్భుత శక్తిని ప్రదర్శించి కీర్తి గాంచిరి. వారు సంపాదించిన కీర్తి యం తయు క్షణములో కేవరు నాశనము చేసెను. దీనికి గారి బాల్డీ మిక్కిలి వగచెను. జరుగబోవుసంధి తమకు నష్ట దాయక మనియు, జాతీయోద్యమము నణచుటకే యీపన్నుగడ పన్నిరనియు మననేత యభిప్రాయము. గారిబాల్డీ యనుకొనినటులే జరిగెను. సంధిసమావేశపు టొడంబడికలు కని ఖిన్నుడాయెను. తన సైన్యాధ్యక్ష పదవికి రాజీనామా యొసగి తన జన్మభూమి యగు నాయిస్ నగరమునకు వెళ్లెను. ఈ పూతచరితుడు వెళ్లగనే నగరవాసు లెల్లరు సమావేశమై సత్కరించి యాయన యభిప్రాయములే సమ్మతించి తమ నగరము తరపున ప్రతినిధిగ నెన్నుకొని, సంధి నియమము లేమాత్రము బాగుగ నుండలే దని చెప్పు టకు పార్లమెంటునకు పంపిరి. ఈయన వెళ్లి పార్లమెంటు సభాముఖమున తమనగరవాసు లీసంధి కిష్టపడలే దనియు; నూతనరాజ్యాంగమున తమనగరము చేర్చవల దనియు పోరాడెను. ఈయనవాదనలు, అరణ్యరోద నము లాయెను. నాయిస్‌నగరమునగూడ కూటనీతిపరు లగు ఫ్రాన్సురాజులపాలనక్రింద చేర్చుకొనిరి. గారిబాల్డీ

చేయునదిలేక దీనవదనుడై జన్మభూమికి తిరిగివచ్చెను. ఈ సందర్భమున కేవరు చేసినమోసమును ఆజన్మాంతమును మఱవలేదు. ఆయనను నీచుడుగనే చూచుచుండెను.

ఈసంధియనంతరము సిసిలీ, నేపుల్సు మొదలగు రాష్ట్రములలో నూతనోద్యమము బయలుదేరెను. సంధి షరతులవలన తమ కేమియు లాభము లే దనియు, జాతీయాశయములకు భిన్న మైనవనియు వారియూహ. పలెర్మోనగరదేశభక్తులు గారిబాల్డి నాహ్వానించిరి. గారిబాల్డినాయకత్వమున దేశమం దంతటను నూతనోద్యమము బయలుదేరెను. జాతీయోద్యమమునకు జనోవా ప్రధాననగర మాయెను. మనయోధునికీర్తిని జూచి కేవరు సహింప లేకపోయెను. ఈయన యీసమయమున మంత్రిగ నుండెను. చక్రవర్తికి, గారిబాల్డివంటి తీవ్రవాదులు దేశమునం దుండుట ప్రమాదకర మనియు, ఆయనను వెళ్లగొట్టు మనియు సలహా నిచ్చెను. కాని మంత్రులకంటె రాజు దేశాభిమాని యగుటచే వారి సలహా నంగీకరింపలేదు. గారిబాల్డిపలుకుబడి దినదినాభివృద్ధి గాంచుచుండెను. ఈయన దేశాభిమానమును, పట్టుదలను, ఐరోపావాసు లెల్లరు కొనియాడసాగిరి.

గారిబాల్డి జీవితము

తొమ్మిదవ యధ్యాయము

1860 సం॥ మేనెల 5-వ తేదీ ఇటలీదేశమునకు శుభదినమని చెప్పవచ్చును. నాఁడు వెన్నెలరేయి. ఆకసమంతయు నిర్మలముగ నుండెను. శేతేదుస్వీయనిర్మల కాంతిపుంజముల ప్రపంచమున వెదచల్లుచుండెను. ఆ పండువెన్నెలలో ప్రియులు సరససల్లాపములు గావించుకొనుచు పచారులు చేయుచుండిరి. కొందఱు వనవిహారము గావించుచు నాదబ్రహ్మ నుపాసించుచుండిరి. మరికొందఱు నృత్యములు సల్పుచుండిరి. ఇంకకొందఱు తమ యభిరుచుల ననుసరించి ఖేలనము లాడుచుండిరి. కొందఱు సరసపరిహాసవచనరచనలచే కాలము గడపుచుండిరి. కాని, ఇటలీదేశభక్తులు తమకర్మక్షేత్రమునకు వలయు సర్వసన్నాహములు గావించుకొనుచుండిరి. తమచెంత నున్ననావలలో శస్త్రాస్త్రములు, భోజనపదార్థములు నింపుకొనుచుండిరి. యుద్ధమునకు వలయు సర్వసన్నాహములు గావించుకొనిరి. జనోవాపట్టణసముద్రతీరమున

నున్న బోంబార్టో, సాయిమొంటి యను గొప్పపొగ యోడలను స్వాధీనము గావించుకొనిరి. ఆ యోడల యధికారులు ఈ దేశభక్తుల త్యాగమును గాంచి అచ్చెరు వంది సమరమున జేరిరి. ఈ ఓడలను నియమితస్థాన ములకు దీసికొనిపోయి దేశభక్తులగు యోధుల నెక్కించి కొనిరి. వీరిసంఖ్య వెయ్యిమాత్ర ముండెను. ఈదృశ్య మును గారిబాల్డి స్వీయచరిత్రమున నీవిధమున వర్ణించెను.

“ఓ వెన్నెలరాత్రీ! నీవు మాపాలిటి దేవతవు. నీశుభ్రజ్యోత్స్నలు మా కుత్సాహమును, శక్తిని గలుగ జేసినవి. ఈశుభరాత్రియందు కడుజాగరూకతతో నావల నధిరోహణము గావించితిమి.

మాదగ్గఱనున్న సహస్రయోధుల వదనమండల ముల స్వాతంత్ర్య కాంక్ష, పట్టుదల, సాహసము, తాండవ మాడుచున్నవి. మాయోధుల పవిత్ర హృద యములు మాతృసేవకై దుముకుచున్నవి. ఎచట జూచి నను ఆనందమే. ఎచట గాంచినను స్వాతంత్ర్యభేరీ నినా దములే. మాది ధర్మయుద్ధము. మే మెవరిని అన్యాయ ముగ హింసింపబోవుటలేదు. మా జన్మస్వత్వములను, అన్యాయముగ, అక్రమముగ, స్వాధీనము చేసికొనిన

నరపిశాచములను జయించుటకే బయలుదేరితిమి. అందు వలననే, ఓపవిత్రరజనీ! నీవు మాకు తోడ్పడితివి."

ఈసమయమున గారిబాల్డి, విక్టర్, ఎమానుయల్‌కు ఈక్రిందిలేఖను వ్రాసెను.

"నేను మఱల మన స్వాతంత్ర్యోద్యమమును సాగింపబోవుచుంటిని. మన మింకను బానిసత్వ మందుండుట గాంచిన విచారము గల్గుచున్నది. మనము చేయునది ధర్మయుద్ధము. ఈ శుభసమయమున తమ పరాక్రమసాహసములను ప్రదర్శించి మాతృదేశ దాస్య శృంఖలముల ద్రెంప ప్రార్థించుచున్నాను."

గారిబాల్డి తన సైన్యముల దీసికొని సముద్ర యానము సాగించెను. మొదట సిసిలీరాష్ట్ర ప్రాంతములకు పోయిరి. ఈరాష్ట్రములో మొదట మార్సాలాను స్వాతంత్ర్యయోధులు ముట్టడించిరి. ఫ్రాన్సు చక్రవర్తి తన వేలకొలది సైనికులతో మనయోధులతో పోరాడె. ఇచ్చట పదిదినములు రెండు పక్షములవారే తీవ్రముగ పోరాడిరి. చివరకు గారిబాల్డికే జయము గలిగినది. స్వాతంత్ర్యయోధుల కుత్సాహ మినుమడించినది. జాతీయపతాకను ధ్వజారోహణము గావించిరి. స్వాతం

త్రోత్సవమును జరపుకొనిరి. వెంటవెంటనే శత్రువుల స్వాధీనములో నున్నపట్టణములను ముట్టడింప జొచ్చిరి. ఈసమయమున ఉదారహృదయులగు ఆంగ్లేయులుకూడ గారిబాల్డికి సహాయము చేసిరి. వారిలో నిరువురు అతి సాహసముగ పోరాడి తమ యుద్ధకౌశలమును ప్రదర్శించిరి. ఒకడు శత్రువులచేతిలోకూడ చిక్కెను. వీరిశౌర్యము మాసైనికులకు కూడ ఉత్సాహము కలుగజేసిన దని గారిబాల్డి చెప్పెను. మన కథానాయకుడు గ్రామముల లోను పట్టణములలోను సంచారము చేయుచు ప్రజల నీవిధమున ప్రబోధించెను.

"ఇటలీదేశీయులారా! ఇది పవిత్రసమయము. మనశక్తిని ప్రదర్శించిన స్వాతంత్ర్యమును పొందుట నిక్కువము. ఈ యదను విడువవలదు. మన లోపము లేకుండ మనము పోరిన విజయలక్ష్మిని చేపట్టెదము. లేదా రణరంగమున ప్రాణముల నర్పించి వీరస్వర్గమున కరిగెదము. సందేహించకుడు. కరవాలముల నైకొని కదనరంగమున దుముకుడు." ఈ దేశభక్తుడు ఎక్కడకు వెళ్లినను వేలకొలది ప్రజలు స్వాగత మొసంగుచుండిరి. ఈస్వాతంత్ర్యోద్యమమునం దభిమానముచూపజొచ్చిరి. వెయ్యిమందితో బయలుదేరినసేన ఇపుడు 12000 ఆయె

ను. ప్రతిపట్టణమున శత్రువులతో డీకొనుచుండిరి. శత్రు సేనలు వీరి ప్రతాపాగ్ని ముందఱ నిలువలేక పోయెను. ఏచటికి పోయినను స్వాతంత్ర్యయోధులకే జయము గలుగుచుండెను. ప్రతి పట్టణమునను, పల్లెయందును జాతీయపతాకము లెత్తిరి. విజయోత్సవములు సలిపిరి. సిసిలీరాష్ట్రమంతయు స్వాతంత్ర్య యోధుల హస్తగత మైనది. ప్రజలెల్లరు జేరి గారిబాల్డీని నియంత (డిక్టేటరు) గా నెన్నుకొనిరి.

తదుపరి సార్డినియాప్రాంతములలో సంగ్రామము జరిగెను. ఫ్రాన్సుచక్రవర్తులు స్వాతంత్ర్యయోధులను పలుభంగుల పీడింపజొచ్చిరి. కాని వెనుకంజ వేయ రైరి. ఫ్రాన్సువారి గూఢచారులు గారిబాల్డీసేనలో ప్రవేశించి రహస్యముల గ్రహించుచుండిరి. వీరిని పట్టు కొని బంధించిరి. ఫ్రాన్సువారిసైనికులు గారిబాల్డీసైని కులకంటె మూడురెట్లెక్కువగ నుండిరి. ఆస్ట్రియను సేనలుకూడ ఫ్రాన్సువారికి మద్దతుగ వచ్చుచుండెను. వీ రుభయులు బలముగలవారే. అయినను స్వాతంత్ర్య కాంక్షగల నిర్మలదేశభక్తులదాడి కాగలేక పారిపోవు చుండిరి. వీరిచక్రవర్తులు, యుద్ధమంత్రులు సైనికుల కుత్సాహము గలుగజేయ సకలప్రయత్నములను గావిం

చిరి. కాని స్వాతంత్ర్యయోధుల కరవాలముల కెదురు నిలువలేక కాలికి బుద్ధి చెప్పిరి. గారిబాల్డియే జయము గాంచెను.

ఇంతటితో సంగ్రామము నిలువలేదు. నేపుల్సు ప్రాంతములను స్వాతంత్ర్యయోధులు ముట్టడించిరి. గత యుద్ధమునందు ఓడి పిరికిపందలై యున్న శత్రుసైన్యములు రెండుదినములలోనే జంకి కదనరంగమునుండి పారిపోయెను. అన్నియుద్ధములలోకంటె నీయుద్ధమున స్వాతంత్ర యోధులు తేలికగ గెలిచిరి. నిజముగ నిది యొకయుద్ధము గాదనియే చెప్పవచ్చును. ఫ్రాన్సురాజు రాజమందిరమునుండి పారిపోయెను. వీరగారిబాల్డి తన దగ్గఱనున్న కొలదిసైనికులతోనే నేపుల్సును స్వాధీనము చేసికొనెను. నాడు గారిబాల్డి తనసేనతో ఆనగరరాజ వీధుల వెళ్లుచుండ స్వాతంత్ర్యమును కాంక్షించుపౌరులు వేలకొలది యెదురుగ వచ్చి ఆహ్వానించిరి. నాయకుని యోధులను పూలమాలలతో నింపిరి. విజయదుందుభిని ప్రమోగించిరి. పట్టణమునం దందరును విజయోత్సవము జరిపిరి. పురుషులు, స్త్రీలు, బాలురు, బాలికలు ఆవిజయోత్సవమున పాల్గొని నగర మంతయు వివిధాలంకారములతోను, జాతీయపతాకములతోను నలంకరించిరి.

ఎచ్చట జూచినను విజయధ్వానములే. ఎచట గాంచినను ఆనందమే. ఎచట వీక్షించినను నృత్యములే. ఎచట విన్నను గానములే. ఇది యంతయు 1860 సం॥ సెప్టెంబరు 7-వ తేదీన జరిగెను.

పైయుద్ధముతో ఉత్తర, మధ్యమ, దక్షిణఇటలీ యంతయు స్వాతంత్ర్యయోధుల చేతిలో చిక్కెను. రోము నగరముమాత్రము ఫ్రాన్సువారియధీనములో నుండెను. మరల నొకమారు దేశ మంతయు విజయోత్సవములు గావించిరి. గారిబాల్డీకి జరిగిన సత్కారములు వర్ణనాతీతములు. ఆయన నొక దేవదూతగనే భావించి ప్రజ లెల్లరు గౌరవించిరి. దేశమున అన్నిప్రాంతముల నుండి యీయన త్యాగమును, ధైర్యమును, పట్టుదలను కొనియాడుచు లక్షలకొలది లేఖలు వచ్చినవి. వేలకొలది స్వయముగవచ్చి సందర్శించి ధన్యులయిరి. అన్నిప్రాంతములవారును గారిబాల్డీనే డిక్టేటరుగ నెన్నుకొనిరి. కాని ఆయన సర్వాధికారములను ఎమానుయల్ చేతిలో పెట్టెను. రాజు మొదట అనేకసంవత్సరములనుండి చెఱసాలలో క్రుమ్మగుచున్న రాజకీయ నిర్బంధితులను విముక్తి గావించి, వారి నందఱ నొకచోట సమావేశపఱచి, వారి త్యాగములను, కష్టములను పొగడి సత్కరించెను. ప్రజ

ల్లెరు ఈ దేశభక్తులను పూజించిరి. అనాథలకు, శిశువులకు శరణాలయములు నెలకొల్పిరి. రాజుల ధనరాసులను ప్రజోపయోగకార్యముల కుపకరించెను. ముద్రణయంత్రములకు పత్రికలకు స్వేచ్ఛ నొసగెను. విద్యాలయములను జాతీయ భావములను కలుగజేయునటుల మార్చెను. దారిద్ర్య-భాగ్యభేదములు లేకుండ జేసెను. కులభేదములు నశింపజేసెను. దేశమున అన్నికళలు నూత్నరీతుల పెంపొందజేసి జాతిని జీవము గలదానినిగ జేయనారంభించెను.

డిక్టేటరుపదవి యిప్పటి మన వైస్రాయి అధికారముకంటె ఎక్కువైనది. కాని ప్రజాసేవయే పరమావధిగ నెంచిన మన గారిబాల్డీ ఆపదవిని తృణప్రాయముగ నెంచి స్వాతంత్ర్యసమరములో జేరి పోరాడి కీర్తి గాంచిన విక్టరు ఎమానుయల్‌కు సర్వాధికారములు ఒప్పగించి, ఆయనకు తగినసలహాల నొసంగుచుండెను. రాజుకూడ నీదేశభక్తునిసలహాల ననుసరించియే ప్రజాసేవ చేయుచుండెను. మనదేశభక్తునికి పలుబిరుదములను, సంవత్సరమునకు 5000 రూపాయలను ఇవ్వవలయు నని రాజు ప్రయత్నించెను. వీని నన్నిటిని త్రోసిపుచ్చి కేప్రరాద్వీపమున తనకుటీరమున కాల

క్షేమము చేయ నారంభించెను. ఈయనతో రెండవ భార్యయు, మొదటిభార్యపుత్రులును ఉండిరి. పుత్రులు పెద్దవారగుటచే వారికి విద్యాభ్యాసము స్వయముగనే గావించుచుండెను. వారికి నిరాడంబరత్వము, దైవభక్తి, పెద్దలయెడ గౌరవము, సత్యము మొదలగునీతులు బోధించెను. వ్యవసాయము చేసికొనియే జీవనము చేయుచుండెను. ఈమహనీయుని నిరాడంబరజీవనమును జూచి ప్రజ లెల్లరును ఆశ్చర్యపడజొచ్చిరి. ప్రజలకు ఏకష్టము వచ్చినను స్వయముగ పోయి సేవ చేయుచుండెను. ఈయనబిడ్డలు భార్యలుకూడ నీయనత్రోవనే వర్తించుచు ఆనందము గలుగజేసిరి. ఇట్టివారు లభించుట ఆయనయదృష్ట మనియే చెప్పవచ్చును.

గారిబాల్డి యొకమాఱు సిసిలీ వ్యవహారములలో పలుభంగుల సాయము చేసిన, యాంగ్లేయ సేనాధిపతి యగు ఎడ్మిరల్ మండి దగ్గఱకు వెళ్లి రాజకీయవ్యవహారములు మాటలాడెను. మనయోధుడు, ఎడ్మిరల్‌తో నీ విధమున జెప్పెను. "మొదటిసారిమిమ్ము పలెర్మోయందు గాంచిన దృశ్యము నీజన్మయందు మఱువజాలను. తమ యుదారభావము, నిష్పక్షపాతము, కార్యచతురత మఱువజాలను." మనయోధుడు పై సైన్యాధ్యక్షుని తన

౹

తొమ్మిదవ అధ్యాయము

క్రెప్రరాకుటీరమున కాహ్వానించెను. సముద్రతటము నకు షికారుకు వెళ్లినపుడు, "ఆంగ్లేయవీరుడగు నెల్సన్ తన నావల నాపి విశ్రమించినది యీపవిత్రస్థానముననే" యని చెప్పెను. రోము, వెన్నిస్, ఫ్రాన్సు, ఆస్ట్రియాల రాజుల సొత్తుగాదు. ఇటలీదేశీయుల సంపద. సమస్త ఇటలీ యేకము కానంతవఱకు నాకును నాజాతికిని విశ్రాంతి లేదు. ఫ్రాన్సురాజు మా గర్భశత్రువు. పది లక్షల యోధుల ప్రాణము లర్పించి యైనను రోమునగర మును స్వాధీనము చేసికొనెదను," అని యీ మిత్రునితో జెప్పెను. నేపిల్సువాసులు, ఈక్రిందిలేఖను మన యో ధునకు వ్రాసిరి. "పితృదేవా! ప్రతిదినము, ప్రతిగంట, ప్రతినిముసమును మిమ్ము స్మరింపుచుందుము. తమనామ మును మాబిడ్డలకు బెట్టుకొని పూజించుచుంటిమి. మీ స్వార్థత్యాగము, దేశభక్తి, పట్టుదల వలననే మేము స్వాతంత్ర్యమును బొంది స్వేచ్ఛా వాయువుల పీల్చు చుంటిమి. మీరక్తము మాకొఱకై ధారపోసితిరి. పూజ నీయా! యొకమాఱు దర్శన మిచ్చి మమ్ము ధన్యుల జేయుము. ఒకమాఱు విక్టర్ ఏమానుయల్ ఈ యోధుని యాహ్వానించి గౌరవించి కేవర్ మంత్రివర్గము నకు వ్యతిరేకముగ నుండవలదని ప్రార్థించెను. మిమ్ము

లను హృదయపూర్వకముగ గౌరవించెదను. కేవల దేశారిష్టమగు కార్యములు చేసినపుడు తప్పక వ్యతిరేకముగ నుందును అని గారిబాల్డీ నిష్కర్షగ చెప్పెను.

1862 లో గారిబాల్డీ రోమునగరమును తమదేశీయులకు స్వాధీనము చేయుమని కోరెను. ఫ్రాన్సునరేశుడును, మంత్రిసత్తముడును రోము మీా కెప్పటికిని స్వాధీనము చేయమని చెప్పిరి. దీనికి గారిబాల్డీ క్రుద్ధుడయ్యెను. మరల ఇటలీదేశభక్తుల సమావేశపఱచి కర్తవ్యమునుగూర్చి చెప్పెను. వెంటనే వేలకొలది దేశభక్తులు మనయోధుని నాయకత్వమున యుద్ధమున కరిగిరి. శత్రుబల మెక్కువగ నుండుటచే నోడిపోవ సివచ్చెను. గారిబాల్డీ శరీర మంతయు తుపాకి గుండ్ల గాయములతో నిండి పోయెను. తొడయందు పెద్ద రంధ్రము పడెను. రక్త ప్రవాహము పారజొచ్చి స్మృతి దప్పి పడిపోయెను. జాగ్రత్తగా నీ యోధుని స్వగృహమునకు చేర్చిరి. 13 నెలలు ఈ గాయములతో బాధపడెను. బాధలో నున్నప్పుడుకూడ సంయుక్త ఇటలీని గాంచవలయు నని కలవరించుచునేయుండెను.

మనయోధుడు 1864 సం॥ పలువు రాంగ్లేయ మిత్రులయాహ్వానముమీాద ఇంగ్లండునకు వెళ్లెను. వా

రంద ఆదేశభక్తుని పలుకితుల గౌరవించిరి. ఆయన దేశభక్తిని పొగడిరి. గారిబాల్డియు, నుదారహృదయు లగు నాంగ్లేయులు తమకు చేసినసహాయమునకు కృతజ్ఞతను తెల్పెను. లండనునగరమున రష్యాదేశభక్తుడగు హార్జన్‌గృహమున 2-వ సభ జరిగెను. ఆసభకు పలు దేశములనుండి దేశభక్తులు వచ్చిరి. ఆసమయమున గారిబల్డీ ఈవిధమున నుపన్యసించెను.

"ఈసభయందు మా ఇటలీదేశమునకు నందఱ కంటె మిన్నగ సేవచేసిన మహాపురుషుడు గలడు. సత్యసంధత, నిరాడంబరత్వము, కార్యాభినివేశము, దూరదర్శిత్వము, నిర్మలదేశభక్తి ఆయనలో మూర్తీభవించి యున్నవి. అప్రమత్తులమై నిద్రించుచున్నమమ్ము మేల్కొలిపిన మహానీయుడు. ఆయన లేకపోయినచో, మేము బానిసత్వబంధమునుండి విముక్తి జెందెడివారము గాము. దేశసేవ చేయవలయు నని దిక్కులేక తిరుగుచున్న నాబోంట్లకు జ్ఞానశిక్ష నొసంగి మార్గము చూపినపవిత్రమూర్తి. ఆయనయే యామూల సామాన్యునివలె గూర్చున్నత్యాగమూర్తి. ఆయననామము మేజిని. ఈపురుషోత్తముడు నాకు గురువు, మిత్రుడు."

1870 సం॥న ప్రషియావారికి, ఫ్రాన్సువారికి యుద్ధము జరిగెను. ఈసమయమున రోముచు గాపాడు చున్న పరాసుసేనలు ఫ్రాన్సుదేశమునకు పోయెను. ఇదియే యదనని తలచి గారిబాల్డీ ఎమానుయల్ తమ సేనలతో రోమునగరమును ముట్టడించి స్వాధీనము చేసికొనిరి. గారిబాల్డీకోరిక ఫలించెను. ఇప్పటినుండియు రోమునగరమే ఇటలీకి ప్రధాననగర మయ్యెను. అసమానశూరుడు పట్టినపట్టుదల ఫలింపకుండునా?

గారిబాల్డి జీవితము

పదియవ యధ్యాయము

గారిబాల్డీ, కష్టపడుచున్న మానవుల జూచి సహింపనోల్లడు. 1872 సం.రం ప్రారంభమున టర్కీవారి పాలనక్రింద నున్న సర్వియా, రొమేనియా రాజ్యములలో స్వాతంత్ర్యోద్యమము మొలక లెత్తెను. అప్పటికి గారిబాల్డీ వృద్ధుడు. ఆస్వాతంత్ర్యోద్యమముమీద నభిమానము గలిగెను. కాని శరీరమున శక్తి లేదు. వీరిని టర్కీవారు పెట్టుచున్న హింసలను హృదయములు కరగునటుల వార్తాపత్రికలలో ప్రచురించుచు సహాయము చేయుచుండెను. ఆంగ్లమంత్రిమండలికి నీక్రింది లేఖ వ్రాసెను.

"ఆంగ్లమంత్రిసత్తమా!

మీరు ఉదార హృదయులు. మా కష్టముల జూచి మాకు సహాయమును చేసితిరి. మీరు చేసినమేలు మే మెన్నటికిని మఱువజాలము. మావలెనే సర్వియా,

రోమేనియా ప్రజలు ఇపుడు టర్కీవారితో బాధపడు చున్నారు. వారుకూడ మానవులే. కాన తాము వారికి సాయము జేయవేడెద."

ఇట్లు:
గారిబాల్డీ.

ఈవిధమున నే పలుదేశములవారికి వ్రాసి సహాయము చేయించెను.

1860 సం॥ నవంబరు నెలలో మిలాన్ నగరమున స్వాతంత్ర్యయుద్ధములో పాల్గొని కీర్తికాయులైన దేశభక్తుల స్మృతిచిహ్నముగ నొకవిజయస్తంభమును నెలకొల్ప సంకల్పించిరి. ఆయుత్సవమును జరుప గారిబాల్డి నాహ్వానించిరి. వృద్ధాప్యముచే నశక్తుడైనను వారికోరిక నెఱవేర్చుటకు మిలాన్‌నగరమునకు పోయెను. అప్పుడొకగొప్ప యుత్సవమును జరపిరి. మనయోధునికి జరిగిన సత్కారములు వర్ణనాతీతములు. ఆపవిత్రసమయమున చదువుట కొకయుపన్యాసమును వ్రాసికొనిపోయెను. కాని యలసిపోవుటచే చదువలేక యింకొకరిచే చదివించెను. ఆయుపన్యాసమును విని సమావేశమైన వేలకొలది ప్రజలు చకితులైరి. ఇదియే యీమహనీయుని యంత్యోపన్యాసము.

I

పదియవ అధ్యాయము

మిలాన్ నగరమున నే జబ్బు చేయుటచే నతిజాగరూకతతో మన యోధుని స్వకుటీరమునకు తీసికొని వచ్చిరి. శయ్యనుండి లేచుటకుగూడ శక్తిలేకపోయెను. ప్రియపత్ని రాత్రింబవలులు విసుగులేక సేవ చేయుచుండెను. కొంచెము నెమ్మదిగ నున్నపుడు సముద్ర తీరమునకు బండిమీద పోవుచుండెను. ఎవరు కనబడినను యోగక్షేమము లరయుచుండెను. కనుపడినవారెల్లరు ఈపూజ్యునికి నమస్కరించుచుండెడివారు. భోజనము సామాన్య దరిద్రజనులు చేయునదియే భుజించుచుండెడివాడు. ఆకలి యెక్కువగ నున్నపుడు పచ్చిమాంసమును భుజించెడివాడు. ఇది తినుట కష్టము గాదా యని మిత్రు లడిగినపుడు మేము దక్షిణయమెరికాలో యుద్ధము చేయునపుడు తినుట కేదియు లభించెడిది గాదు. మాదగ్గఱ వంటసామగ్రియు నుండెడిది గాదు. అందుచే కనబడిన జంతువులను చంపి పచ్చిమాంసమే భుజించెడివారము. అని ప్రత్యుత్తర మిచ్చెడివాడు. భోజనము చేసినతరువాత కుటుంబము నంతయు చుట్టును గూర్చుండబెట్టుకొని ప్రొద్దుపుచ్చుచుండెడివాడు. ఆసమయమున వారల కుత్సాహము గలిగించు తన జీవన చరితమును చెప్పుచుండెడివాడు. వారికి దేశభక్తి గలుగ

జేయు నితిహాసములు చెప్పుచుండెడివాడు. ఆ దినము లలోగూడ ప్రతిదినముగూడ వందలకొలది లేఖలు, తంతి వార్తలు వచ్చుచుండెడివి. వానికి దగినప్రత్యుత్తరములు సకాలమున పంపుచుండెడివాడు. రాజకీయముగ ప్రతి దినము సలహా నిచ్చుచుండెడివాడు.

ఇపుడుగూడ వార్తాపత్రికలు చదివించుకొని విను చుండెడివాడు. తనజీవనఘటనలను వార్తాపత్రికలకు వ్రాయుచుండెడివాడు. ఆలేఖలను ప్రచురించుకొని వార్తా పత్రికలవారు ధన మొసగుచుండెడివారు. ఆలేఖలను దేశీయులేగాక అన్యదేశీయులుగూడ పఠించుచుండెడి వారు. ఈదినములలో ప్రథమభార్యాపుత్రుడైన మాన్ లీయరుకు విద్యాబుద్ధులు స్వయముగా గఱపుచుండెను. ఈబాలునిమీద మిక్కిలి ప్రేమ. తనకు తగినపుత్రుడు కాగల డనునమ్మికతో పలువిషయములను బోధించెను. ఈపుత్రుని జూచునప్పుడు ఎనిటా జ్ఞాపకము వచ్చెడి దట. అందుచే నత్యంతప్రేమతో జూచుచుండెడివాడు. పుత్రుడుగూడ పితృభక్తుడు.

1882 వ సం.రం జనవరిమాసమున ఈబాలకుడే బండి తోలుచుండెను. బండి పడి గారిబాల్డి క్రిందబడి మూర్ఛితు డాయెను. దెబ్బతగిలి గాయ మాయెను. ఆ

రక్తము జూచి బాలు డేడ్చుచుండెను. స్పృహ వచ్చిన తరువాత శోకించుచున్న పుత్రునిజూచి "ఈ రక్తమును జూచియే దుఃఖించుచున్నావా? వీరుని కిది లక్షణము గా"దని మందలించెను. అప్పటి నుండియు గారిబాల్డీ శ్వాసరోగపీడితు డాయెను. ఆరోగ్యముకొఱకు "డాసిలి పో"నగరమునకు తీసికొనిపొమ్మని వైద్యులు సలహా నొసంగిరి. డాసిలిపోకు పోవు మార్గముననే నేపుల్సు రాష్ట్ర ముండెను. ఆరాష్ట్రవాసులెల్లరు లక్షల కొలది జబ్బుగా నున్న తమ దేశనాయకుని సందర్శింపవచ్చిరి. ఆపూజ్యుడు శయ్యమీదనే పరుండియుండెను. ఓడలో నొకగదియం దుంచిరి. గాలిని భరించలేకుండెను ప్రాణ వాయువు వచ్చుటకు మాత్రము చిన్నరంధ్ర ముంచిరి. ప్రియపత్ని ప్రక్కనే కూర్చుండి యుపచారము చేయు చుండెను. జబ్బుగా నున్న తమ నాయకుని జూచుటకు వృద్ధులు, నారీమణులు, పసిపాపలు అరుదెంచిరి. కృతజ్ఞ తను వెల్లడించిరి. తన యనుంగుప్రజలను గాంచుటకును వారితో సంభాషించుటకును వైద్యుల ననుమతిని వేడెను. ఈదుర్బలస్థితిలో పెక్కురతో సంభాషించిన ఆరోగ్యము మిక్కిలి చెడుననియు, ప్రాణాపాయము గూడ గలుగ వచ్చుననియు భయముచే వైద్యులు సమ్మతింపరైరి.

మంత్రిమండలితో మాత్రము సంభాషించుటకు నంగీక రించిరి. వారే రాష్ట్రప్రతినిధులుగా నంగీకరించి మాట్లాడెను. మంత్రులెల్లరు వచ్చి కుశలప్రశ్నలనడిగిరి. తమ నాయకునికి కలిగిన అనారోగ్యమును జూచి దుఃఖించిరి. తమరాష్ట్రపరిపాలన ఏవిధమున నున్నది, స్వాతంత్ర్యము పొందినపిమ్మట అన్నిశాఖ లభివృద్ధి చెందుచున్నవనియు మనవిచేసిరి. సమావేశమైన ప్రజా సమూహాములు తమ నాయకుని సందర్శనముచే తృప్తిపడినవి. ఇదియే కడ సారి దర్శన మని వగచిరి.

"డొసిలిపో" నగరమునకు వెళ్లిన తరువాత నారోగ్య మభివృద్ధి గాంచెను. మరల శయ్యనుండి లేచి తిరుగునంతశక్తి గలిగెను. వైద్యులు గూడ తగినంత జాగ్రత్త తీసికొనుటచే మంచియారోగ్యమే కలిగె నని చెప్పవచ్చును. ఈసమయమున వెస్‌పర్ నగరవాసులు మనదేశభక్తుని నాహ్వానించిరి. ఆయన రాక సందర్భమున నగరమంతయు చిత్రచిత్ర తోరణములతోను, జాతీయపతాకములతోను, కనులపండువుగనలంకరించిరి. వేలకొలది పౌరులు ఆయనకు స్వాగత మొసంగి పుర వీధులలో నూరేగించిరి. ఒక గొప్ప చక్రవర్తి కైనను యిట్టిసన్మానము జరుగుట అరుదని చెప్పవచ్చును. ఆ

యుత్సవములో నాబాలగోపాలము పాల్గొని నాయకుని యెడలగల భక్తిని వెల్లడించిరి. ఈ యుత్సవాందోళనముచే నీదేశభక్తున కాయాసము కలిగినది. ఆరోగ్యము చెడి దుర్బలు డాయెను. సాయంకాలము సభలోనికి రాలేకపోయెను. తమ నాయకుని వాగమృతమును గ్రోల నుత్సహించి సభ కరుదెంచిన వేలకొలదిపౌరులు కాశా భంగము కలిగెను. కాని ఆయన అనారోగ్యమునకు వారును వగచిరి. వెంటనే తగుజాగ్రత్తతో స్వస్థానమగు కేప్రరాద్వీపమునకు తీసికొనివచ్చిరి. మార్గాయాసముచే వ్యాధి తీవ్రరూపమును దాల్చెను. స్వస్థానమునకు చేరగనే రోమునగరమందున్న సుప్రసిద్ధ వైద్యపుంగవునకు తంతి నొసంగిరి. వీరివార్త చేరగనే ఆయనవచ్చి చికిత్స చేసెను. కొంతవఱకు సుగుణముగ నున్నదనియే చెప్పవచ్చును. 1882 సం.రం మే 24 వ తారీఖున గ్రామమునకు నరమైలుదూరమున నున్న తన ప్రియపుత్రి సమాధిని చూచి వచ్చెను. ఆసమాధిమీద పుష్పములు చల్లి అంత్యబాష్పబిందువులు రాల్చెను.

స్వగృహమునకు తిరిగివచ్చునప్పటికి ఆయాసము కలిగెను. పెద్దకుమారుని పిలిచి చాల జబ్బుగనున్న దని చెప్పెను. దగ్గఱనున్న వైద్యులు తమ శక్తికొలదిచికిత్స

చేయుచుండిరి. ప్రియపత్ని ఫ్రాన్సిస్కా నిరంతరము సేవ చేయుచు ప్రక్కనే యుండెను. పెద్దకుమారుడు రోము నగరమున నున్న "ఎల్బానిక్" అను సుప్రసిద్ధ వైద్యునకు, తండ్రికి చాల జబ్బుగనున్న దనియు, వెంటనే బయలుదేరి రమ్మనియు తంతి నొసంగెను. ఈ పూజ్యునకు చాల ప్రమాదముగ నున్న దనువార్త దేశమున నలుదిక్కుల వ్యాపించెను. లక్షలకొలది ప్రజలు వచ్చి తమనాయకుని చూచిపోవుచుండిరి. ఈ సమయమున మన గారిబాల్డి యున్న గది గవాక్షమునందు విహంగ ద్వయము మృదుమనోహరగానము చేయుచుండ, "ఆ శకుంతములు నాప్రియసంతతి. అవసానసమయమున నన్నాహ్వానించుటకు ప్రేమతో వచ్చినవి. కాన వానికి ఆహారపానీయము లొసంగు" డని మన యోధుడు చెప్పెను. వెంటనే వానికి క్షీరములు, ఫలములు ఒసంగిరి. 1882 సం.రం జూన్ 2 వ తేదీన గారిబాల్డికి ప్రమాదము హెచ్చెను. వైద్యులు చుట్టు నుండిరి. వారి శక్తికొలది పలుభంగుల చికిత్స జేయుచునే యుండిరి. నాడే ఎల్బానిజ్ వచ్చు దినమగుటచే సముద్రము వైపు చూచుచుండెను. సాయంసమయ మాయెను. వైద్యుడింకను రాలేదు. ఆ ఇటలీదేశోద్ధారకు డగు గారిబాల్డి

అనశ్వరమైన తనువును విడచి స్వర్గలోకమునకు జనియెను.

తమ దేశనాయకు డగు వీరగారిబాల్డీ స్వర్గస్థ డయ్యెనను పిడుగువంటి వార్త అగ్నిజ్వాలవలె దేశమునం దంతటను వ్యాపించెను. ఇటలీదేశీయు లెల్లరు తమఆత్మ బంధువుని గోల్పోయినవారివలె దుఃఖాంబుధినిమునింగిరి. ఈ సమయమున రోమునగర రాజమున పౌరులు పెక్కురు నాట్యశాలలలో ఆనందమున నోలలాడు చుండిరి. ఈ దారుణవార్త వినగనే దేశమునందున్న నాటక శాలలు, సంగీత సభలు మూయబడినవి. ఆనందసాగరమున మున్గియున్నప్రజలు శోకింప నారం భించిరి. దేశమున ఏపట్టణమున గాంచినను, ఏపల్లె యందు వీక్షించినను దుఃఖసూచకచిహ్నములే. దేశము నంగల ప్రముఖు లెల్లరు విషాదసూచకముగ నల్లని వస్త్రములను ధరించిరి. ఈదేశబాంధవుని ఎడబాటునకు ఇటలీదేశమున విలపింపనిమానవుడు లేడు. బాలబాలి కలుసైతము తమనాయకుని గోల్పోయినందుకు వాపోయి రనువార్త విని ఏరు ఆశ్చర్యచికితులు గారు? ఈవార్త వినగనే దేశమున సకలవిధములయుత్సవములు మాని వేసిరి. పాఠశాలలు మూయబడినవి. వ్యాపార మంత

యు కట్టివేయబడెను. బండ్లు తోలువారు సైతము ప్రయాణములను మానివేసిరి. రైళ్లుకూడ నాపివేసిరి. ఈసమయమున ఎమాన్యుయల్ కుమారుడు హంబర్టురాజుగ నుండెను. ఆయన ప్రభుత్వభవనములమీద నున్న పతాకములను దింపించి తమ దేశనాయకునియందున్న భక్తిని వెల్లడించెను. ఈదేశభక్తుడు తనజనకునికి చేసిన సాయమును తలచుకొని విలపించెను. గారిబాల్డీ పుత్రునికి క్రిందిసానుభూతిలేఖను వ్రాసెను.

"నిర్మలదేశభక్తులును, ఇటలీ దేశోద్ధారకుడును, స్వార్థత్యాగియు నగు మీ జనకుని మరణవార్త విని నేనును, నాప్రజలును మిక్కిలి వగచుచున్నాము. నా ప్రియజనకుడు ఈదేశభక్తుని పూజించవలయు ననియు ఆయన యాజ్ఞల జవదాటరా దనియు, నాకు చెప్పిపోయెను. నాజనకుని యాజ్ఞప్రకారము నేనొకనాడయినను ఆపూజ్యుని సలహా లేనిది ఏకార్యమును చేసియెఱుగను. ఆ త్యాగమూర్తి నాకు జనకుని వలెనే యుండెను. ఆమహాపురుషుని నిష్కలంక దేశభక్తిని, త్యాగమును, సేవాపరాయణతను, కార్య దక్షతను, నేనును, నాప్రజలును ఎన్నటికిని మఱువజాలము."

పదియవ అధ్యాయము

దేశమునంగల వార్తాపత్రిక లన్నియు ఈ వీరుని జీవనరహస్యములను, వేనోళ్ల పొగడెను. కొన్ని నెలల వరకు ఈత్యాగమూర్తి జీవితమే పత్రికలు ప్రకటించెను ఆయనతో కలసిమెలసి స్వాతంత్ర్యసమరమును సాగించిన మిత్రులు ప్రతిస్వల్పవిషయమునగూడ ఆ త్యాగమూర్తి దృఢసంకల్పమును వెల్లడిజేసిరి. ఆవీరపుంగవుడు లేనిచో ఇటలీస్వాతంత్ర్యమును పొందెడిదిగా దని వారెల్లరు వక్కాణించిరి. ఆపూజ్యుని త్యాగమే ఇటలీ స్వాతంత్ర్య దేవి.

ఇట్టి పుణ్యపురుషుల సేవాపరాయణత వలననే దేశములకు కల్యాణము కలుగును. పతితమానవుల నుద్ధరించుటకొఱకే యీత్యాగధను లుద్భవించి దేశముల సుభిక్షము గలవానిగ జేతురు. ఈ వీరపుంగవుల జీవితములే ధన్యములు. ఓ వీరగారిబాల్డీ! నీవు ధన్యుడవు. నీశరీరము పోయినను నీయాత్మ మమ్ము విడువదు. నీ కీర్తిని ప్రపంచమున్నంత వఱకును గానము చేసి ధన్యుల మయ్యెదము.

వందే మాతరమ్

[illegible]

	మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	TPLA107B169
పుస్తకం పేరు	[illegible]
తారీఖు	25/10/24
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	157
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	vi,148
లేని పేజీలు	NO
తయారు చేసినది	Ch. Ramya
పేజీలు విడదీసినది	Thasin
స్కాన్ చేసినది	Hema
పరీక్ష చేసినది	ROHITH
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యనివి	
తప్పులు	No
పరిస్థితి	Good